
పత్రిక
సంక్రాం
సంచిక
11-1-6
25 నయాపై

ఈ పత్రికలో మీకు ఆనందము ఇచ్చేది

కునేగ

మరికొళుందు

సెంటుయొక్క రమ్యమైన సువాసన!

నేడే మనియార్డర్ ద్వారా రు. **1-50** పంపిస్తే **4** రకాల
కునేగా సాంపిల్ సెంటు పంపిస్తాం. (పోస్టేజి వేరే లేదు)

		1 ఔ॥	½ ఔ॥	¼ ఔ॥
కునేగా —	మరికొళుందు	10-00	5-25	2-75
,,	మిగత రకాలు	9-00	4-75	2-50
,,	అత్తర్	21-00	11-00	6-00
,,	మొగ్గలి	21-00	11-00	6-00
,,	స్వీటు	15-00	8-00	4-50

తపాలు ఖర్చు రు. *1.00* ను, *7%* సేల్సుటాక్సును మనియార్డరుతోపాటు పంపాలి.

వి. పి. పి. పంపడము లేదు.

కునేగా

53, లాటిస్ బ్రిడ్జి రోడ్ : : అడయార్ : : మద్రాసు-20.

CUNEGA

53, LATTICE BRIDGE ROAD

ADYAR — MADRAS-20.



ముఖచిత్రం

28—12—62 తారీఖు పత్రికలో కృష్ణ, కుమారి ఫోటో క్రింద ఒక 'జోక్' వేశారు. 'కోతులకు ఆహారం వేయరాదు' అని బోర్డు పెట్టి, లోపలను కోతులను వేశారు కాని, కోతులకు తోకలుంటాయి కదా! ఈ కోతులకు తోకలు లేవు ఎందుకు వేయ లేదో కొంచెం మనవి చేస్తారని ప్రార్థన

పి. వి. కృష్ణమూర్తి (సికిందరాబాదు)

* * *

4—1—63 వ తేదీ ముఖచిత్రంలో కార్టూను విషయం చిన్న అనుమానం వచ్చింది మీ పత్రికా ముఖమున సందేహము తీరుస్తారని ఆశిస్తున్నాను.

పేషంటు పల్సుబీటు ఫోను ద్వారా అవతలి డాక్టరుకు వినిపించి—"మీ అభిప్రాయం ఏమిటి డాక్టర్" అని ఫోను పట్టుకున్నతను అంటున్నాడని నేనూ, అది కాదని, మా తండ్రిగారూ వాదించు కున్నాము. మా ఇద్దరిలో ఎవరు రైటు? అట్లు కానిచో కార్టూను అసలు అర్థం ఏమిటి?

వట్టి హైమవతి (మాధవరం)

మీ రిచ్చిన అర్థమే సరియైనది, అనుకుంటున్నాము!

* * *

కృష్ణకుమారి ముఖచిత్రము చాల అందముగా, ఆకర్షణీయముగా యున్నది. కాని ముఖచిత్రముతో పాటు పరిచయము చేసినచో పాఠకులకు ఎంతో ఆనందముగా యుండును.

చిప్పాడ జగన్నాధము (శృంగవరపుకోట)

సీరియల్ కథలు

శ్రీ రంగధామ్ వ్రాస్తున్న 'శ్రీదేవి'లో సహజత్వం నిండుగా ఉంది. 'రమేశ్' పాత్రను కథలో ప్రవేశపెడుతూనే, అతని శీలాన్ని చిన్న సన్నివేశంతో పూర్తిగా బోధపర్చారు ......"వదినా! బంగాళా దుంపలే, వీసె 5 రూపాయలు అమ్ముతూఉంటే 2 రు. లు. ఏం సరిపోతవి" అనే అతని మాటలు, పై డబ్బులకు ప్రాకులాడే అతని విధానాన్ని చక్కగా వ్యక్తం చేశాయి. రిజాలాగా తిరిగే అబ్బాయిలు... సిగరెట్టు ఖర్చుకు చేసే కమీషన్ వ్యాపారంలో ఓ ఉదాహరణ ఇచ్చారు. ..నాకు నవ్వు ఆపుకోలేనంతగా వచ్చింది.

అసలు కథ కూడా రసవత్తరంగానే ఉంది.

ముమ్ముందు ఇంకా బాగుండే సూచనలు ఉన్నవి

కూతా గంగాజలం (ఏలూరు)

* * *

మీరు నూతన సంవత్సర ప్రారంభములో "కన్నీరు పన్నీరు" లాంటి చక్కని కథ నెన్నుకొన్నందులకు ధన్యవాదములు. ఈ కథా రచయితలయిన వందివాడ భీమారావుగారు ఆదిలోనే పాఠకులను కన్నీళ్లలో ముంచి తేల్చివేసినారు. ఈ కథ చదువుతున్నంతసేపు అసలు కథను వదలి "ళ" లు వరుస కెన్ని యున్నవో లెక్కించుటకు సరిపోయినది. అందువలన మరల రెండవ తూరి చదువవలసి వచ్చినది. పాఠకుల హృదయముల నీ కథా రచయిత పరవళ్ల త్రొక్కే నీళ్ల ఘోషతో లీనము చేసినారు. అయినా, కాని, అసలు కథ కందము చెడలేదు.

కె. సీతాపతిరావు (గుడివాడ)

* * *

మీరు ప్రతివారం ప్రచురించే సీరియల్ విచిత్ర

ఉత్తరాలు

వివాహం చాలా బాగుంది. సదరు రచయితగారు పేరు 'యు' మాత్రం ఉన్నది. వారియొక్క పూర్తి పేరు తెలుపకున్నమూ, వారు పోలీసు డిపార్టుమెంటు లోనుండి పింఛనులో వెళ్ళినప్పటికిన్ని వారి అనుభవం వివరంగా తెలియపర్చి మమ్మానందింపజేసి నందులకు వారికి మాయొక్క కృతజ్ఞతాపూర్వక వందనములు తెలియపరుస్తున్నాను.

కాంతి శ్రీనివాసరావు (ఎ. ఎం. సి.)

* * *

శ్రీమతి కోమలాదేవిగారి "బంగారు పంజరం" చదివి ఆమెని అభినందించకుండా ఉండ లేక పోతున్నాను.

లక్ష్మి (గుంటూరు)

* * *

"బంగారు పంజరం" సీరియల్ కథ చాలా బాగుంది. కుటుంబములోని కష్టసుఖాలు సహజంగా చిత్రించి ప్రతీ పాత్రనుఎంతో ఉత్సాహంగా నడిపి, చివరికి సుఖాంతం చేసిన రచయిత్రి కోమలా దేవిగారు అభినందనీయులు.

చాగంటి బాలాత్రిపురసుందరి (భీమడోలు)

* * *

వారం వారం "బంగారు పంజరము" కథ చదువుతూ ఉంటే చక్కెర తిన్నట్లుండేది అయిపోయిందని వ్రాశారు నా వోరు చప్పగ అయి పోయిందంటే నమ్మండి.

టి. సరస్వతి కుమారి (పుంగనూరు)

* * *

కోమలాదేవిగారి "బంగారు పంజరం "సీరియల్ కథ అయిపోయింది అనగానే ఇంత చక్కటి సీరియల్ కథ మళ్ళీ చదవగల్గుతామా అనిపించినది. రచయిత్రిగారు కథను సుఖాంతము చేసినందుకు వారికి నా అభివందనలు.

కొప్పాక రామకృష్ణ; జనార్దన (సికింద్రాబాదు

చిత్రవ్యక్తులు

నా అభిమాన తారలయిన జమునను, సావిత్రిని పరిచయం చేస్తారేమోననే ఆశతో ప్రతీవారం పావలా దండగ పెడుతూ, నిరాశ చెందుతున్నాను. ఇంతవారిని పరిచయం చేసుకునే యోగం ఉందో లేదో నని నాకు

పి. స్వర్ణలత (సికింద్రాబాదు)

కథ

పత్రికలో ప్రచురింపబడ్డ 'సారి బొటూ—గ్రహపాటూ' కథ మా ముగ్గురికీ నచ్చింది. అంతం మమ్మల్ని కడుపుబ్బ నవ్వించింది. ఇక్కడ చదువుతున్న మా 'క్లాసుమేట్సు' (తెలుగువాళ్ళు అందరం రచయిత (బహుశా యువ రచయిత) కు ధన్యవాదాలు తెలియజేస్తూ, ప్రచురించిన మీకు అభివందనలర్పిస్తున్నాము.

శ్యామల, వింధ్యారాణి, సరోజ (వారణాసి)

చదువు ప్రలాపు

శ్రీ సత్యమూర్తిగారి ఊహ సరి అయినది కాదనటంలో శ్రీ రాధాకొయిగారు కొంత పొరబడ్డారు. వారు వేసిన చిత్రంలో లెక్చరర్ అటెండెన్సు సీరియల్ నెంబరు ప్రకారము పిలుస్తున్నారు. ఆమధ్యలో లేటుగా వచ్చినవాళ్లను అటెండెన్సు పిలవటము ఆపి (అనగా ఒన్, టూ, త్రీ అని ఆపి) "కమిన్" అని అంటున్నారు కాని, వచ్చినవారిని నెంబరు పెట్టి త్రీ "కమిన్" అని అనటంలేదు. ఈ విషయంలో సత్యమూర్తిగారి ఊహ సరియైనదని నే ననుకొంటున్నాను.

కె. శ్రీనివాసులురెడ్డి (కర్నూలు) ★



అష్టభోగములతో
ఆయురారోగ్యములతో
మీయిల్లు శోభిల్లుగాక!
ఆంధ్రా కాఫీ పౌడరు
ANDHRA Coffee
ఆంధ్రా కాఫీ యిండస్ట్రీ, గుంటూరు.
సంక్రాంతికి మీకివే మా శుభాకాంక్షలు
G.V.RAO. GNT.
ఆంధ్రా కాఫీ యిండస్ట్రీ,
హెడ్డాఫీసు:- బ్రాడీపేట గుంటూరు.
బ్రాంచీలు:- బ్రాడీపేట, పట్నంబజారు (గుంటూరు) బాపట్ల, నర్సరావుపేట, సత్తెనపల్లి, హైదరాబాద్

ఆంధ్రసచిత్రవార
పత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

*

శుక్రవారం: 11—1—63
శుభకృన్నామ సం॥ పుష్యమాసం॥ బ॥ విదియ
సంపుటము : 55 సంచిక : 19
స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకులు,
శివలెంక శంభుప్రసాద్
సంపాదకులు,
శివలెంక రాధాకృష్ణ

*

ఒక సంవత్సరం చందా
వివరాలు

ఇండియా : రూ. 13.00 ఇతర దేశాలు ఓడమీద (Sea Mail రు. 20.00. (విమానం ద్వారా (Air Mail): బ్రిటన్, జర్మనీ, ఇతర యూరోప్, ఆఫ్రికా దేశాలు— రూ. 114 00 అమెరికా రూ. 176 50. ఆస్ట్రేలియా · 135.00.)

*

విడిప్రతి : 25 న.పై.
సంవత్సర చందా : 13-0-0.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1



సస్యలక్ష్మి.

మనలోమాట

ఆంధ్ర సచిత్ర వార పత్రిక పాఠకులందరికీ సంక్రాంతి శుభాభినందనలు!

* * *

ఈ వారంనుంచి 'ఆంధ్ర సచిత్ర వార పత్రిక' అట్ట పద్ధతి మార్చి వేస్తున్నాము. కార్టూనుతో బాటు 'ఫొటో' ఉన్న ముఖచిత్రాలు కొంతకాలం వరకూ నిలిపివేసి ఒక్కే ఒక బొమ్మ ఉండేట్లు వేస్తున్నాము.

* * *

'పన్నీరు-కన్నీరు' రచయిత శ్రీ నందివాడ భీమారావుగారు అహమ్మదాబాదులో 'అసిస్టెంట్ ఎక్కౌంటెంట్ జనరల్'గా పని చేస్తున్నారు. పొరబాటున 28-12 62 సంచిక 'మనలోమాట'లో 'జనరల్' అనేమాట అచ్చుకాలేదు. పొరపాటుకి చింతిస్తున్నాము.

* * *

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో రాబోయే ఆకర్షణలు కొన్ని ఈ సంచిక 63 వ పేజీలోని ప్రకటనలో వివరించాము. అందుచేత ఇక్కడ ఎక్కువగా వ్రాయటంలేదు. పాఠకుల అభిరుచులనుబట్టి మరికొన్ని శీర్షికలు-ప్రకటనలో వివరించనివి- కూడా త్వరలోనే ప్రారంభిస్తాము. ముందు వచ్చే సంచికల ఇవి ఏమిటో తెలుపగలము!

* * *

'కుమారి కథ' ఈ సంచికతో ముగిసింది. ప్రస్తుతం న్యూస్‌ప్రింట్ కొరత ఉండటంవల్ల కొంతకాలం వరకూ బొమ్మల కథ ఏదీ ప్రచురించము.

లోకంపోకడ



నిజం చెప్పాలి అంటే ఈ 'మావో'ను లక్ష్యంగా పెట్టి తుపాకి గురిపేసి కాల్చే శిక్షణ ఇస్తున్న దగ్గర్నుంచి మన సిపాయిలు, బాగా చకచక గురి నేర్చుకుంటున్నారు.

విషయానుక్రమణిక

కొత్త ఏడాది – కొత్త ఉద్యమాలు – 1963



అన్నిటికీ సిఫార్సులే - నేటి ధోరణి

ఆ రోజులో ఆంధ్రరాష్ట్రం ఏర్పడబోయేముందు రాజధాని ఎక్కడ ఉంటె బాగుంటుంది అనే సమస్య మీద తర్జనభర్జనలు మహా జోరుగా సాగినాయి ఇంచుమించుగా ప్రతి 'నాగరికుడు' తానున్న నగరమే రాజధాని కావాలని, దీనికి తగిన తర్కాన్ని పోగుచేసి తన వాదనను బలపరుచుకోవటానికి ప్రయత్నం చేశాడు దీనికంతటికీ కారణము రాజధాని—నగరం వహించబోయె ప్రాముఖ్యతే! దీని విశిష్టత అంతా ఇంతా అని వర్ణించటానికి వీలేదు! మంత్రి పుంగవులంతా ఉండేచోటు మామూలుగా దరఖాస్తులతో కాని పనులన్నీ వీరి చలువవలన, అభిమానం వలన ఇట్టే అయిపోతాయి వారి అనుగ్రహం సంపాదించటానికి రాష్ట్రం నలుమూలలనుంచి ప్రజలు తడోప తండాలుగా వచ్చిపడుతూఉంటారు రాజధాని నగరానికి అయితే ఇంతమందికి వీరి ఆశ్రయ భాగ్యం లభించదు మధ్యవర్తుల ద్వారా ఎన్నో సమస్యలు పరిష్కారమవుతూ ఉంటాయి వారి ఆఫీసులన్నీ కూడా సెక్రటరియేట్ భవనాల్లోనే! ప్రభుత్వం యొక్క కీలకమైన శాఖలన్నీ కూడా ఈ భవనాల్లోనే బంధించబడ్డాయి ప్రభుత్వానికి సంబంధించిన ఏ పని జరగాలన్నా, ఈ ఆఫీసులు శాఖలతో సంబంధం పెట్టుకోకుంటే కుదరదు రాను రాను ప్రజలు భారీయెత్తున ప్రభుత్వంమీద, వారి దయా దాక్షిణ్యాలమీద ఆధారపడవలసిన దుర్గతి ఏర్పడుతోంది జీవనాడులన్నీ తన గుప్పెట్లో ఉంచుకని, వ్యక్తుని కీలుబొమ్మలగ ఆడించేస్తోంది ప్రభుత్వం సాధ్యమైనంత దూరంగా ఉందామనుకన్నా వీలుపడటం లేదు ఎక్కడెక్కడ వార్ని అయస్కాంతంలాగ పట్టి లాగేస్తోంది ప్రజల విషయాల్లో ప్రత్య

ఏవి గుమ్మడిపూల పాగాల గొబ్బిళ్లు
వాకిళ్ళలో చెలువారు వేళ,
కొంగ్రొత్త వరివెన్ను గుత్తులపై గ్రాలి
పిచ్చుకల్ మెలమెల్ల పిలుచు వేళ,
గంగిరెద్దుల కంచుగంటల గణగణల్
సన్నాయి పాటతో సాగు వేళ
భోగిమంటల మ్రోత మూగు చలిమంచులో
బాలబాలికల హాసాల వేళ,
బంతి చేమంతి గోరింట బారులందు
వచ్చె సంక్రాంతి హేమంత వైభవముల!
పాడిపంటల నిక భోగభాగ్యమంది,
నెచ్చెలీ! నీ గృహమ్ము రాణించు గాక!

—పి. గణపతిశాస్త్రి

[illegible]

టికి హెచ్చిపోతోంది.

ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకుంటే సిఫార్సుల 'కట్టలు' పెట్టుకుపోవాలి. ప్రమోషన్‌కు ఎంత 'కమోషన్' కావాలో అందరికీ తెలిసిందే! ప్రమోషన్అంటే జ్ఞాపకం వచ్చింది. దీనికోసం 71 వర్యలు

ఈ చర్యలవలన జాప్యం ఎక్కువ అవటం, ఉద్యోగస్తునికి మనశ్శాంతి పోవటం, అనిశ్చితమైన వాతావరణంలో పని కుంటుపడటం—ఇలాంటి అనుభవాలవలన ఈ చర్యల్ని 13 వరకు తగ్గించటాని

59-పేజీ చూడండి



మెడిచల్ పంచాయితీ సమితి అధ్యక్షుడు శ్రీ వెంకటరాంరెడ్డి ఇటీవల హైదరాబాదులో ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డిగారికి 17.195 రూ॥లను జాతీయ రక్షణనిధికి సమర్పించారు.


తప్పక చూడండి!
జయంతి పిక్చర్స్ వారి
JAYANTHI PICTURES
శ్రీకృష్ణార్జునయుద్ధము
నిర్మాత-దర్శకుడు - కె. వి. రెడ్డి B.Sc. (HONS)
వాహిని విడుదల



గవర్నమెంట్ క్వార్టర్స్ దొరకటంతో ఏళ్ళనుంచీ ఊపిరి బిగపట్టుకుని కాపురమున్న అద్దెఇల్లు క్షణాలమీద ఖాళీచేసి, వెంటనే అందులోవచ్చి చేరిపోయాం. ఆలస్యమైతే మళ్ళా అదెవడు తన్నుకుపోతాడోనని ఒక నెలరోజులు గడిచి, అలాకొంచెం స్వేచ్ఛగా గాలి పీల్చుకున్నామో. లేదో అక్కడ కొంచెం కష్టతరమయ్యేట్లే కనిపించింది. అన్ని వసతులు బాగానే ఉన్నాయి కాని, చిక్కంతా మా ఇరుగు పొరుగు వాళ్ళతోనే వచ్చింది.

చూడండి! లోకంలో అనేక రకాల వ్యక్తులుంటారు. వాళ్ళ ఇష్టాలూ, అయిష్టాలూ, అభిరుచులూ, అభినివేశాలూ రక రకాలుగా ఉంటాయి. కొందరికి సినిమాలంటే ఇష్టం. కొందరు క్రికట్, హాకీ, ఫుట్‌బాల్‌లాంటిఆటలంటే ఇష్టపడతారు. కొందరు నృత్య ప్రదర్శనాలన్నా, నాటకాలన్నా మోజు చూపెడతారు. మరికొందరు సంగీతమంటే చెవికోసుకుంటారు. కొందరికి ప్రేమించడమంటే 'గులాబ్ జామ్' తిన్నట్టుగా ఉంటుంది. ఇలా ఒక్కొక్క వ్యక్తి ఒక్కొక్కదానిమీద 'ఇష్టం' చూపించడం సాధారణమే గాని, ఈ 'ఇష్టం' అనేది ఎక్కువైనపుడు దాన్నే 'పిచ్చి' అంటారు. ఎవరికైనా ఆ యా విషయాల్లో ఈ 'ఇష్టం' అనేది ఉండవల్సిన దానికంటే ఎక్కువైపోయి—'పిచ్చి' గా మారితే వాళ్ళనే 'సినిమా పిచ్చిగాళ్ళనీ' 'ఆటల పిచ్చిగాళ్ళ'నీ 'నాటకాల పిచ్చిగాళ్ళనీ', 'ప్రేమ పిచ్చిగాళ్లనీ' వర్ణిస్తుంటాం. నే నేదో మా ఇరుగు పొరుగువాళ్ళ ముచ్చట చెప్పబోయి, లోకంమీద పడ్డానని కన్నెర్ర చెయ్యబోకండి. వాళ్ళ విషయానికే వస్తున్నాను.

ఈ లోకంలో అందరికీ అన్ని 'పిచ్చ'లూ ఉన్నట్టుగానే మా ఇరుగు పొరుగు వాళ్ళలో కూడ ఇద్దరు ముగ్గురు 'సంగీతం పిచ్చగాళ్ళు' ఉన్నారు. అందువల్లనే వచ్చిందీ చిక్కంతా!

మా పక్కింటాయనకి శాస్త్రీయ సంగీతమంటే మహా ఇష్టం. అంచేతే ఆయన వాళ్ళ అమ్మాయిలిద్దరికీ సంగీతం చెప్పిస్తున్నాడు మనువులు దొరక్క ఇటు వాళ్ళకీ కొంచెం కాలక్షేపంగానూ, అటు పెళ్ళికి అదనపు అర్హతగానూ ఉంటుందనే ఉద్దేశంతో ఆయన అలా కుమార్తెలిద్దరికీ సంగీతం చెప్పిస్తున్నాడని లోకులు అనుకుంటారు. కాని నేను నమ్మను. ఆ శాస్త్రీయ సంగీతమంటే ఆయనకున్న అభిమానమే ఆయనచేత బలవంతంగా వాళ్ళిద్దరికీ సంగీతం చెప్పిస్తోందని నా నమ్మకం. కారణమేదైతేనేం. మొత్తానికి ఆయన వాళ్ళ అమ్మాయిలిద్దరికీ సంగీతం చెప్పిస్తున్నాడు

. ప్రొద్దుటిపూటకోకిల్లాంటి(రంగులో మాత్రమే) మ్యూజిక్ టీచర్ దగ్గర 'సంగీత శిక్షణ'కు రెండు గంటలూ, రాత్రిపూట (అదీ ఇరుగు పొరుగు వాళ్ళకు నిద్ర పట్టే సమయంలో) 'హోమ్ వర్క్'లాగా, ఆ అమ్మాయిలిద్దరూ కొనసాగించే 'సంగీత సాధన' మరో రెండు గంటలూ, వాళ్ళ దైనిక కార్యక్రమంలో తప్పనిసరి అయినవి. ఇరుగు పొరుగువాళ్ళకి ఎంత బోరింగ్‌గా (విసుగ్గా) ఉన్నా, బేర్ (సహించక) చెయ్యక మరోదారి లేకుండా ఉండిపోయినవి. పోనీ, ఆ సంగీత సాధన అయినా వినడానికి శ్రావ్యంగా ఏ కొంచెమున్నా రాగయుక్తంగా ఉంటుందా అంటే అదీలేదు. అయ్యదారు ఫ్యాక్టరీ సైరన్లు ఒకేసారి కూస్తున్నట్టుగా మొదటినుంచీ చివరిదాకా ఒకటే మోత పుట్టిపోతుంది; చెవులు తూట్లుపడేలాగ. అందులో ఆదివారం సెలవైనా ఉంటే బాగుంటుందనుకుంటే ఆవిడ—అంటే ఆ అమ్మాయిల సంగీతం టీచరు, సెలవు రోజుల్లో కూడ ప్రయివేట్ క్లాసులు పెడుతున్నట్టుగా వచ్చి, రెండుగంటలు సంగీతం చెప్పి మరీ వెడుతుంది. సరే ఇదిలా ఉంచండి.

ఎదురింటాయన ఉన్నాడు చూశారూ, ఆయనకు 'హిందీ ఫిల్మ గీతాలు' (ముఖ్యంగా లతామంగేష్కర్ పాడినవి) అంటే ఇష్టం. ఆయన తెలివికి ఎంతైనా మెచ్చుకోవాలి. తన కున్న చిన్న సైజు రేడియో పక్కఇంటి అమ్మాయిల శాస్త్రీయ సంగీతంతో పోటీ పడలేక పోతోందని ఈమధ్యనే పెద్ద (ఎకానమీ సైజు) రేడియో కొనుక్కుని వచ్చాడు. ఇహ వీళ్ళైనపుడల్లా (ముఖ్యంగా పక్కింటిఅమ్మాయి

51 వ పేజీ చూడండి

వ్యాస రచన పోటీ

'సినిమాలూ - జాతీయసమైక్యతా'

మొదటి బహుమతి : రు. 100
రెండవ బహుమతి : రు. 75
మూడవ బహుమతి : రు. 50

మనదేశం మొత్తంమీద, ప్రజలందరికీ అందుబాటులోవుండి వినోదాన్ని కలిగించే సాధనాల్లో సినిమా ముఖ్యమైందనే చెప్పాలి. అంతేకాక సినిమా జాతీయ సమైక్యతకు మంచి సాధనమనికూడా చాలామంది అంటున్నారు. హిందీ తదితరమైన ఉత్తరభాషా చిత్రాలు దక్షిణ భారతదేశంలో ప్రదర్శించటం, ప్రదర్శించే చిత్రాలసంఖ్యా, రోజు రోజుకూ ఎక్కువౌతున్నది. చిత్రాల్లో సంగీతంకూడా ఇప్పుడు అన్ని భాషా చిత్రాల్లోను ఒకేరీతిగా, ఒకేస్థాయిలో ఉన్నట్లు కన్పిస్తున్నది. ఒకవిధంగా చిత్రాలు జాతీయ సమైక్యతకు దారితీస్తున్నవని చెప్పవచ్చు.

మరి కొంతమంది, కొన్నిసినిమాలు దేశంలోని, వర్గవర్ణ వైషమ్యాలు తదితరమైన అవాంఛనీయమైన విషయాలను రెచ్చగొట్టి, విచ్ఛిన్నకరశక్తులుగా మారిపోతున్నవని అంటున్నారు.

పై రెండు అభిప్రాయాలలోఏది వాస్తవం అన్న విషయంపై పాఠకుల అభిప్రాయాలు తెలుసుకునే ఉద్దేశ్యంలో ఈ పోటీ నడుపుతున్నాము.

తమ అభిప్రాయాలను వ్యాసరూపంలో పొందుపరుస్తూ 29–2–63 లోపుగా మా కార్యాలయానికి అందజేయవలసిందిగా పోటీలో పాల్గొనే వారిని కోరుతున్నాము.

●

● వ్యాసాలు 5 అరఠావు పేజీలకుమించి ఉండరాదు. ● కాగితం ఒకవైపుననే రాయాలి. ● కవరుపైన 'సినిమా వ్యాసరచన పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి. ● తుదినిర్ణయం సంపాదకునిదే. దీనిపై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు. ● త్రిప్పి పంపగోరువారు తగిన తపాలా బిళ్ళలు అంటించిన కవర్లు జతపరచి పంపాలి. ● బహుమతి పొందిన వ్యాసాలు ఆంధ్ర సచిత్ర వారపత్రిక ఉగాది సంచికలో ప్రచురిస్తాము.

చదువుల్రావు - బి. వి. సత్యమూర్తి



మీ చర్మానికి తగినది

నివియా



ఇదే మీ చర్మానికి కావలసినది

నివియా క్రీమ్‌లో "యుసిరైట్" — అద్వితీయమైన, సహజ ప్రకృతి పదార్థము వంటిది ఉన్నది. రోజూ స్నానం వల్లను, ఎండ, వాన, గాలిలో తిరుగుచుండుట వల్లను గోల్పోవునట్టి మీ చర్మమందలి చమురులను అది సమకూర్చుతుంది నివియా మీ చర్మాన్ని: మృదువుగాను, యౌవనయుతమైన ఆరోగ్య వంతంగాను వుంచుతుంది. మీ చర్మానికి వాడదగినది. నివియా. ఇప్పుడే!

నివియా — వివిధోపయుక్తమైన క్రీమ్.

S&N



Aiyars C-243 -TEL

మనమూ - మనదేహస్థితీ

డా॥ గాలి బాలసుందరరా

జీర్ణాశయ వ్రణములు - వాటి చికిత్స

ఇంతవరకు, జఠరాశయంలోనూ, డుయోడినం లోనూ ఏర్పడే వ్రణములను గురించి, వాటి వల్ల ఏర్పడే లక్షణములను గురించీ కొద్దిగా తెలుసుకున్నాము. జీర్ణకోశమంతా అనిచ్ఛాధీన కండర ములలోనూ, వివిధ రసములను స్రవించే గ్రంధుల తోనూ నిండిఉన్నది. ఏ కండరం ఎంతగా ఎలా సంకోచించాలో, ఏ గ్రంధి ఎంత స్రవించాలో నిర్ణయించేది మెదడు.

జీర్ణాశయంలో వ్రణములు ఏర్పడడానికి సరి అయిన కారణమును ఎవరూ నిర్ణయించలేదు. కాని, ఆ ప్రదేశములో ఉండే మ్యూకస్‌పొరలో గాయము ఏర్పడడము, జఠరాశయంలో అత్యధికామ్లస్థితి (Hyper Acidity) అల్సరుఏర్పడడానికి దోహదము లవుతవని అనుభవంవల్ల నిర్ణయింపబడ్డది. అల్సరు ఏర్పడకుండా చేసుకోడం గానీ, ఏర్పడినప్పుడు వాటిని నివారించడం గానీ, పై రెండు కారణములనూ నివారించగలిగినప్పుడే సాధ్యమవుతుంది

జీర్ణకోశం అనిచ్ఛాధీన కండరములతోనూ, గ్రంధులతోను నిండిఉన్నదని యిదివరకే తెలుసుకున్నాము. ఈ కండరములనూ గ్రంధులనూ శాసించే నరకేంద్రమును సీలియక్ గేంగ్లియాన్ అంటారు (Coeliac ganglion) సీలియక్ గేంగ్లియాన్, సింపతెటెక్ నరాశయానికి చెందిన నరకణముల (Nerve cells) సముదాయము సింపతెటెక్, పేరాసింపతెటెక్ నరములద్వారా, జఠరాశయ కండరముల సంకోచ వ్యాకోచములూ, అక్కడ ఉండే గ్రంధుల స్పందనములూ శాసించబడతవని యిదివరకే తెలుసుకున్నాము. అయితే ఈ సింపతెటెక్, పేరాసింపతెటెక్ నరముల ధర్మములు ఒకే మాదిరిగా ఉండవు అవి వ్యతిరేక ధర్మములను నిర్వహిస్తవి. ఈ నరములు ఒకచోట, సంకోచమును కలిగిస్తవి. మరొకచోట వ్యాకోచమును కలిగిస్తవి. ఈ విధంగా, ఒకే కార్యమును సాధించడానికి ఇవి పరస్పరము వ్యతిరేక ధర్మములను నిర్వహిస్తూ ఒక సామాన్య ప్రయోజనాన్ని సాధిస్తూ ఉంటవి. అప్పుడే అనేక కండరములు, గ్రంధులు ఒక క్రమంతో ఒక సమన్వయంతో, పని చేస్తవి ఇందులో ఏ ఒకటయినా బలవత్తరమైనప్పుడు, చాలా గడబిడ ఏర్పడుతుంది. ఈ నరములు గానీ, వాటిచేత సంచలింపబడే కండరములు, గ్రంధులు గానీ మనశ్శ్సితిమీద శరీరావసరములమీద ఆధారపడి ఉంటవి

ఈ మనస్సనేది యేది? అది ఎక్కడ ఉన్నది? మన మొక పని చేయదలుచుకున్నప్పుడు "ఆ పని చేయవద్దు అది మంచిదికాదు" అని మనకు స్ఫురింపజేసేది యేది? ఒక వస్తువు రోగకారి అని తెలిసినా ఆ వస్తువులమీద, మనకు జయించలేని వ్యామోహాన్ని కలిగించి, దానికి దాసుల్ని చేసేది యేది? దానిసేవతో ఆ వ్యసనం తీరింతరవాత "యీ వ్యసనానికి దాసున్నయినానే" అని బాధ కలిగించేది యేది? కామ క్రోధాది ఉద్రేకములు కలిగినప్పుడు ఒక పని చేయక తప్పదనే ఆవేశం కలిగినా, "అది కూడని పని" అని ఆ ఆవేశాన్ని వస్తాయింపజేసే శక్తి యేది? ఒకరి క్రింద నౌకరి చేస్తేనే గాని జీవితం గడవనప్పుడు, ఆ నౌకరీ యిచ్చిన యజమాని మనకు యిష్టంలేని పనినో, బాధకలిగించే పనినో చేయమని, చేయకపోతే ఉద్యోగంలోనుంచి తీసేస్తానని బెదిరిస్తే, "నిజ దార సుతోదర పోషణార్థమై" ఆ అవమానాన్ని, మానసిక సంకటాన్ని దిగమ్రింగుతూ ఆ ఉద్యోగం చేస్తూ జీవించే మనిషి మనశ్శ్థితి యెలా ఉంటుంది? పరస్పర విరుద్ధములయిన యిటువంటి పరిస్థితులలో మనిషి మలమలా మాడిపోయే విధంగా మానవ సంఘం నేడు రూపొందింది. ఎప్పటికప్పుడు జీవితంతో రాజీపడి మనస్సును సముదాయించుకుని జీవించవలసిందే కాని, మానసిక సంకటములు లేనిదీ పరిపూర్ణ సంతృప్తి, ఆనందమూ కలిగించేదీ, బ్రతకాలనే అభిరుచి కలిగించేదీ అయిన జీవితం, అత్యల్ప సంఖ్యాకులకు మాత్రమే లభిస్తున్నది. అదీ సందేహాస్పదమయిన విషయమేమో.

ఏది మంచి! ఏది చెడ్డ! అనే విషయం బహుకాలంగా మనమనస్సు తర్ఫీదుమీద, ఆధారపడి ఉంటుంది. ఒక విషయం చాలా మంచిది అని అంగీకరించి విశ్వసించడానికి పారంపర్యంగా తరీతుపొందిన మనస్సుకు తద్విరుద్ధములయిన పరిస్థితులు ఏర్పడగానే, ఒక రకమయిన సంఘర్షణ (Conflict) ఏర్పడుతుంది. ఆ ఘర్షణను శాంతింపజేయడానికి ఒకే ఒక మార్గము. బాధ కలిగించే పరిస్థితులను మార్చుకోడం; లేదా, "కష్టసుఖములు కర్మఫలితములు, దేనికీ నేను కర్తనుకాను. ఈశ్వరేచ్ఛకు బద్ధుణ్ణయి నా విధి నేను నిర్వహిస్తాను." అనే నిర్లిప్తతతో జీవయాత్ర సాగించడం. ఆధునిక యుగంలో జీవించే వారు యీ రెండు వైఖరులనూ అవలంబించడం లేదు తన విశ్వాసాలకు, సర్వమూ ధారపోసి, మళ్ళీ దానిని గురించి ఆలోచించకుండా జీవితాన్ని ఎదుర్కొననూ లేరు. "సర్వమూ మన చేతిలో ఉన్నది. మన భవిష్యత్తుకు మనమే కర్తలము; మన కష్టాలకు మనమే బాధ్యులము. అన్యులు గాని, అన్యశక్తి గాని దీనికి కారణం కాదు." అనే విశ్వాసం కలగడానికి, ప్రతి మేధావి, ప్రతి నాయకుడూ, ప్రతి వ్యక్తీ, ప్రతి రచయితా ప్రయత్నిస్తున్నాడు. తన కృషి ఫలించినంతవరకు యీ విశ్వాసం బాగానే ఉంటుంది, కాని, పరిపూర్ణంగా, తన ఆత్మకు తృప్తిగా పని చేసినా, అపజయం, అర్ధజయం తరుచు తటస్థిస్తున్నప్పుడు, బుద్ధిమంతుడు దానికి కారణమేమిటో ఆలోచించక తప్పదు. పరమోత్కృష్టమైన చికిత్స చేసినా కొన్ని రోగాలు కుదరవు. ఆ రోగాలు కుదరకపోతే వైద్యమే ఉండదు. కుదరక పోవడానికి కారణం ఏమిటి? అనే ఆలోచన రాక తప్పదు. బాగా చదివినా, పరీక్ష తప్పేవారు కొందరు.

సునిర్మితమయిన ఏ సంఘంలోనయినా, మనుషులు ఇతర మనుషులు అవసరాలు సమకూర్చి జీవించవలసిందే. కనీస జీవితావసరములను ప్రతివ్యక్తి ఇచ్ఛాధీనంగా కృషితో సమకూర్చుకోగల పరిస్థితులున్నప్పుడే ఆ సంఘం సునిర్మిత మవుతుంది. "ఉనికి కోసం సంఘర్షణలో ఉత్తీర్ణులు మాత్రమే విజయమన్నది పరిణామవాద సిద్ధాంతము జీవితావసరములు నైసర్గికములయిననాడు, దేశాల్లో ఉండే జనసంఖ్య తక్కువగా ఉన్నవాడు, మనుషులు తమ అవసరాలకు మనుషులమీదనే ఆధారపడ్డనాడు. తను అవలంబించిన వృత్తి, అందులో తనకు లభించే ధన, శాంతి, గౌరవాదులూ, తన జన్మాంతర పుణ్య విశేషములని మానవులు విశ్వసించిననాడు, జీవితంలో సంఘర్షణలేదు; వైరుధ్యమూ లేదు. "జయాపజయములు దైవాధీనములవి, తను కర్త కాదు! అనుకున్నపుడు, దైవమనేది ఉన్నా లేకపోయినా అపజయకాలంలో అహం దెబ్బతిని, మనసు గాయపడి, తత్ఫలితంగా శరీరం రోగగ్రస్తంకాదు. అలాకాక తన స్థితికి తానే కర్తను అనుకునే వారితో నిండిఉన్న సంఘంలో, మనిషి చేసే పనులు, యంత్రాలు చేస్తూ నిరుద్యోగం అధికమయ్యే సంఘంలోనూ ధనికులకు పుట్టినవారు పనిచేసి జీవించవలసిన అవసరములేని సంఘంలో, నిర్ధనులు, విద్యావంతులయినా, బుద్ధిమంతులయినా, ఉద్యోగం లభించక మనశ్శాంతిని నాశనం చేసేవీ, ఆత్మ విరుద్ధములయినవీ అయిన పనుల చేయక తప్పని పరిస్థితులలో, జీవితంలో సంఘర్షణ, అతృప్తి, ఆత్మనిందా, అసూయా, కోపమూ, ద్వేషమూ, దుఃఖమూ కార్చిచ్చుల్లా రగలక తప్పదు. మనసు బాధపడకా తప్పదు. క్రియకు ప్రతిక్రియ ఉండితీరుతుంది ఈనాటి తన స్థితి ఏనాడో తాను చేసిన క్రియకు ప్రతిక్రియ అనుకుని, తన స్థితిని అభివృద్ధి చేసుకోటానికి ప్రయత్నిస్తూ అపజయంతో అహం దెబ్బతినకుండా జయంతో కళ్ళు తిరగకుండా జీవించడం ప్రతివారూ నేర్చుకునేటట్లుగా మానవసంఘ నిర్మాణం జరగాలి. తమతో ఎదటివారికున్న అవసరములను

—49వ పేజీ చూడండి

హరివంశము

హారీత శివశర్మ

ఉజ్జయినీ పర్వం- 10

వామాక్షికి పెండ్లి నిశ్చయమైనది రోహిణీ నక్షత్రముతో కూడిన అష్టమినాడు ఆచార్య పొందీపని లగ్నమును నిశ్చయించిరి ఉజ్జయినికి ఎక్కడో దూరముగనున్న పల్లెనుండి సుదాముని తల్లియు తండ్రియు బంధువులును పెండ్లి గురించిన వార్తను అందుకొని తరలివచ్చిరి మహారాజు జయత్సేనులు తమ యింట వారికి ఉనికి నేర్పరచిరి మహారాజున కిదియే సంతోషము తాము మగపెండ్లివారు ఆయన రాజాధిదేవితో నన్నారు రాజు 'మనము మగపెండ్లివారమే నీ మేనయల్లు డాడపెండ్లివారికి పెద్ద ఇప్పుడు మన చేయి పైన యున్నది !' అని రాజాధిదేవి నవ్వినది "మహారాజ! మన పిల్లకును ఎప్పుడో పెండ్లిచేయుదుము అప్పుడు నిజముగా మన చేయి క్రిందగును" అన్నది మహారాజు నవ్వినాడు ఆలోచించినాడు ఓరగ రాజాధిదేవిని తిలకించినాడు "అట్లు కాని పద్ధతియేమో ఆలోచించెదను" అన్నాడు

"ఏమి ఆలోచించెదరు మనకో, క్షత్రియులకు బహారకముల వివాహము నిబంధింపబడినవి బ్రాహ్మ్యమునకును మనకును దూరము ఏ పడుచువాడో మన పిల్లను గాంధర్వవిధిని పెండ్లియాడు ననుకొనుడు లేదో రాక్షసముగ నెత్తుకొనుపోవు ననుకొనుడు అప్పుడేమి చేతురు ? ఎట్టులును మన చేయి అడుగుననే యుండును" అన్నది రాజాధిదేవి

మహారాజు గల్లున నవ్వినాడు

'రాజాధి! ఇంతియేనా నీ యాలోచన !'అన్నాడు

ఆమె ఆయనవంక విచిత్రముగ చూచినది

"ఏమి ! మహారాజ !" యన్నది

"ఓసి ! యాదవుల యాడబడుచ ! నేను బిడ్డను వీర్యశుల్కమ చేయుదునే ! సీతయెట్లో, అట్లు తెలిసినదా !"

మహారాణి మందహాసము చేసినది

మహారాజును మందహాసము చేసినాడు

పెండిలికి ముందు ఇట్టి సంభాషణములతో లగ్న దినము సమీపించినది. మగపెండ్లివారి పెత్తనమంతయు మహారాజు స్వయముగా వహించిరి మహారాణి వామాక్షికి చాలా తొడగుగా నగలు చేయించినది అలంకరించి అందరికిని చూపించినది

నగలు-లేకనే వామాక్షి యందకత్తె. నగలు ధరించి ఆమె మరియు నందముగ కన్పించినది వామాక్షితల్లి కిది యంతయు సంతోషముగనున్నదిని, లేదును ఆచార్యాణి ఒక్క విషాదరేఖ చంద్రుని యందలి మచ్చవలె విభాసిల్లినది ఆమెకు రెండు విచారములు ఒకటి తన పుత్రుడు నున్నచో వానికి పెండిలి చేయుట మొదలగు శుభకార్యములు తన యింట జరుగునుగదా యని రెండవది వచ్చిన మహానందుడు విచిత్రముగా నంతర్హితుడై పోవుట యేమని అతని యా అందర్థానము తనకే కాదు, సర్వ ఉజ్జయినికిని ఆశ్చర్యమైనది కొన్ని రోజులా వృత్తాంతమే నగరమంతటను విన్పించినది చూచిన వారు చెప్పినది యొక్కటిగ, చూడనివారు విన్న దానిని చెప్పుట మరియొక్కటిగ నా ఉదంతము బహుళముగా ప్రచారమును పొందినది

ఒక్క శుభదినమున నింటిలో పసుపుకొమ్ములు కొట్టుచు నాచార్యాణి యనుకొన్నది "వాడును ఉన్నచో నెంత బాగుండెడిది" అని.

పోటువేయుచు మహానందుని భార్య యన్నది

"వదినె ! మీలో మీరే యేమియో మాట్లాడు కొనుచున్నారు"

"ఏమి మాట్లాడుకొందును ఏమి యున్నది మహానందు డంతటి మహానుభావుడైనాడు వానిచేతి మీదుగ నీ కన్యాదానము జరిగినచో నెంత బాగుండెడిది యనుకొనుచున్నాను"

మహానందుని భార్య కంట నీరుపెట్టుకొన్నది

"ఆ అదృష్టము భగవంతుడు నా ముఖమున వ్రాయలేదు" అన్నది

వారు ఆచార్యుని చూడలేదు ఆయన గంభీరముగ, మాట్లాడువేళకు వారు బిడయముపడిరి.

"భగిని ! వాడు సర్వమును సన్యసించెను వానికి భార్యయని, బిడ్డయని యున్నదా ! ఆ కన్యాదానము చేయు పుణ్యమును వాడు నాకు వదిలిపోయెను మీరేల విచారింతురు"

ఆచార్యాణియు, మహానందుని భార్యయు మాటాడలేదు ఆచార్యు డచ్చటినుండి కదిలిపోయెను ఆయనకు గూడా మహానందుడు లేని వెలితి కల్పించుచుండెను వాడేమో మహత్త్వ సంపన్నుడాయెను సంసారచక్రమును భేదించి, తానే బ్రహ్మయై, ఎచ్చటనో సంచరించుచుండెను తనకు అట్టి అదృష్టము కల్గునా ! తనకు బహుబంధము లున్నవి వానిని తాను త్రెంచుకొనలేక పోవుచున్నాడు తనకు ధర్మము,కర్మము- దీనియందు నమ్మకము తాను ఎరిగిన చదువుగూడ తనకు బంధమే యగుచున్నది అట్లు కారాదని తాను అనుకొని ఏమి లాభము ! తనయంత తెలిసినవాడు తానే అయ్యు, ఆ తెలివిని తాను పట్టలేకపోవుచున్నాడు. ఆయనకు అదియే విచిత్రమనిపించింది. అంతయు తెలిసియు తానే యది కాలేకపోవుచున్నాడు. ఆచార్యుడు మహాకాళనాథుని దేవాలయమునకు పోయెను.

లయము వామాక్షీ-సుదాముల పెండిలికోసరము ఆ శోభనముగ నలంకరింపబడి యుండెను అల బాహ్య చిత్రికలయందలి, వితానములయం శిల్పములను మహారాజు వివిధ వర్ణ సమాక్లిష్టముగ నలంకరింపజేసెను ఒక్కచో పరమశివు తపస్వియై మన్మథుని దగ్ధము చేయుచుండె. ఒక్కచో పరమశివుడు తారకాసుర సంహారర్థము దేవతల మాట విని స్కందుని కుమారు పొందు తలంపుతో అమ్మవారిని పెండిలియాడుచుండెను ఇవి రెండు విరుద్ధ విషయములు తరమున సిద్ధాంతము, విప్రతిపత్తి నంటివి వాని పరమశివుడు ఒక్క ఒరలో నిముడ్చగల్గెను వ తాను పరమశివుడా ! ఆచార్యుడు విషాదసంవళి మందహాస ముఖారవిందుడయ్యెను ఆ మందహాసవ తోడి కన్నులతో యాయన మరియు నా శిల్పవలను తిలకించెను ఒక్కచో సప్తఋషులను, వా పత్నులును పరమశివుని పార్వతిని వివాహమగుటకై పెండ్లికొడుకును చేయుచుండిరి ఆ చార్యునకు సుదాముని పెండ్లికొడుకును చేయవలయు సంగతియు, వామాక్షిని పెండ్లికూతురును చేయవలయు సంగతియు గుర్తునకువచ్చెను నేడేమి తిథి? పంచమి సప్తమినాడు ఈ రెండు పనులను చేయవచ్చును అనుకొని ఆయన తిరిగి ఆశ్రమమునకు వచ్చెను ఆశ్రమములో విద్యార్థులు పాఠములు వల్లెవేయుచుండిరి అది వల్లెవేయుటయు: శ్రీకృష్ణుని ప్రసంగమును వినుటగానున్నది. ఆచార్యు డా ఛాయలకు పోయి తానును ఆ ప్రసంగమును వినెను

శ్రీ కృష్ణదేవుడు సుదాముని చూచి నవ్వుచు నిట్లనుచుండెను "మహాబ్రాహ్మణా! ఒకటి రెండు దినములలో నీవు గృహస్థువు కాబోవుచున్నావు. గార్హపత్యము లోకోత్తరమైన ధర్మము నీవు మనస్సున సన్యాసివి అది నాకు తెలియును కాని ధర్మము ధర్మమేసుమా ! దానిని పాటించవలయును. ధర్మము అగ్ని యనుకొమ్ము దానిని పాలించుటయ శ్రేయము. మరి స్వామి! నీవు యెన్ని జన్మముల తపస్సు చేసితివి! వామాక్షివంటి భార్య లభ్యమగుచున్నది అది ఎప్పుడును నిన్ను నే కోరికయు కోరదు కోరినదో పాలింతునని మాట యిమ్ము ఉత్తమ సహధర్మచారిణి మాట వినుటయుగూడ ధర్మమే ఏమందువు మరి"

సుదాము డేమియు ననలేదు కించిదకుంఠిత మందహాస ముఖుడై శ్రీ కృష్ణదేవుని ముఖపద్మమును తన కన్నులన్న తుమ్మెదలతో చుంబించెను.

57-వ పేజీ చూడండి



అనామకరావు

చిన్నప్పుడు :
సుబ్బారాయుడుగా రబ్బాయి
చదువుకి వేసినప్పుడు :
వెంక్రటావు తమ్ముడు
చీదర ముక్కూ చింపిరి జుత్తూ
పెళ్లయ్యాక :
పుల్లమ్మగారి మొగుడు
ఎల్లయ్యగారి అల్లుడు
బిడ్డల తండ్రయ్యాక .
అప్పన్న తండ్రి
లచ్చిగాడి నాన్న
ఆఫీసులో :
ఏడో నెంబరు గుమాస్తా
రోడ్డుమీద
ఏయ్ ఇదుగో నిన్నే
ఇందరు ఇన్నిన్ని విధాలుగా
పిలుస్తూండగా
ఇంక వేరే నాకు పేరెందుకని
అసలు పేరు కాశీలో
వదిలి వచ్చాట్ట అనామకరావు
పాపం.

ముద్దా చిట్టిబాబు (మద్రాస్)

శనివారం మహిమ

ధనవంతు డెదురు చూచును
శనివారముకొరకు పూజ సలుపుట కొరకై.
తన పాప మెల్ల స్వామిని
కొనగోటను మీటు మనుచు కోరుట కొరకై.
మనుమడును ఎదురు చూచును
శనివారము కొరకు, నాటి సాయంత్రము నే
తిను వేడి గారె కొరకును
మినపప్పును నుప్పుపిండి మెసవుటకొరకున్.
అనుదినమును పూజారియు
శనివారముకొరకె జూచు, స్వామికి కాన్కల్
చనుదెంచు పాడె విరివిగ
తన మనమున కోర్కెలెల్ల తనియగ దీరున్.
శనివార మెల్ల వారల
కనువైన దినమ్ము స్వామి వారాధింపం
గనువచ్చు, లేనిచో దే
వుని పేరిట ప్రజల కనులు మూయగవచ్చున్.

పి. ఎస్. రంగారావు.
(భద్రాచలం)

* * *

"ఇంతకీ ఈ అధునాతన చిత్రలేఖన మనేది గాడిద తోకతో పులిమిన మరకలా! లేక చేత్తో గీసినవేనా!" ప్రఖ్యాత దేశం పెద్ద నాయకుడు మాడర్న ఆర్టు గురించి అడిగిన ప్రశ్న ఇది.

జి రామమూర్తి (చేబ్రోలు)

* * *

అప్పగింతలు

వ అని ఇల్లరికోపాఖ్యానమును పరాశర మహర్షి చెప్ప మొదలిడె

కం రామయ్యను రైతొక కు
గ్రామునన్ వసియించుచుండె భార్యామణితోన్
కొమరులు లైదుమంది వారి
న మధ్యస్థుడు కామయ్యను పేరున బరగున్

కం ఇలరికపు బెండ్లి జేసిరి
ఇల కామయ్యకు తలి దండ్రులు వేడ్కన్
ఇలరికపు ఇంటిలోనన్
మెలగెడి నీతులను తల్లి జెప్పగ దొడగెన్

కం మగువకు నత్తకు మామకు
తగ సేవ యొనర్పుచోట తత్పరిచర్యన్
మిగుల నుతి బొందుచుండుట
మగవారికి పాడియౌను నిజము కుమారా!

కం పరస్త్రీలు నక్క చెల్లెలు
పరగన్ దైవంబు నీదు భార్యామణియే
మరువకు మీ అత్తమామలు
ధర తల్లిదండ్రులనుచు మెలగు కుమారా!

కం తెచ్చిన దేకున్నను నీ
కిచ్చిన నీకున్న మగువ నెగ్గాడకుమీ
యొచ్చెము నీపై తెలును
రచ్చల కా మాట లెపుడు తేకు కుమారా!

కం మరదండ్రువదినె లత్తలు
మరదులు బావలు భార్యయు మరి పెద్దలురా
మరవడి పీటలు, మంచము
నరుగులు దిగుచుండవలయును తనయా!

కం నోరెత్తి మాటలాడకు
మారాడకు నీదు భార్య గోపించినచో
గోరంత తప్పు జేయకు
మీరకుమీ భార్య పనులు ఎన్నడు గానీ!

కం సతి పాపపు పని జెప్పిన
బ్రతిమాలి మరల్పవలయు నటుగాకున్నన్
హితమంచు నాచరింపుము
మతిలోపల సంశయంబు మాని కుమారా!

కం తిట్టిన దిట్టక కొట్టిన
కొట్టక కోపించనేని కోపించకనే
పుట్టిన ఇంటికి వాదము
బెట్టిన ఇంటికిని వన్నె తేవలె పుత్రా!

కం జపములు గంగాయాత్రలు
తపములు నోములును దాన ధర్మంబులు పు
ణ్య పురాణము సతిభక్తికి
నుమించిన సాటి యెపుడు రావు కుమారా!

కం సరసము లాడకుమీ నీ
దు రమణి శోకపుచుండన్ సరసము
విరసంబయినచొ పా
దరు దెబ్బతో నీదు ముఖము చిట్లును పుత్రా!



ఎత్తిన కోపంబు బిడ్డ నేడ్పించుటకై
మొత్తిన నీకే కీడగు
జిత్తమునం దీని జింత జేయుము కుమారా!

కం వృత్తియైనను బ్రతుకైనను
పతితోడనె పతికి జెల్లు సతి బాసిన యీ
బ్రతుకొక బ్రతుకా జీవ
న్మృతిగాక పిల్లరకపు యిల్లుంబ్రడ
కుసున్.

కం పుట్టింటివారి నీచత
బెట్టకు పత్తింటివారు పెట్టెడి బాధల్
పుట్టింట దెలియనీయకు
రట్టడి యల్లుడు వీడనియుందురు పుత్రా!

కం కుల దేవతకు బెట్టెడి
పొలుపున నీదు తోటి యల్లుర కెల్లన్
గల మాత్రము పెట్టుచుండుము
ఇలరికపు యల్లుర కిది ధర్మము సుమ్మా!

కం చెప్పిన జెప్పకయుండిన
తప్పక జేయంగవలయు సతిపనులెల్లన్
మెప్పొదవగాను, లేదా
ముప్పొదవును భార్యతోడ నిజముగ పుత్రా!

ఇల్లరికోపాఖ్యానము మొదటి ప్రకరణము
సంపూర్ణం

కే జి జయరామిరెడ్డి, (ఈతాంబ్రడపాడు)

*   *   *

ఎదురీత

బింబాధరీ!

నీకింకా స్పష్టంకాని
విషయం
సుస్పష్టం చేస్తే—
నీకు కష్టంగానే
ఉంటుంది మరి!
ఎందుకంటావా?

చెప్పక తప్పదు, సరి—
దేశక్షేమం
లోకక్షేమం
నాకేకాదు—అది
నీకూ కావాలి
కనుకనే—
చెప్పేస్తున్నా నున్న నిజం
అది బాంబులాంటి నైజం
అనుసరించినా సరే
గర్హించినా సరే
గర్జించినా సరే
అది నా ఎదలోని బాధ!
అనంతాని కెదురీదలేని
అం తులేని అణగని బాధ!
ఏమిటంటావా?
అర్థిస్తు, సోషలిస్టు

ఏదో మెజస్టిక్‌గా
ఉంటుందని—ఆ
అందాని కందరూ
కందిపోయి
బందీ లౌతారని—మరి
నీ అందని ఊహ
అదే నా సందేహం
నీవు—పోనీ
ఆప్టిమిస్టువూ కాదు
పెసిమిస్టువూ కాదు
లిప్‌స్టిక్ నవ్వునే నీకు
దాన్ని ఇష్టపడ్డానా
నీ జీవితంలో
కష్ట నిష్ఠూరాల లిస్టు
పెరిగిపోతుంది
ఇష్టమైనా—కష్టమైనా
లాభంలేదు

నీ అధరాని కది
అనవసరపు మందం!
ఆనందాని కది
అడ్డునిల్చే అందం!
అసలది అందంకాదు—
ఎర్రగులాబి రంగుకాదు—
ఒకానొక వెర్రి మొర్రి
కర్ర కావిరంగు!

ఇర్నలిస్టు—
కాపోతే


డ్రమటిస్టు
లేదా

లిస్టులో లేని ఏ
ఇస్టైనా సరే
నా కిష్టమే—మరి
నష్టంలేదు దేశానికి
కాని కాని కాని.
నీ వివేవీ, కావు
కావు, సరికదా
నీవు టైపిస్టువు
సైంటిస్టులు కానివాళ్ళు
టైపిస్టులవడం
నాకేకాదు—అది
అందరికీ ఇష్టమే
మరేం ప్రమాదంలేదు కనుక—
కాని కాని కాని .
నీ లిప్‌స్టిక్

ఆఖరి మాట—
విస్మరించావా, ఆ
తాంబూల చర్వణం
అదే నా విస్మయం!

భావం: మంత్రిప్రగడ సత్యం.
ప్రాణం: యల్లాప్రగడ కోనార్క.

*   *   *



ఈత పందెంలో చాలా మెడల్సు వచ్చిన రామేశం అలంకరించుకుని వస్తూండగా ఒక ఆర్తనాదం నీళ్లలో మునిగి పోతూన్న స్త్రీ నించి విన వచ్చింది. "పాపం! రక్షించ" మంది యీతగాని భార్య.

"బాబోయ్! నా మెడల్సు కొట్టుకొని పోవూ" అన్నాడు యీతగాడు.

[illegible] ([illegible])

ఒక ప్రకటన యిలా ఉంది: స్వామీ నిత్యానందులవారు వివాహమూ, దాని సౌఖ్యమూ గురించి ప్రసంగిస్తారు. స్వాముల వయస్సు ఎనభై సంవత్సరాలు. ఆజన్మ బ్రహ్మచారి.

జయరాం (మంగళగిరి)

వనితాలోకం :

సంక్రాంతి వేడుకలు!

మందరపు లలిత

మన పండుగల్లోకెల్లా విశిష్టమైనది సంక్రాంతి ఇది అతిప్రాచీనకాలంనుంచి వస్తున్న పండుగ సూర్యుడు ధనస్సులోనుంచి ముందుకు నడచి మకరరాశిలో ప్రవేశించే రోజుకు 'మకర సంక్రమణం' లేక 'సంక్రాంతి' అనిపేరు. ఇది ఏటేటా ఒకే తేదీన జనవరి 14న వస్తుంది. సంక్రాంతికున్న ఈ లక్షణం మిగతా పండుగలు వేటికీ లేదు,

సంక్రాంతినాటికి పంటలు సిద్ధమై ఇంటి కొస్తాయి. రైతులు తమ శ్రమకు ఫలితాన్ని కళ్ళ జూస్తారు ధాన్యాగారాలు నిండుగా కలకలలాడుతూ ఉంటాయి. రైతులకు చేతుల్లో పుష్కలంగా డబ్బు ఆడుతుంది మన ఆంధ్రదేశం వ్యవసాయ ప్రాంతం కాబట్టి సంక్రాంతికి తెలుగునాట ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. వేరే మాటల్లో చెప్పాలంటే సంక్రాంతి తెలుగువారికి ఎంతో ఆనందాయకమైనది, శుభప్రదమైనది

సంక్రాంతి ఇంకో నెల్లాళ్ళలో రాబోతున్నదనగానే పండుగ సన్నాహాలు ప్రారంభమవుతాయి ధనుర్మాసం వచ్చిన లగాయితూ ప్రతి ఇంటివాకిలి వింతవింత రంగవల్లులతో సింగారించుకుంటుంది ముగ్గులు పెట్టటంలో అతివలు ఎంతో నైపుణ్యాన్ని, లావణ్యాన్ని ప్రదర్శిస్తారు ముఖ్యంగా సంక్రాంతిముగ్గులు ఆడవారికి ఎంతో ప్రియమైనవి వేకువనే లేచి వాకిలిముందు కళ్ళాపు జల్లి చుక్కల ముగ్గులు, గీతల ముగ్గులు, అందమైన పెద్ద ముగ్గులను ఎంతో ఆసక్తితో ఉత్సాహంతో వేస్తారు. క్రిందికి వంగి, వారు చేతిలోని ముగ్గును చరచరా మెలికలు తిప్పుతుంటే చూడటానికి తమాషాగా ఉంటుంది ఆ వంపుల్లో ఎన్ని సొంపులు! వారు పైకి లేచేసరికి నల్లని నేలపై తెల్లని ముగ్గులు మెలికలు తిరుగుతూ మిలమిలా మెరుస్తూ ఉంటాయి. చక్కని లతలవంటి ఆ ముగ్గులు ఇంటికి కొత్త శోభను చేకూరుస్తాయి. రంగవల్లుల అలంకరణలో ఆడవారు ఒకరికొకరు పోటీపడుతున్నట్టుగా ఉంటుంది

ఆడపిల్లల సందడి చెప్పనే అక్కర్లేదు గోమయంతో గొబ్బిళ్ళు పెట్టుకుంటారు అమ్మ ముగ్గు పెట్టేసరికి అమ్మాయి గొబ్బెమ్మలను సిద్ధం చేసి, తీసుకునివస్తుంది ముగ్గులమీద వాటిని అందంగా పేర్చి సాయంత్రం మళ్ళీ భద్రంగా లోపలికి తీసుకుని వెళ్తుంది మర్నాడు వాటిని గోడమీద పిడకల్లా చరిచి మధ్యలో కన్నంచేసి ఎండబెడుతుంది గొబ్బెమ్మలంటే ఉత్తి గోమయపు ఉండలు కావు. బంతి, చామంతి, ఎర్రగోరింట, గుమ్మడిపూలను గొబ్బెమ్మ శిరస్సున గుచ్చి, పసుపు కుంకుమలతో బొట్లుపెట్టి అక్షింతలు జల్లి పూజ చేస్తారు చిట్టిపొట్టి అమ్మాయిలంతా తోటిపిల్లలందరినీ పేరంటానికి పిలిచి గొబ్బెమ్మల చుట్టూ చేతులు తడుతూ 'సుబ్బి, గొబ్బెమ్మా' అంటూ పాటలు పాడతారు 'మొగలిపువ్వువంటి మొగుడినీ, గుమ్మడి పండువంటి కొడుకునీ' ప్రసాదించమని గొబ్బెమ్మను కోరుకుంటారు ఒక రోజున సందెవేళ 'సందె గొబ్బెమ్మ'ను పెడతారు ఇది రోజూ పెట్టేవాటికన్నా చాలా పెద్దదిగా ఉంటుంది పిడకల్లా చరిచిన గొబ్బెలను గోడమీదనుంచి ఊడదీసి, దండలా గుచ్చుతారు. భోగిపండగనాడు దాన్ని మంటల్లోవేసి చలి కాచుకుంటారు.

ఇంటికి వెల్లవేసుకోవటం, కొత్త బట్టలు కొనుక్కోవటం, టైలరుకు బట్టలివ్వటం మున్నగు హడావుడి ముందరినుంచీ ఉండనే ఉంటుంది పండుగ పనుల్లో టైలరు మన బట్టలు వెనక్కి నెట్టటానికే చూస్తూంటాడు ఆశాభంగం పొందకుండా టైలరు వెనక నాల్గు సార్లు తిరిగి పండుగవేళకు కుట్టిన బట్టలు తెచ్చుకొనటమే ఒక పండుగలా ఉంటుంది

అసలు సంక్రాంతి పండుగ భోగితో మొదలవుతుంది ముక్కనుముతో ముగుస్తుంది భోగి రేపనగా ఇల్లంతా శుభ్రంగా కడిగి సుద్దతో ముగ్గులు పెడతారు గుమ్మాలకు పసుపు పూసి తెలుపు ఎరుపు బొట్లు పెడతారు ముఖ్యంగా ఒకదాని వెంట మరొకటిగా ఎరుపు, తెలుపు గుండ్రని బొట్లు, కళావరు బొట్లు పెడతారు ఆ చుక్కల వరుసలో చక్కదనం చెప్పలేం గుమ్మాలకు బొట్లు పెట్టుకోవటంతోనే ఇంటికి పండుగ కళ వచ్చేస్తుంది

భోగి పండుగ

భోగిపండుగనాడు భోగిమంటలు వేసుకోవటం, ఇంటిల్లిపాదీ తలంట్లు పోసుకోవటంలో హడావుడిగా ఉంటారు ఆనాటి తెల్లవారుజామున ఎక్కడ చూసినా పెద్ద పెద్ద భోగిమంటలు భగభగమండుతూ ఉంటాయి భోగిమంటల్లో పెద్ద దుంగలు, చెత్తా చెదారాన్ని పడేయటమే గాక కంటికి కనుపించిన వస్తువనల్లా మరొకరిదైనా అడక్కుండా తీసుకెళ్లి పడేస్తారు ఆ వస్తువు తీరా వారు లేచి చూసుకునేవేళకు భస్మం మాత్రం మిగులుతుంది అందుకే ముందు రాత్రి పడుకోబోయే ముందు వీధి వరండాలో ఏ వస్తువులూ ఉంచుకోకుండా లోపల పెట్టుకోవటం క్షేమం. లేకపోతే ప్లీడరుగారు మళ్లా ఒకసారి బోర్డు వ్రాయించుకోవాల్సివస్తుంది డాక్టరుగారు రోగులకోసం వీధిలో వేసిఉంచిన బెంచీని భోగిమంటల్లో వెతుక్కోవల్సి ఉంటుంది మా ఇంటి ఎదురుగా ఒకళ్లు ఉండేవారు ఆ ఇంటికి ఒక చిన్న కర్ర—గేటు ఉండేది అది పాడై ఊడొస్తున్నప్పటికీ, కొత్త గేటు పెట్టటానికి వాళ్లకు మనస్కరించలేదు భోగినాడు లేచి చూద్దురుకదా! గేటు కాస్తా మటుమాయమై ఉన్నది దానితో ఆ ఇంటికి కొత్త గేటు అమరింది

భోగినాడు సాయంత్రంపూట తల్లులు పలు ముడిచి పేరంటానికి పిలిచి [illegible]

బొమ్మల కొలువు

మరో ముఖ్యమైన పేరంటం ఉన్నది ఆడపిల్లలు కన్నులపండువుగా బొమ్మల కొలువు తీర్చుకుంటారు సంక్రాంతినాటికి వాటిని తీరుగా పెక్కు సోపానాలుగా పేర్చి పేరంటం జరుపుకుంటారు రంగు రంగుల బొమ్మలు, రమ్యమైన బొమ్మలు, పేరుగన్న కొండపల్లి బొమ్మలు, గాజు బొమ్మలు, లక్కపిడతలు, దశావతారాలు, పాణిపూర్ బొమ్మలు, ప్లాస్టిక్ బొమ్మలు ఒకదాని సరసన మరొకటి కొలువుతీరి కూర్చుంటాయి వాటిని అమర్చటంలో పెద్దవారి కళాహృదయం దారులు వెతుక్కుంటుంది కొన్న బొమ్మలతోపాటు స్వయముగా బొమ్మలు చేసేవారు, కొన్న బొమ్మలకు తగు అలంకరణలు చేసేవారు కూడా ఉంటారు మట్టితో ఎగుడు దిగుడుగా ఒక కొండ, మధ్యలో దారులు, పెసలు పోసి మొలిపించిన మొక్కలు, కొండ—దారుల్లో ఒకటి రెండు ప్లాస్టిక్ కారులు, మనిషి బొమ్మలు, కొండపైన బొమ్మ — దేవాలయం, చుట్టూ రంగు రంగుల బల్బులు—చూడటానికి ఎంత అద్భుతంగా ఉంటుంది! ఈవిధంగా స్వయంగా బొమ్మలు చేసుకోవటంలో మన కళాతృష్ణ పెరుగుతుంది మన కళా నైపుణ్యం పెంపొందటానికి చక్కని అవకాశం లభిస్తుంది. బొమ్మలను ఎత్తివేసేదాకా రోజూ ఏదో ఒక పిండి వంట చేసి బొమ్మలకు దీపారాధన చేసి, నైవేద్యం పెడతారు

సంక్రాంతి పండుగకు కొత్త అల్లుడిని తమ ఇంటికి తీసుకుని వస్తారు కొత్త అల్లుడికి ఇది సరదాయైన పండుగ అల్లుడికి సెలవు దొరికి వస్తానవటమే అత్తమామలకు కొండందుకున్నట్లు ఉంటుంది పండుగకు వచ్చిన అల్లుడికి సంతోషంగా, సకల మర్యాదలు జరుపుతారు లాంఛనంగా కానుకలు చెల్లించుకుంటారు పండక్కి అల్లుడికి ఏదో విలువైన వస్తువు నివ్వటం మామగారు తమ బాధ్యతగా భావిస్తారు ఇవ్వకపోతే అవమానం గావించి అలుగుతాడు అల్లుడు అత్తగారింటి నుండి తిరిగొచ్చిన అల్లుడిని అందరూ వేసే మొదటి ప్రశ్న: "ఏం యిచ్చారు ?" అని


'బావా, బావా, పన్నీరు, బావను పట్టుకు తన్నేరు' అంటూ బావను ఆటలు పట్టించే కొంటె మరదలు కూడా ఉంటే పండుగ భలే సందడిగా గడిచిపోతుంది

సంక్రాంతి రోజుల్లో గంగిరెద్దుల్ని పూసల బట్టలతో బరువుగా అలంకరించి ఇంటింటికీ తీసికెళ్లి 'డూ డూ బసవన్నా, అయ్యగారికి దణ్ణం పెట్టు' అంటూ ఆడిస్తారు

ఈ వేడుకలతోపాటు దేవాలయాల్లో ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి పితరులు తరించటానికి సంక్రాంతి పుణ్యకాలంలో విరివిగా దానధర్మాలు చేస్తారు.

కనుము, ముక్కనుము రోజుల్లో ఎవరూ ప్రయాణాలు చేయరాదు 'కనుమునాడు కాకైనా కదలదు' అని మన పెద్దవాళ్లంటారు

ఈ నాలుగురోజులూ పిండివంటలు చేసుకుని వేడుకలు జరుపుకుని కులాసాగా కాలక్షేపం చేస్తారు సంక్రాంతినాడు ముఖ్యంగా తమిళనాడులో చక్కెర పొంగలి వండుతారు అందుకే సంక్రాంతికి 'పొంగల్' అనే పేరు వచ్చింది. ★



చదువుకున్నవారికేనా గర్వం?

చదువుకున్నవారికే గర్వం ఉంటుంది అనటము అందరికి పరిపాటయినది అట్లనటము సమంజసమో, కాదో అని ఎవ్వరూ ఆలోచించరు నిజంగా చదువుకున్నందుకే గర్వం వస్తుందా ? గర్వం అనేది వారివారి మనస్తత్వం ప్రకారము వస్తుంది నిజమైన విద్య — వచ్చినవారికి గర్వం అనేది ఏ కోశానా ఉండదు

కుమారి డి లీల (ప్రొద్దుటూరు)

* * *

గర్వం చాలమందిలో ఉంటుంది కాని, చదువుకున్నందువల్ల రాదని నా అభిప్రాయము

పంజా విజయలక్ష్మి (వైజాగ్)

* * *

ఈ 20 వ శతాబ్దములో కూడ చదువుకొన్నవారిని చూసినయెడల వారు ఎంత మంచివారైనప్పటికి ఎంతో బెరుకుగా, ఎదుటివారు మాట్లాడ్తారు ఒకవేళ చదువుకున్నవారు ఎక్కువగా మాటాడకపోతే, అమ్మో! ఆమె చదువుకొంది, అందుకే మనతో మాట్లాడదు వారికి గర్వము అంటారు అందరితో కలసి మెలసి ఉండి మాట్లాడితే చూడండి ! తనే చదువుకొన్నదని గర్వంగా ఎలా మాట్లాడుతుందో అంటారు విచిత్ర మేమిటంటే మన మహిళలే ఇటువంటి మాటలంటారు చదువుకొంటేనైతే గర్వము రాదని, వారి వారి మనస్తత్వాల మీద వారి గుణము ఆధారపడి ఉంటుందని ఇప్పటికైనా నారీలోకము గ్రహింతురుగాక !

కె సుశీల (సూర్యాపేట)

* * *

చదువుకున్నవారికి కానివ్వండి, మరెవరికి కానివ్వండి, గర్వం ఉందని భావించేవారు ముందు వారి యెడల తమకుగల అసూయ మాత్రమేనని ఈ వ్యాసం చదివిన ప్రతివారు తెలుసుకొనగలరు.

బి కస్తూరిబా నాయుడు (మెంటేపూడి)

* * *

'గర్వం' ఒక్కొక్కరి మనస్తత్వంపై ఆధారపడి ఉంటుంది. చదువుకున్న అమ్మాయి ఎంత వినయ విధేయతలతో నడచినా, 'ఆమెకి గర్వం' అనే పదం చాలమంది వాడుకచేయడం దురదృష్టం నా ఉద్దేశంలో చదువుకీ—గర్వానికీ సంబంధం ఏ కోశానా లేదు గర్వం, అతిశయం స్వతస్సిద్ధంగా అలవడేవి గాని, విద్యవలన కాదని నా విశ్వాసం.

లక్ష్మి (రొర్కెలా)

రచయిత్రిగారు చెప్పినట్లు చదువుకున్నవారికే గర్వం అని భావించటం చాలా పొరపాటు

కనుక గర్వానికి, చదువుకి ముడిపెట్టడం చాలా తెలివితక్కువతనం గర్వంగా ఉండే ప్రబుద్ధులు, అది కూడా ఒక గొప్పేనని భావిస్తారు కాబోలు

ఎం సరళాదేవి (గుంటూరు)

* * *

ఏదో కారణాంతరాలవల్ల, ఎవరికైనా పేరంటానికి వెళ్ళటకు వీలుపడదు అటువంటప్పుడు ఇంటికి వచ్చిన పేరంటాళ్ళతో ఎంత చదువులేని దద్దమ్మలయినా ఏమే ? (శ్యామలా, మీ అక్కబి ఏ పాసయినంతమాత్రాన మా యింటికి పేరంటానికి వస్తే తక్కువతనం కాదులే !) అలా మాట్లాడరు అయినా ఇప్పుడు ఎవరిళ్ళల్లో చూచినా చదువులే ! చదువుతున్నందువల్ల గర్వం వస్తుందని ఎవరూ అనరు

ఆర్ అమ్మలు (శ్రీకాకుళం)

* * *

సభ్యత

సభ్యత అనేది స్వతహాగా సంప్రాప్తించేది కొంత, చదువు, సంస్కారంవల్ల సంక్రమించేది కొంత ఈర్ష్య, అసూయాద్వేషాలవల్ల సభ్యత మరచిపోతారు కొందరు సినిమాహాల్లోనే అనేమాట ఏమిటి! రైలుప్రయాణాల్లో, బస్సుల్లోను, అన్ని చోట్లా కూడా సభ్యత మరచి నాగరికం పేర అనాగరికంగా ప్రవర్తించేవారు ఎందరో! మనిషిలో మంచితనానికి, విజ్ఞానానికి కొలతబద్ద చదువు, హోదాలు కావు ఎదుట వ్యక్తి యెడల తను ప్రవర్తించే సభ్యతాయుతమైన ప్రవర్తన అని గ్రహిస్తే "సభ్యత" వ్రాసే అవసరం బాలగారికి లేకపోవును

లక్ష్మిపాప (చక్రధరపూర్)

* * *

నే నొకసారి బస్సులో ప్రయాణం చేస్తున్నాను నా ప్రక్కసీటు ఖాళీగానే ఉంది బస్సు కొంత దూరం పోయేసరికి బస్సంతా ఖాళీలేకుండా నిండిపోయింది ఒక 25 సం వయస్సుగలాయనకు సీటు దొరకలేదు పాపం ! ఆయన నావంక రెండు మూడు సార్లు తటపటాయించి చూసి, నా ప్రక్క కొచ్చి కూర్చున్నాడు గబుక్కున ఎత్తుపల్లాల మూలాన బస్సు కొంచెం కుదుపుతుంది బస్సు కొంచెం కుదుపుతుంటే అతను యీ వంక చూచుకుని తనకు తన్నే కుదుపుకుంటూ యిష్టం వచ్చినట్లు నామీద పడుతున్నాడు రెండు, మూడు సార్లు చూసి, సహించలేక "కొంచెం ప్రక్కకు జరిగి కూర్చోం"డన్నాను

"ఇంకా క్రింద కూర్చోమనలా నయం. కలిస్తే లేచి మంచో సీటులో యిద్దరు కూర్చో ఏమిటి ? అంటూ బుకాయించాడు ఆయ బస్సులోవా ళ్ళందరు పళ్ళికిలిస్తూ నావంకే చూస న్నారు నాకు చచ్చే లజ్జ వేసింది సభ్యతు ..నిషైతే అలాగనేవాడేనా !

బి అరుణాదేవి (అంపాపుర

* * *

ఒక విధంగా చదువుకున్నవారికంటె చదువుకోని వారికి సభ్యత బాగా తెలుసునేమో ననిపిస్తుంది రచయిత్రిగారు చెప్పినట్లు నేడు మానవునిలో వైజ్ఞానికతృష్ణ పెరిగినంతగా ఆత్మపరిశోధన జరగటంలేదు కాని పాశ్చాత్య దేశాలలో సభ్యతకు నేడు ఉన్న విలువ భారతదేశంలో కనపడుటలేదు కాలేజీ చదువులను చూసి మురిసిపోయే కొద్దిమంది యువకులు రచయిత్రిగా రన్నట్లు అసభ్యతనే 'నాగరికత' అనుకుంటున్నారేమో ననిపిస్తుంది కాని అసభ్యత ఒక పురుషులలోనే కాదు, స్త్రీలలో కూడ—ముఖ్యంగా చదువుకున్నవారిలో కనబడుతూ ఉంటుంది చదువుకున్నంతమాత్రాన సభ్యత తెలుస్తుందనుకోవడం పొరపాటు కాని సభ్యతలేని చదువు దేనికి ?

జి ఆంజనేయమ్మ (గుంటూరు

భార్యలు బానిసలా?

ఒక్క మగవారి గురించే వ్రాసినారు ఆడవాళ్ళలో కూడ కొన్ని లోపాలు ఉంటాయి వాటి గురించి వ్రాస్తే ఆడవాళ్ళలో ఉన్న లోపాలు తెలుస్తాయి.

శ్రీమతి సత్యాన్నారాయణ (మల్యాడ) ★

వంటలు

చక్కెర పొంగల్

బియ్యం	...	1 అరాకు
పెసరపప్పు	...	1 అరాకు
బెల్లం	...	10 పలాలు
నెయ్యి	...	1 కప్పునిండా
జీడిపప్పు	...	2 పలాలు
లవంగాలు	...	8 లేక 9
ఏలక్కాయలు	...	8 లేక 9
కిస్‌మిస్‌పళ్ళు	...	2 పలాలు
నీరు	...	7 కప్పులనిండా

పెసరపప్పు ముందుగా రెండు చెంచాల నేతిలో వేయించి, బియ్యంతో బాటు కడిగి, మరుగుతున్న నీళ్ళకు చేర్చాలి. ఇంతలో అయిదారు చెంచాల నీటిలో బెల్లం కలుపుకుని పాకం అయ్యేవరకూ ఉడికించాలి [చన్నీటిలో ఒక చుక్క పాకం వేస్తే గట్టి ఉండగా తయా


... వంటలు

రయినప్పుడు పాకం సిద్ధమయినట్లే.] పాకానికి అన్నం, పప్పు చేర్చి బాగా కలపాలి. ముద్దగా అయేవరకూ పొయ్యిమీదనే ఉంచడం అవసరం. ఆ పైన, నెయ్యి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్‌పళ్లు కలిపి నిప్పుమీద నుంచి తీసెయ్యాలి. వేడిగా ఉన్నప్పుడు తింటే బాగుంటుంది!

పులగం (వెన్ పొంగల్)

పెసరపప్పు	...	1 ఆళాకు
బియ్యం	...	1 ఆళాకు
జీడిపప్పు	...	2 పలాలు
ఇంగువ	...	రెండు చిటికలు
మిరియాలు	...	1 చెంచా
అల్లం	..	రెండు చిన్న ముక్కలు
నెయ్యి	...	½ కప్పు
నీరు	...	7 కప్పులు

చక్కెర పొంగల్‌కి చేసిన గానే, పెసరపప్పు నేతిలో వేయిం కడిగిన బియ్యంతోబాటు మరు తున్న నీటిలో వేసి, ఉప్పు, మి యాలు, అల్లం ముక్కలు చేర్చా మెత్తగా ఉడికిన తర్వాత, నీరంత కూడ ఇగిరిపోయేవరకూ కలుపుతు ఉండాలి ఆ తర్వాత నిప్పుమీ నుంచి తీసి నెయ్యి, జీడిపప్పు కలు కుని వేడివేడిగా తినాలి.



క్లాస్‌స్టార్‌తో భవదీయుడి ఇంటర్వ్యూ

వి. కృష్ణానంద్

చిన్న మనవి - 'క్లాస్‌స్టార్' అంటే 'ప్రఖ్యాత తార' యిది ఆమెగా వొచ్చును అతడుగా వొచ్చును 'అది' అంటే ఆకాశంలోని నక్షత్రంమాత్రం కాకూడదు ఉదాహరణకు ఇంటర్వ్యూ సమాధానాలలో "అ" ఉంటే అది మగతార "ఆ" ఉంటే అది స్త్రీ తార అని గమనించ ప్రార్థితులు నేను వెళ్లి లోపలకు

అడుగెడుతూ ఉండగానే కాకరపువ్వొత్తి పువ్వుల్లా నవ్వుతూ హిందీ అయితే ఇంగిలీషు ఫ్యాషన్‌లోను బెంగాలీ అయితే హిందీ ఫ్యాషనులోను, తెనుగైతే దక్షిణాది ఫ్యాషన్‌లోను సినిమా నవ్వు (తెనుగ నవ్వుకీ, సినిమా నవ్వుకుతేడా స్థలాభావంచేత వేరొకసారి ఇస్తాము పాఠే. ఆ గారు లేక ఆ గార నన్నాహ్వా నించగా, ఆ పారేసిన నవ్వుతో ఒక్కసారి ఉషారు పుంజుకుని నేనూ నవ్వేశాను ఇది తద్ధర్మం

ఇది రెండువేపులా—అంటే ఇరువక్కలా అను కునే చేసింది సుమా!

గది అంతా శోభయమానంగా క్లాస్టార్ కళాభిరుచిని చూపించేలాగే ఉంది గోడలకి సగంవరకూ ఆర్ట్ డిజైను డెకరేషనూ ఆపక జరీఅంచులాంటి పెద్ద బోర్డరూ ఉంది మిగతాది మెర్క్యురీ కాంతిలో ఫలానీ అని తెలియని (క వివ్వాదయుంలాగ) రంగులోఉంది బాగుంది చాలా బాగుంది అన్నట్టు 'తార' సంగతి మరిచిపోయాను ఆవిడ చాలా బాగుంది మొదట స్త్రీతార (పిక్చెస్ అంటారా మీరు) దగ్గరకే వెళ్లాలిట— వెళ్లాలిట ఏమిటే వెళ్లాను

ఆమె ఎంత సాదాగా ఉందంటే అరే! ఈమేనా? తెరమీద రాణీ వేషంలో స్పెషల్ సైజు సింహాసనం మీద చాలవంత వాజాగ్గా ఉందీ అనిపించింది చాలా సాదాగా ఒక తెల్లని సిల్కుచీరె కట్టుకుని మెళో ఒక గోల్డు గొలుసూ జెళ్లో ఒక పువ్వు తురుముకుని కూచొంది అని, కవి 'రాయని' సొంత డైలాగు చెప్పడంతో నేను అడుగుదామనుకున్న అసలు ప్రశ్న కాస్తా మర్చిపోయి, 'మీరు ఫలానా స్టంటు సినిమాలో అద్భుతంగా వేశారండీ' అన్నాను ఖర్మ! ఆ ఫలానా స్టంటులో ఆమె పేర పబ్లిసిటీ జరిగి, నా కొంప ముంచింది వెంటనే ఆమె ఇలా అంది సారీ! ఆ సినిమాలో నా కాంట్రాక్ట్ కాన్సిలైంది"

నేను (నాలిక తడి జేసుకుని, అబద్ధాల్లాడ మేనా రాందే, ఇంటర్వ్యూకి రావడమేమిటని తిట్టుకుని లోపల లోపల మరేం అవునవును అదే అదే ... లేటెస్టు ఎంత అద్భుతంగా ఉందీ అంటే

ఆ:—దానికేం గాని, మీరు ఏవో ప్రశ్నలు......

నే:—ఆఁ......ఊఁ.....మరే..... మీరూ...మీరూ (అవతల కారు హారన్ విని) కుక్కలు అంటే "డాగ్స్"ని పెంచుతారా? (అసలవంటే నాకు భయం)

ఆ:—నాకు 'డాగ్స్' అంటే చాలా ఇష్టం......

......నో......... (నన్ను వారించి నే నేం చెప్తా ననుకోకండానే) ఈ వాటుకుక్కలు గావు...... "ఫారిన్ డాగ్స్" అని అంటే మోజుపడి మొన్న నేను స్విజ్జర్లాండు వెళ్ళినప్పుడు అక్కడికి ఒక 'ఫ్రెండ్' అంటే "ఫాన్"టలెండి) ఇటలీనుంచి తెప్పించగా నాటిని కొని.......నాకూ........

నేను —(అయ్యయ్యో కుక్కల పాఠం జపితోండే ని) మాటమార్చబోయి, "పిల్లల" గురించి అడగనా అనుకొని అంతలో మనసు మార్చుకొని, కారు గురించి అడుగుదామనుకున్నాను. ఎందుకంటే నాకు అవతలనించి "భౌం భౌం"మని 'అల్సేషన్ కుక్క అరుపు వినిపించింది. ఆమెను కారు గురించి అడగ్గానే, "నాకు రోల్సురాయస్ అంటే ఇష్టం' అంది.

నేను చాలా ఆశ్చర్యపోయాను. ఇంకా నయము మింక్‌కోటు అనలేదు అనుకుని "చాలా మంచి ఇష్టం అంటే "కాస్ట్లీ డిజైర్" అన్నాను 'నవ్వ నములాస్తా. అయితే నాకు ఇప్పుడున్నది వచ్చుకారు లెండి. మన కా ఊళ్లో అంత కారెందుకూ?" అన్నదామె.

నేను హానాను! మన దేశంలో "స్టార్స్" అంటే అంత ఖరీదులేదులెండి" అన్నాను.


అ:—అయితే నా సంగతి వేరులెండి..... అంతలో డోర్‌బెల్ (మోగింది) చూశారా? అప్పలు ఈ ప్రొడ్యూసర్‌లు బ్రతకనివ్వరనుకోండి—కొరుక్కు తినేస్తారు అంటూ ఫోను అందుకోబోయింది.

"సారీ! డోర్" అన్నాను నేను.

ఆమె గడియారంలో టైము చూసుకుంది. "సాయంకాలం కాల్‌షీటు ఉంది" అన్నది.

నేను ఆమె నడుగుదామనుకున్న ప్రశ్నలు నెమరు వేద్దామనుకున్నాను గాని ఆవిడ మెల్లిగా లేచి 'కాల్

24-వ పేజీ చూడండి



కొత్త అమ్మాయి నటి శీలా, ఫోటో: ప్రభాకర్,



పన్నీరు - కన్నీరు

—చందిపాడ భీమారావు—

జ రి గి న క థ

సిరిపాలెంలో సూరపరాజుకరణం సూర్యనారాయణగార్ల కుటుంబాలు ప్రశస్తికెక్కినవి సూరపరాజు తల్లి లక్ష్మమ్మ ఆ ఇంట పెద్దబొమ్మగా రున్నది, సూర్యనారాయణకి నలుగురు పిల్లలు ఆ ఊరికి వరదలువచ్చాయి నరసింహంగారూ, వచ్చారు అంతకుక్రితం కూరపాడులో వేంకటశాస్త్రిగారి కూతురు పెళ్లి మున్సబు సాయంలో జరిగింది కాని,ఆమె మానభంగమైందనే అవమానంలో ఆత్మహత్య చేసుకుంది శాస్త్రిగారు మరణించాడు ఆయన ఇల్లు తగలడిపోగా, కొడుకు మాయమయ్యాడు కొత్తగావచ్చి నరసింహం సూరపరాజు మద్దత్తులో సిరిపాలెంలో బడి పంతులయ్యాడు

5
నారికేళ సలిలము

సిరిపాలేనికి సిరందుకుంది, కాలువలు రావడంతో. అతిసారవంతమైన డెల్టాభూమి అవసరాలకి సరిపడా, ఇంకా కావలసిస్తే ఎక్కువగా నీటి సరాఫరా పంటలమీద పంటలు మొదటి పంట, రెండో పంట రెండూ పంటలకీ మధ్యలో పెసర పంట పచ్చిక బీళ్ళు, బంజర్లు, పోరంబోకులు అన్నీకూడా వరిపంటతో నిండిపోయాయి ఊళ్లో ఎక్కడ చూసినా ధాన్యరాసులే. ఇంట్లో, గాదుల్లో, పురుల్లో

... ంత ధన్యం ... భూములున్న పెద్ద భూస్వాములు కొందరు కొంత భూమిని చెరకు తోటలకి కేటాయించారు వాళ్ల ఎంత సంపదైనా చెరకుతోటలమీదే వచ్చింది కొంచెం సన్నకారు రైతులుకూడా వెనకటి అప్పులు కొంచెం తీర్చుకుని, కొంచెం వెనకెయ్యడం మొదలెట్టారు ఎటొచ్చీ కూలికి పనిచేసేవాళ్లూ పెట్టేవాళ్లూ మాత్రం మామూలుగా కిట్టే గింజలతోనే బ్రతుకుతున్నారు ఎటొచ్చీ సిరి బాగా అబ్బినవాడు మరీ పీనాసిరకమైతే తప్పించి, తనమీద ఆధారపడి ఉన్న వాళ్లనికూడా కొంచెం బాగా చూస్తాడు తనకు కలిగింది కాస్త వాళ్లకూ కొద్ది ముట్టచెప్తాడు ఆవిధంగా మాత్రమే ఆ ఊళ్లో భూములు లేని వాళ్ళ పరిస్థితి కాస్త పై మెరుక్కనిపించింది ఒక ఊరైనా, ఒక దేశమైనా ఒకటే అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అంటే అర్థం, ఉన్నవాళ్లు మరికొంత పోగేసుకునే అవకాశమిచ్చేది అని దాని వాసనలు సూచనప్రాయంగా మాత్రమే అందరికీ చేరతాయి

కొన్ని వీసెల బంగారం సిరిపాలెపు స్త్రీల ఒళ్ళ మీదకి చేరింది. బాగుపడాలనిఉండి బాగుపడ్డం ఒడుపు తెలిసినవాళ్లందరూ బాగుపడ్డారు మునసబుగారు డాబా వేయించారు రాయుడు ఇంకో పదెకరాల భూమి పక్కఊళ్లో కొన్నాడు రామరాజుగారు రొక్కరూపంలో ఇనప్పెట్టెలో చేర్చారు కరణంగారు భార్యపేర పట్నంలో ఇల్లు కొని అద్దెకిచ్చాడు

సూరపరాజుగారి సిరి కూడా పెంచి జోరుగా ఉంది; ఇదివరకెన్నడూ ఎరగనటువంటి విపరీతాదా

... ఎటు ఛ నలుగురిలాంటి ... ఆయనకి ఆదాయంతోబాటు ఖర్చులు పెరిగాం నరదాలు వృద్ధి అయ్యాయి ఇదివరకు అర్థ అణా మేజుపెట్టి ఆడే పేస్తులు ఇప్పుడు పిల్లకా మేజుల్లోకి వెళ్ళాయి పేక పట్టుకుకూర్చుంటే ని ఆహారానికికూడా లేవకుండా రెండేసి, మూడేసి రోజు కూర్చునేవారు పైగా ఎవరే కొత్త వింత, విశే చెప్పినా, అది ఇంట్లో అవసరంఉన్నా, లేకపోయి అప్పటికప్పుడు వెళ్లి కొని తెచ్చిపెట్టడం వం కొందలు పోసి తెచ్చిన ఏ విలువుటద్దమో, దంత బొమ్మో, మూడురోజుల్లో ఏ పిల్లలో విరగ్గొ ఆయనకి మళ్లీ చీమకుట్టినట్టైనా ఉండేదికాదు "ఆడుకోనియ్యవే, ఏం వాడి ఆటకన్నా ఆ వెధవబొ ఎక్కువేమిటే" అనేవారు పిల్లల్ని విపరీత గారా చేసేవారు సిరి పెరుగుతూన్న ఆ రోజుల్లో ఆయ కింకా ముగ్గురు పిల్లలు పుట్టారు ఇద్దరు మొ పిల్లలూ, ఒక ఆడపిల్లా

బాగా డబ్బొస్తున్న కొత్తరోజుల్లో ధైర్య చేసి, సీతమ్మగారడిగిందొకరోజున; "అయిదేళ్ల న్నొంది కమలమ్మ (సూరపరాజుగారి చెల్లెల పెళ్లికి చేసిన అప్పు వడ్డీ పెరుగుతోంది తీర్చిపారెయ రాదండి మీరు తల్చుకుంటే అది ఒక కష్టమా అని సూరపరాజుగారు నవ్వి "అలాగేలే చూద్దాం మన నాగయ్యేగా ఫరవాలేదులే అయినా అబ్బాం ఒడుగోటి ఉందిగా" అన్నారు అంటూనే నరసింహ

—45వ పేజీ చూడండి



కొత్తనటి పుష్పలత ఫొటో : ప్రభాకర్

(22 వ పేజీ తరువాయి)

షీటో అంటూ 'గాయబ్' ఐపోతుందేమోనని ఆమెకు చాలా ఇష్టమైన 'కుక్కల గురించి చెప్తే బాగుటుందని

"మావాడు ఒకడు పిల్లలు, అందులోకీ గండు పిల్లలు కూడానా; పెంచేవాడ"న్నాను

ఛీ ఛీ! వాకవి అంటే గిట్టదు మా నాన్నగారు నాకు వేటి? నీకోసం ఫారిన్‌నుంచి 500 రూ ల కుక్కపిల్లని తెచ్చా నన్నారు పండుగకి అంటోం దామె కూచొని (ఇక ఫర్వాలే)

"కుక్కలకి కలర్ బ్లైండ్‌నెస్ ఉంది" అన్నాను నేను

"అంటే?"

నేను — 'అంటే వాటికి కొన్ని రంగులు అగుపించవ్'

ఆమె —నాకు రెడ్" కలర్‌కన్నా డార్క్ గ్రీన్ (ముదురాకుపచ్చ) నప్పుతుంది అని ఎవ్వోతి ష్కుడు చెప్పాడు అందుకే ఎర్రచీరలు కట్టుకోడం మానేశాను

నేను కుక్కలకి అన్నం బూడిదరంగులో అగుపిస్తుందిట

ఆమె —నాకు ఈమధ్య 5, 6 పిక్చర్‌లు ఒకే సారి రావడంలో ఉక్కిరి బిక్కిరిగా ఉంది (గడియారం చూసుకొంది) (నాకు భయం వేసింది) అన్నాను ముఖ్యంగా మిమ్మల్ని మీకునచ్చే రోల్సు'

ఆమె — ఐసీ! నాకు సరిపడే రోల్సు (ఆమె మరీ లావుగాదు గాని, లావుగానే ఉంటుందని మొహమాటస్తులు ననుగుతారుతెండి) వేస్తాను ఈమధ్య ప్రొడ్యూసర్ల గోల భరించలేక రేటు పెంచేసుకున్నాను

నేను —అది గాదూ మీరూ 'స్టోరీ' ఆపి ఎన్నుకుని


ఆమె —('స్త్రీవాదా?' అన్నట్టు నవ్వి) సారీ! నాకంత తీరికలేదు — నిజం చెప్పాలంటే కొన్ని సినిమాలు వాని నేను ఇంతవరకూ కథ ఏమిటో ఎరుగను......కొత్త కాంట్రాక్టులు చేసుకున్నాయ్!

షీట్ ఉంది........

ఆమె వెళ్ళిపోయింది......

నా ప్రశ్న అంటే నేనడుగుదామనుకున్న ప్రశ్న... మీరు 'కథలు' చదివి పాత్ర నైజమెరిగి 'మంచివి ఎన్నికైనవి పాత్రలు వేయాలని అనుకుంటున్నారా" అన్నది నెమరువేస్తూ తిరిగి నా అద్దెకారులో వస్తూ ఉంటే......ప్రతి రోడ్ క్రాసింగ్ దగ్గర ప్రఖ్యాత తారను నేను అడుగుదామనుకున్న ప్రశ్నలు ఒకటే ఒకటే బుర్రలో చేరసాగాయి......కాని....

[తెలుగు సినిమాలోలాగే యీనా పాత్రలు సైతం కేవలం కల్పితాలు.] ★



సమాధానాలు

విజయనగరం శ్రీ జి. పి. దాసుగారికి : కొన్ని పుస్తకాలలో అచ్చు తప్పులు ఉంటాయని చెప్తూ నేను చూపిన శ్రీ ఏకా సుబ్బారావుగారి ప్రమాణాన్ని కాదని, మీరు మరొక పుస్తకాన్ని ఉదహరించడం సబబుగా లేదు అందులో మాత్రం తప్పులు ఉండవా ? ఇంకా తరువాత ఆరోహణావరోహణాలు యిచ్చి మీ రన్నమాటను నిరూపించబోయారు,, అది కొంత బాగుంది కాని ఈ వాదంలో కూడా కొంత లోపం లేకపోలేద కదన కుతూహలంలో కాకలీ నిషాదం ఉన్నందువలన కదా ఆ రాగం ధీర శంకరాభరణం జన్యమని మీ అభిప్రాయం ? ఈ విషయం గమనించండి కొన్ని రాగాలలో ఒక స్వరం ఉన్నచోట దానికి భిన్నమైన మరొక స్వరం (అంటే కాకలీ నిషాదానికి బదులు కైశికీ నిషాదం అనుకోండి) రక్తికోసం ప్రయోగించబడటం కద్దు శాస్త్రోక్తంగా చెప్పాలంటే, సంప్రదాయ ప్రదర్శిని ప్రకారం పీటని భాషాంగరాగా లంటారు కొంతకాలం తరువాత ఆ రక్తి ప్రయోగం కోసం వేసిన స్వరమే స్థిరమై స్వతహాగా ఉన్న స్వరమే రక్తి ప్రయోగ మవ వచ్చును ఈ మాట నేను వ్రాసిన దానికే నేను చేసుకొంటున్న సమర్థనగా తోస్తున్నదేమో ! అయితే కావాల్సొని ఆ సమర్థన సంగీత కళా ధి కీర్తిశేషులైన శ్రీ టి వి సుబ్బారావుగారిది


మరొక విషయం రాగాలు చాలాకాలం నుంచి ఉన్నా, వాటిని 72 మేళాలుగా విభజించినది చతు

ఖండిప్రకాశికలో వేంకటమఖి. ఆ కాలంలో రాగాలు ఫలానా మేళకర్తకు చెందాలి అని నిర్ణయించడం స్వర పరిశీలన ఫలిత గాక, రాగము యొక్క పూర్తి స్వరూపాన్ని బట్టి జరుగుతూండేది. ఈ మాటా నాది కాదు. ఆ సుబ్బారావుగారిదే.

ఇటువంటి విషయాలను వ్రాసేటప్పుడు ఎవరైనా సంగీతజ్ఞులను అడిగి వ్రాయటం మంచిదని సలహా ఇచ్చారు. సలహా చక్కగా ఉంది. కాని నేను సరాగమాల వ్రాస్తున్నప్పుడంతా ప్రక్కనే ఒక సంగీతజ్ఞుని కూర్చొనబెట్టుకోడం సాధ్యంకాని పని కదా! ప్రతి విషయం నేను వెళ్ళి అడగటం కూడా అసాధ్యమే. కాబట్టి ఒక పుస్తకాన్ని ఆధారంగా తీసుకొని వ్రాయటం. ఇంతకు చెప్పొచ్చే దేమిటంటే, శ్రీ ఏకా సుబ్బారావుగారు పొరబడి ఉండటానికీ అవకాశం ఉంది. లేక నేను చెప్పిన పూర్వ పద్ధతిని బట్టి సరిగానే నిర్ణయించి ఉండటానికీ అవకాశం ఉంది. మరొక మాట. చివరికి మీ రన్నట్లే యిద్దరు పండితులను దీని విషయమే అడిగాను.

కొద్ది రోజుల క్రిందట నటులు శ్రీ రమణమూర్తిగారింటికి యేదో పనిమీద వెళ్ళాను. అప్పటికి వారు శ్రీ నటరాజ కళాసమితి తరఫున వేస్తున్న నాటకం "కాటమరాజు కథ" రిహార్సలు ధాటిగా జరుగుతున్నది. రమణమూర్తి నన్ను లోపలి గదిలోనికి తీసుకొనివెళ్ళి అప్పటికప్పుడు ఆ నాటకంలో నాలుగు పాటలు పాడించి వినిపించారు. ఆ నాలుగు పాటలు పెండ్యాల— ఆరుద్రల సంగీత సాహిత్యాల సమ్మేళనం కట్టిన మధురానుభూతులు కోటలు. ఒక్కొక్క పాట యెంత అందంగా ఉందనీ, వినేవారిని ఎంత ఆనందంలో ముంచెత్తుతున్నదనీ !!

మొదటి పాట "బంగరుతల్లీ మా గంగమతల్లీ" అనే బృందగానం. జానపదుల జాను తెనుగుతనమే సాహిత్యంగా ఆనందోన్మత్త హృదయాలనుంచి జాలువారే సంతోష లహరులే స్వరాల పరవళ్ళుగా పాడినబృందగీతమది.ఒక్కొక్కమాటలోను ఒక్కొక్క వింత అందముంది. ఒక్కొక్క చరణంలోను ఒక క్రొత్త ఛందముంది. ఆది ఆరుద్ర రచన. ఇక



"కృష్ణార్జునయుద్ధం"లో, వరలక్ష్మి, సరోజాదేవి, శ్రీరంజని

ఒకరు మీ వాదనే సరియైన దన్నారు. మరొకరు నేను వ్రాసిన వాదననే బలపరిచారు. కాబట్టి ఇందులో ఏది తప్పో నాకు తెలియటంలేదు. ఏది ఒప్పో మీరే నిర్ణయించుకోండి.

ఏది ఏమైనా నేను "విషయం తెలుసుకోకుండా చేసిన దండయాత్ర" నిష్ఫలం మాత్రం కాలేదు. చూడండి. దానివలనే శ్రమ తీసుకొని రెండు ఉత్తరాలు వ్రాసే అవకాశం మీకు కల్గింది. ఈ విషయాల గురించి తరచి తరచి తెలుసుకొనే అవకాశం నాకు కల్గింది. అందుకు నేను కృతజ్ఞుడను.

మురళి నభ్యసిస్తున్నామని వ్రాశారు. సంతోషం. ప్రజ్ఞావంతుల పెదాన అది పలకని భావముంటూ ఉండదు. వేసవికి నేను విజయనగరం వస్తే వాయించి వినిపిస్తారా ?

* * *

బరంపురం వరదరాజన్‌గారికి సమాధానం : సంగీత దర్శకులు జంటగా పనిచేసినప్పుడు ఏ పాటను ఎవరు చేసింది తెలియదు. సర్వసాధారణంగా ఆ జంటలో ఒకరే ఒక్క పాటనంతా చేయటం జరుగదు. లోగుట్టు పెరుమాళ్ళ కెరుక గాని నే ననుకోవడం ఒకరుచేసిన వరుసకు మరొకరు మెరుగులు దిద్దుతారని.

పెండ్యాల వరుసంటారా ? సంగీతం కాదది; కారణం లేని సంతోషం నిష్కల్మష హృదయాలలో చేసే గల్లంతు. సంబరాల సందడిలో వండే యెదల తీయని ఝంకారం. పాట చివర నడిగా "బంగరుతల్లీ మా గంగమ్మతల్లీ" అంటున్నపుడు ఆ స్వర ప్రవాహంలో తేలిపోని వారెవరూ ఉండరనిపించింది. ఈ పాటను ఎం. ఎస్. రామారావు, రఘు, వి. గంగరాజు ప్రభృతులు తమ ఉత్సాహంతో వినేవారు ఉర్రూతలూగేలా పాడారు.

తరువాతి పాట "మనలో మనకీ" అనే జాణతనాల జావళి కమ్మగా కళ్యాణిరాగంలో ఈ పాటను వసంత పాడుతుంటే యిది మూర్తీభవించిన వసంత చంద్రికా అనిపించక మానదు. పెండ్యాల సంగీత రచనలో ఒక ప్రత్యేకతను మీరు గమనించారా ? వారు అపూర్వ రాగాల జోలికి పోరు. కళ్యాణి, మోహన వంటి సాధారణ రాగాలనే తీసుకొంటారు. తీసుకొని వాటి కేమి మంత్రం వేస్తారో గాని వినటానికి యెంతో కొత్తగా ఉండేటట్టు రూపొందిస్తారు. కళ్యాణిరాగంలో యిటీవలి సినిమాలలోనే దాదాపు వంద పాటలదాకా వచ్చిఉంటాయి. కాని ఈ జావళి అందులో వాటిలో ఒక్కదానికైనా దశాంశమైనా లేదేం ? ఇదే విధమైన మంత్రాంగం "మహామంత్రి



'వాసవి' తొలిచిత్రంలో కృష్ణకుమారి.

విరివిగా వినపడుతుందో, మోహనకూడా అంతే. ఈ రాగంలోనే "మోహన రాగమహా" యెంత కొత్తగా మెత్తగా మలిచారో గుర్తుందా ? అసాధారణప్రతిభకు మారుపేరే పెండ్యాల.

మూడవ పాట వసంత పాడినదే. "ఇంగిత మెరిగిన చిలుకా" అన్నది. ఈ పాట రచనలో, పైన చెప్పుకున్న జావళిలో, చెప్పుకొనబోయే యుగళగీతం రచనలో ఆరుద్ర మగవారిని పట్టుకొని ఒక



"ఈడూ జోడూ" చిత్రంలో జమున.

దులువు దులిపివేశారు. ఆరుద్రగారూ! ప్రేమతో పొంగుతున్న యువ హృదయంనుంచి పాటలకు పాటలే మీరు తస్కరించినట్లు మాకు తెలిసిన విషయమే. ఈ జాణల హృదయాలనుంచికూడా దొంగిలించడం ఎప్పటినుంచి మొదలుపెట్టారు ? ఆ కిటుకు మాకూ చెప్పరూ, జాణతనంతో అవసరం మాకు ఎప్పుడైనా వస్తే ఉపకరిస్తుంది.

నాల్గవ పాట రఘు, వసంత పాడిన యుగళగీతం. "ఆడదేమి చేసినా అందమే". ఈ నాలుగు పాటల్లో సంగీతపరంగా చూసినా, సాహిత్యపరంగా చూసినా దీనికే ఒక వన్నె తక్కువై పదిహేను కళలే లెక్కకు వస్తాయి. కాని ఈ పాట అశేష జనాదరణ పొందుతుందనటంలో సందేహమే లేదు. అంత లలితంగా ఉంది.

పై పాటలను వి. గంగరాజుగారి వాద్యగోష్ఠి (పెండ్యాలవారి రచనే) ఇంపుగా వినిపించింది. ఇటువంటి పాటలు నాటకంలో వినిపించడం తెలుగు నాటకరంగం, ప్రేక్షకులు ఏనాడో చేసుకొన్న పుణ్యం.

* * *

సరాగమాల గురించి విశాఖపట్నం రామమూర్తి గారు ఈ విధంగా వ్రాశారు: "మీరు నడుపుతున్న సరాగమాల, సంగీతం గురించి మాకు తెలియని విషయాలు తెల్పటానికా, లేకపోతే మాకు వ్యాకరణం బోధించటానికా ? ఏదో సంగీతం గురించి వ్రాస్తూ బ్రాకెట్లలో క్రమాలంకారము అని వ్రాయటంలో మీ ఉద్దేశం ? "వల్మీకము నుండి వెల్వడిన వెలుగు రేఖలు" అంటే అర్థమేమయినా ఉందా ? పుట్టలోంచి వెల్తురు రావడమేమిటి ?"

నేను వ్రాసిన వాక్యం గుర్తుందా? "ఎం. వెంకట్రాజు అటు హిందుస్థానీ సంగీతాన్ని, ఇటు కర్ణాటక సంగీతాన్ని అభ్యసించి, అర్థంచేసుకొని....

సరాగమాల

అని వ్రాశాను. వారు హిందుస్థానీ సంగీతాన్ని అభ్యసించారు. కర్ణాటక సంగీతాన్ని అర్థంచేసుకున్నారు. నేను వ్రాసిన పై వాక్యం క్రమాలంకారమని వ్రాయకపోతే వారు రెండు విధాల సంగీతాన్ని అభ్యసించారనే అపార్థం వస్తుందికదా ? ఇక "వల్మీకము నుండి వెల్వడిన వెల్గురేఖల" గురించి మీకు తెలియదేమో కాని "వల్మీకస్సాతపో మేఘః" అనే నిఘంటువు ఉంది. వల్మీకమంటే యెండతో కూడిన మేఘమని దాని తాత్పర్యం. ఈ అర్థంతోనే నేను వ్రాశాను. ఇప్పటికి మీ సందేహాలు తీరిన వనుకుంటాను. అయినా మీరు ఘాటుగా వ్రాశారేమిటి ఉత్తరం ?



'పవిత్ర ప్రేమికు'లో రేలంగి

* * *

పాఠకులకు ఒక చిన్న సూచన. పేపర్ కొ తగ్గించినందువలన సరాగమాలకు స్థలం పరిమితమై పోతుంది. ఇటువంటి పరిస్థితిలో పాఠకుల ప్రశ్నల జవాబులు సరాగమాలలో ఇవ్వడం సాధ్యంకా పని. కాబట్టి ఏమైనా తెలుసుకోదలచినవారు సందేహాలతోబాటు ఇరవై అయిదు నయాపైస తపాలబిళ్ల కూడా జతపరచి పంపండి. వా కోసలనే మీకు నా జాబు అందుతుంది. ఈ సం హాలు మాత్రం నా పేరిట పత్రిక ఆఫీసు పంపండి.


పాఠకులందరికీ నా సంక్రాంతి శుభాకాంక్షలు.

[చిన్న ప్రశ్నలయితే ఇబ్బంది ఉండదు ! —సం]

సందేహాలు

ఈ చిన్న సంపాదకి జవాబిస్తారని ఆశిస్తున్నాను. ఏమిటంటే రచించిన పాట నంతటిని రికార్డింగ్ చేయరా? పాటల పుస్తకంలో ఉన్న పాట అంతా బయట రికార్డులలో వినిపించదు. మళ్లా సినిమాలో ఆ పాటంతా ఉంటుంది. బయట రికార్డులలో ఎందుచే పాటంతా ఉండదో తెలియపరచ కోరతాను. ఉ "వెలుగునీడలు" లో "హాయి హాయిగా జాబిల్లి" పాటలో మధ్య చరణం ఒకటి తీసివేశారు. తరువా "ఇద్దరు మిత్రులు"లో "నవ్వాలి, నవ్వాలి" పాటలో కూడా మధ్యచరణం లేదు.

తరువాత ఇంకొక సందేహం: "అనురాగాల సారము లాయనా? మన యోగాలు మారిపోయినా"



"శ్రీకృష్ణార్జున యుద్ధం"లో నాగేశ్వరరావు, సరోజాదేవి.



"తోబుట్టువులు"లో సావిత్రి, జమున

సరాగమాల

అనే పాట ఏ సినిమాలోనిది? దీనిని రచించినవారు ఎవరు? పాడినవారు ఎవరు? దీన్ని మొన్న నొకసారి రేడియోలో విన్నాను. అది దేనిలోదో వినలేదు. ఈ పాట చాలా బావుంటుంది. అందుచేత మీ జవాబులతో ఈ సందేహాలు తీరుతాయని వ్రాశాను.

కుమారి మంతా సావిత్రి (కాకినాడ)

* * *

ఇటీవల విడుదలైన "రక్తసంబంధం" చిత్రములో నాయకుడు జీవితములో విరక్తి చెంది, శాంతికోసమై తీర్థయాత్రలు చేస్తున్నప్పుడు తెరవెనుక నేపథ్య గానం "ఆఆ" అని ఆహ్లాదకరంగా వినిపిస్తుంది. ఆ గొంతు ఎవరిదో తెలియ చేయగలరా!

యస్. యస్. రావ్ (పెనమిళ్ళి)

* * *

30—11—62వ తేది సంచిక "సరాగమాల" 'ఉత్తరాల' శీర్షికలో ఎ. ఎస్. రావు (అసన్‌సోల్) గారు వ్రాసిన ఉత్తరములో 'ప్రభో! మరల పలుక వేలా?' రికార్డు పెండ్యాల నాగేశ్వరరావుగారు పాడినదే అనుకుంటాము అని వ్రాశారు. అది సరిగాదు. ఆ పాట పిఠాపురం నాగేశ్వరరావుగారు పాడారు.

వి. వి. శేషారెడ్డి (హైద్రాబాదు)

* * *

క్రితం ఆదివారం 5 గంటలకు 'వివిధ భారతి'లో 'విదురపోరా తమ్ముడా!' అనే 'సంతానం'లో లత పాడిన పాట వచ్చింది. లతతోపాటుగా ఘంటసాలవారు కూడా పాడినారు. కాని, అది లత, ఘంటసాల యుగళగీతంకాదుగదా? ఒక్క లతమాత్రమే పాడుతుంది? ఆ రికార్డు వాళ్ళిద్దరు ప్రైవేటుగా ఏమైనా ఇచ్చినారా? ఆ రికార్డు వివరాలు దయచేసి తెల్పుతారని ప్రార్థిస్తున్నాను. వీలైనంత త్వరలో తెల్పండి.

విరం (విజయవాడ)

* * *

"నా నగాల వినవే రవ్వంత....." అను 'సంసారం' చిత్రంలోని పాట పాడిన దక్షిణామూర్తిగారు ప్రస్తుత సంగీత దర్శకుడు దక్షిణామూర్తిగారు ఒక్కరేనా?

'జీవితం' చిత్రంలో "ప్రియమైన రాణీ"...... (డడడా) అను పాట, "ప్రియమైన రాజా...... (డడడా)" అను పాట పాడినవారెవరో మీ "సరాగమాల" ద్వారా త్వరలో తెల్పుతారని ఆశిస్తాను.

జి. యస్. ఆర్. బాబ్జీ, (సీతరామన్నపేట)

* * *

వెలుగునీడలు చిత్రంలో సుశీల, జిక్కి పాడిన "చల్లని వెన్నెల సోనలు" పాటలో "మా పాపాయి నవ్వు పువ్వులే" అని కొన్ని రికార్డులలోను, "మా పాపాయి బోసినవ్వులే" అని కొన్ని రికార్డులలోను ఉన్నది ఎందువలన? ఆరాధన చిత్రంలో "ఏమంటావు నేమంటానోయ్ బావ" పిఠాపురం, స్వర్ణలత పాడిన పాటలో చివర "స్పై వేషాల కు.....తయారుగానా" అన్న వరుసలు ఏడి రికార్డులో లేలెందుకని?

చౌద్విన్ కా చాంద్ చిత్రంలో ఆశాభోస్లే పాడిన "అయా తూహోయి" అనే పాట శభాష్ రాజా చిత్రంలో సుశీల పాడిన "లోకానా దొంగలు" అనే పాట వరుసేకదా! ఈ వరుసను మననుండి హిందీవారు అనుకరించినారా?

పి. భారతీదేవి (దేవేంద్రపాడు)



సినీతార జమున

ఫొటో: ప్రభాకర్

విఠలాచార్య దర్శకత్వంలో రామారావు

రసభరితంగా చిత్రాలు నిర్మించే దర్శక, నిర్మాత విఠలాచార్య, విఖ్యాతనటుడు యన్ టి రామారావు కలిసి తెలుగుచిత్రం రంగంలో మొట్ట మొదటిసారిగా వ్యవహరించబోతున్నారు.

ఖైదీ కన్నయ్య, రక్తసంబంధం నిర్మాతలు శ్రీ రాజలక్ష్మి పిక్చర్స్ నిర్మిస్తున్న జానపద చిత్రంలో విఠలాచార్య దర్శకత్వంలో రామారావు నటించబోతున్నారు.

ఈ నెల 21 నుంచి విజయ, వాహినీలలో జరిగే ఈ చిత్ర నిర్మాణంలో నటుడు రామారావుతో పాటు,కృష్ణ కుమారి, బి వి సరోజ, రేలంగి, గిరిజ, రాజనాల, పుష్పవల్లి, పద్మనాభం, ఇంకా పలువురు పాల్గొంటున్నారు.

సంగీతం: ఘంటసాల, మాటలు మహారధి, పాటలు ఆరుద్ర, నారాయణరెడ్డి.

ఈ ఇద్దరు ప్రతిభావంతుల కలయిక సత్ఫలితా న్నిస్తుందనే ఆశించవచ్చు.

"రక్తసంబంధం"
(వెండితెర నవల)

రాజ్యలక్ష్మీ వారి చిత్రం "రక్త సంబంధం" లోని మాటలూ, పాటలూ, ఛాయా చిత్రాలు కూర్చి తయారు చేసిన వెండితెర నవల మా కార్యాలయం చేరింది. ఈ చిత్రానికి కథ కొచ్చెర్లకోట? దీనికి మాటలు రాసిన ముళ్లపూడి వెంకటరమణ ఈ "నవల" కూర్చారు. వెల ఒక రూపాయి కావల్సినవారు మధు బుక్స్ మొగల్రాజపురం, విజయవాడ—2 కు రాయొచ్చును.

అవీ - ఇవీ - అన్నీ

అన్నపూర్ణావారి నూతన చిత్రం


ఇద్దరు మిత్రులు చిత్రాన్ని నిర్మించిన అన్నపూర్ణా పిక్చర్స్‌వారి తరువాతి చిత్రనిర్మాణం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. 'మంచిమనసులు' ఆదుర్తి దర్శకత్వంలో తయారవుతున్న ఈ చిత్ర చిత్రంలో నాగేశ్వరరావు, గుమ్మడి, రేలంగి, పద్మనాభం, శోభన్‌బాబు, రామలింగయ్య సావిత్రి, బి వి సరోజ, కృష్ణకుమారి, సూర్యకాంతం ఇంకా పలువురు పాల్గొంటున్నారు. సంభాషణలు: టి గోపీచంద్, పాటలు: శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరధి, కొసరాజు, సంగీతం: యస్ రాజేశ్వరరావు, ఛాయాగ్రహణం: సెల్వరాజ్, కళ: జి వి సుబ్బారావు, ఈ చిత్రంలో ఆకొలతాకులకర్ణిక అనే రేడియో గాయనిని, ప్లేబాక్ ఆర్టిస్ట్‌గా పరిచయం చేస్తున్నారు. చిత్రానికి నిర్మాత: డి. మధుసూదనరావు.

స్త్రీ సామ్రాజ్యం

పురుషోత్తమా పిక్చర్స్ స్త్రీ సామ్రాజ్యం తయారీ చాలా చురుకుగా జరుగుతున్నది. అంజలి మనోహర్, నరసింహ భారతి ఇంకా పలువురుగల ఈ చిత్రానికి మాటలు ప్రసాద్ కె వి ఆర్ ఆచార్య పాటలు: కె వసంతరావు, బి యన్ చారి, కోట సత్యరంగయ్యశాస్త్రి, సంగీతం: డి బాబురావు, విశ్వనాథ, కూర్పు: జి యన్. కృష్ణమూర్తి, దర్శకత్వం: కె వేంబు, నిర్మాతలు: బి పురుషోత్తం, డి సూర్యప్రకాశరావు, కె సుబ్బారావు.

వాసవీ ఫిలింస్
ప్రొడక్షన్ నెం. 1

శ్రీ రామకృష్ణ దర్శకత్వంలో నిర్మించబడుతున్న వాసవీ ఫిలింస్ 'ప్రొడక్షన్ నెం 1' దాదాపు 12 రీళ్ళు పూర్తయిందని తెలుస్తోంది. ఈ చిత్రంలో నటీనటులు: కృష్ణకుమారి, జగ్గయ్య, గుమ్మడి, రమణారెడ్డి, పద్మనాభం, సూర్యకాంతం, బేబీ, ఉమ మున్నగువారు. ఆధునిక సమాజంలో ఆత్మగౌరవమున్న స్త్రీ పాత్రను ఈ చిత్రం చిత్రీకరించుతుంది. ఈ మధ్యనే యీ చిత్రంలో ఏడు నిముషములున్న చిన్నపిల్లల గేయనాటికను చిత్రీకరించారు. ★



నిర్మాణంలోవున్న అన్నపూర్ణా చిత్రంలో కృష్ణకుమారి, సావిత్రి, నాగేశ్వరరావు.



జరిగిన కథ

దుర్గాప్రసాద్, విశ్వేశ్వరరావు కుమారుడు; భార్య అనసూయమ్మను హింసిస్తూ ఉంటాడు. దుర్గాప్రసాద్ కుమార్తె శ్రీదేవి జగన్నాథం వద్ద సంగీతం నేర్చుకుంటూ ఉంటుంది. సంపన్న కుటుంబీకుడే అయినా దుర్గాప్రసాద్ పిల్లలను, భార్యను ఉపేక్షించి, త్రాగుడూ, స్త్రీలోలతలకు అలవడతాడు. ఒకనాడు అనసూయమ్మను పొడిచి గాయంచేసి వెళ్ళిపోతాడు. గాయం మానాక,విశ్వేశ్వరావుగారి విధవప్ప చెల్లెలు; సుభద్రమ్మ అనే ఆమెను శ్రీదేవికి అత్తయ్య అని పరిచయం చేసింది. ఆమె భర్త చనిపోయి రెండు నెలలైంది ఆర్యాపురంలో ఆమెకు యిల్లువుంది అక్కడ శ్రీదేవికి ఆమె మరిది వేణుతో పరిచయమయ్యింది.

సుభద్రమ్మ వెళ్ళిపోయిన తరువాత, జయమ్మ మనుమరాలిని దగ్గరబెట్టుకొని అన్నివిషయాలూ ఆరా తీసింది. శ్రీదేవి తనూ, పిల్లలూ సరదాగా ఆడుకోడం, భోజనం చెయ్యడం, తరువాత పేరంటం అన్నీ ఉత్సాహంగా వర్ణించి, తల్లికీ, అమ్మమ్మకీ చెప్పింది. ఆమె సరదా చూశాక వాళ్ళిద్దరికీ, ఇన్నాళ్ళబట్టీ శ్రీదేవి ఏ సరదాలూ లేకుండా ఇంట్లో కూచుందని జాలివేసింది శ్రీదేవిమీద. ఆ పిల్ల సరదాలకు తా మడ్డు వెళ్ళకూడదని నిశ్చయించుకున్నారు. అన్ని బాధ్యతలూ బాగా తెలిసిన సుభద్రమ్మ ఉంది. కాబట్టి పరువు మర్యాదల గురించి తామేమీ భయపడనక్కరలేదని కూడా అనుకొన్నారు.

తను ఒంటరిగా కూర్చొని ఆలోచించుకునే వ్యవధి దొరకగానే, శ్రీదేవికి ముందుగా జ్ఞాపకమొచ్చిన విషయం, పేరంటంలో అందరూ తన అందాన్ని మెచ్చుకోవడం. అందరి కళ్ళూ తనవైపే! తన సౌందర్యానికి,చూసిన వాళ్ళంతా ముగ్ధులయ్యారు. అంతవరకూ ఒక బీదవాడుగా బ్రతుకుతున్న ఒక వ్యక్తిని హఠాత్తుగా ఒక సామ్రాజ్యాధిపతిని చేస్తే, వాడిలో ఎలాంటి మార్పు వస్తుందో, అలాంటి అనుభూతే శ్రీదేవి పొందింది. ఆమె, ఒక్కసారి సౌందర్య సామ్రాజ్య రాజ్ఞీత్వాన్ని పొందింది. తన సౌందర్యం, తమ సంపదా—వీటి గురించి పొగడనివారు లేరు. ఆవాళ పేరంటంలో వాళ్ళ మాటలు తల్చుకుంటూంటే ఆమె గుండె ఎక్కువ వేగంగా కొట్టుకోనారంభించింది. అబ్బ! తను అంత అందమైనదనీ, తనలో అంత ఆకర్షణ ఉందనీ తనకు ఇన్నాళ్ళబట్టీ ఏమాత్రమూ తెలియదు.ఇంట్లో ఎవరూ ఆ విషయం ఏనాడూ చర్చించలేదు. ఆఖరికి సంగీతం మేస్టారైన జగన్నాథంగారు కూడా ఆ విషయం అనలేదు. తను ఏనాడూ బయటికి వెళ్ళకపోవడంవల్ల తన సంగతి తనకే తెలియదు. ఇకనుంచి వీలైనంత వరకూ బయట కూడా తిరగాలి. అప్పు డామెకు జగన్నాథంగారు చెప్పిన మాటలు జ్ఞాపకమొచ్చాయి. తను కొన్ని సంగీత సభలకు తరుచూ వెళ్ళి వినడం చాలా అవసరమని ఆయన అన్నారు. అనేకమంది చేసే పాట—కచ్చేరీలు వింటేనే గాని, సంగీతజ్ఞానం అభివృద్ధి కాదన్నారు. తనను పెద్దవాళ్ళు ఎక్కడికీ పంపరనుకొని ఊరుకొంది ఇన్నాళ్ళూ. ఇప్పుడందు కొక మార్గం ఏర్పడింది. సుభద్రమ్మ ద్వారా చెప్పిస్తే అమ్మమ్మ వింటుంది.


శ్రీదేవిలో కలిగిన ఉత్సాహం రెండు మూడు రోజులదాకా అలాగే ఉంది. మరునాడు జగన్నాథం గారు వచ్చినప్పుడు త్యాగరాజ ఉత్సవాలు ఎప్పుడు జరుగుతాయో అడిగి తెలుసుకుంది, ఆయన "త్యాగరాజ ఉత్సవాలకు ఇంకా కొంత టైముంది. అవి సాధారణంగా జనవరిలో జరుగుతాయి. వచ్చే సోమవారం కాలేజీ గ్రౌండ్సులో ఒక గొప్ప కచేరీ జరుగుతుంది. ఆంధ్ర వారోత్సవ సందర్భంలో దేవిక అనే ఒక కళాశాల విద్యార్థిని వీణ వాయిస్తుంది. ఆమె చాలా బాగా వాయిస్తుంది. వీలైతే తప్పక విను" అని చెప్పారు. శ్రీదేవి, ఎలాగైనా ప్రయత్నం చేసి, ఆ కచ్చేరీకి వెళ్ళాలనుకుంది. ఆవాళ బుధవారం. మళ్ళీ మర్నాడు వస్తానని సుభద్రమ్మ చెప్పింది. ఆమె ఉన్నప్పుడే మెల్లిగా అమ్మమ్మ దగ్గిర కదపాలి అని నిశ్చయించుకుంది శ్రీదేవి.

కాని ఆమె ఆశించినట్లు ఆవాళ సుభద్రమ్మ రాలేదు. శ్రీదేవికి ఆరాటం హెచ్చయింది. ఆమె మనసులో ఏదైనా ఆలోచన పుడితే, వెంటనే అది ఇటో, అటో తేలిపోయేదాకా ఆమెకు తోచదు. కాలేజీలో జరిగే వీణ — కచ్చేరీకి ఎలాగైనా వెళ్ళితీరాలి. తను అనుకున్నట్లు సుభద్రమ్మ, అమ్మమ్మనడిగి ఒప్పించేవరకూ తను కచ్చేరీకి వెళ్ళడం అవుతుందా! అవదా? అని బెంగపడ నారంభించింది.

మూడోనాడు మధ్యాహ్నం సుభద్రమ్మ వచ్చింది కాని, ఆమె వచ్చిన పది నిముషాలలో దుర్గాప్రసాద్ కూడా హఠాత్తుగా వచ్చాడు. శ్రీదేవికి తండ్రి ఏం గొడవ చేస్తాడో అని భయం వేసింది.

ఆవాళ దుర్గాప్రసాద్, తండ్రిని, తన కత్యవసరంగా కావలసివచ్చి రెండు వేల రూపాయ లిమ్మన్నాడు. విశ్వేశ్వరరావుగారు అతనికి నెలా నెలా ఇచ్చే డబ్బుతప్ప, పైన ఒక దమ్మిడీ ఇవ్వదల్చుకో

40-వ పేజీ చూడండి



'వేట' అనగానే తుపాకులు, జాతి కుక్కలు ఉంటాయన్న సరదాతో మీరిది చదవటం మొదలెడితే దెబ్బ తినేస్తారు. తరువాత రాసిన శాల్తీని తిట్టనూ వచ్చు. అందుకనే ముందుగానే సవినయంగా మనవి చేస్తున్నాను ఇది ఆ బాపతు కాదని.

బస్సులో వేట :

కనబడిన వారిజెన్నల్లు నాలుగు, ఒక అరడజను తెలుగు శవాలు, మూడు ఇంగ్లీషు శవాలు కొనుక్కుని బస్సెక్కాడు ఒక సుబ్బారావు. వెళ్లబోయేది పల్లెటూరు—అక్కడ ఎంతగా రేడియో వంటి పదార్థం ఉన్నా, పొద్దుపోవడ మనేది చాలా కష్టసాధ్యమయిన పని. ఎన్నిసార్లు వాచి చూస్తున్నా ముళ్ళు పెద్దగా మారక, మన్ని హడలకొడతాయి. అది లోగడ అనుభవమయి ఉండటంవలన ఈసారి ముందుజాగ్రత్తగా నాలుగు రోజులకి సరిపడ్డ ఆహారాన్ని కొనేశాడు. బస్సెక్కి సీట్లో కూర్చున్నాక పక్కసీటు ఆసామీగారిని చూడగానే అసలు విషయం గుర్తుకొచ్చింది. భవిష్యత్తులోని నాలుగు రోజులని దృష్టిలో ఉంచుకొని వర్తమానాన్ని విస్మరించావు బ్రదర్ అంది ఆయనగారి చేతిలోని సిగరెట్టు!

ఇప్పటికే బస్సు ప్రయాణీకులతో నిండిపోయింది. కండక్టరు టిక్కట్లు 'కోస్తున్నాడు'. ఇక నాలస్యం చేస్తే బస్సు బయలుదేరడం, తను పిచ్చెక్కిపోయి తాపీగా వెంట్రుకలు పీకి పక్కన పోసుకోవడం జరుగుతుందని గ్రహించినవాడై గభాలున పుస్తకాలన్నీ సీటులో పడేసి, కిందికి దూకి, కిళ్లీకొట్టు దగ్గరకు పరుగెత్తాడు సుబ్బారావు. ఒక పెట్టె కొనుక్కుని, నోట్లో ఒకటి పెట్టుకుని, వక్కపొడి వేసుకుని, ఒక్క దమ్ము పీల్చి, చుట్టూ చూసే సరికి ఆ లోకం అంతా అతి అందంగా కనిపించింది. "ఒహో! ప్రకృతి కడు అందమయినదే పాపం" అని ఆశ్చర్యపడి బస్సెక్కాడు. కాళ్ళు తొక్కుకుంటూ, తలో 'సారీ' పంచుతూ, సీటు దగ్గరకు పోయేసరికి అందులో ఒక పరంధామయ్య గారు కూర్చుని చుట్ట తాగుతూ "ఏమిటి కథ ?" అన్నట్లు చూశారు సుబ్బారావు వంక.

"ఇది నా సీటు !" అన్నాడు సాధ్యమైనంత ధైర్యంగా సుబ్బారావు.

"ఏమిటి గుర్తు ?" సూటిగా ప్రశ్నించారాయన; డిటెక్టివ్ నవలల్లో ఆఖరిసీనులోలా.

"మీరు ఒక్కసారి నిలబడితే చూపించగలను !"

"ఏందయ్యా నీ గోల, పేరు గాని రాసుకు పోయావా ?" అంటూ నిలబడ్డా రాయన.

తెల్లబోయాడు సుబ్బారావు. అత నక్కడ పెట్టుకున్న నాలుగు రోజుల పుస్తకాలు కలికానికయినా లేవు.

"ఇక్కడ పుస్తకాలు పెట్టుకు వెళ్లాను ...." అంటూ నసిగాడు.

ఇటువంటివాళ్ళని చాలామందిని చూశాను లేవోయ్ అన్నట్టు పెళ్ళున నవ్వి "చూడు మిస్టరూ! పుస్తకాలు పెట్టుకు వెడతారా ఎక్కడన్నా—అవి పోగా, సీటు కూడా పోతుంది. చూడు, ఈ బస్సులో ఉన్న జనం చదివేది నీ పుస్తకాలే అనుకుంటా .... తరువాత వెళ్లి ఆ ముందు సీట్లో కూర్చో—కుర్రాడివి. నేను పెద్దవాణ్ణి. లేగలేను" అన్నాడు.

ఒక్కసారి చుట్టూ కలయచూశాడు సుబ్బారావు — బస్సు ఆ చివర నుంచి ఈ చివర వరకూ చాలామంది చదవడంలో నిమగ్నులయి ఉన్నారు ... అప్పుపుచ్చుకుని ఎగకొట్టేవాడి పోజులో. దృష్టి పుస్తకంమీంచి మరల్చడంలేదు వీళ్ళు. క్షణకాలం పరిశీలనలో సుబ్బారావు తేల్చుకున్న దేమిటంటే ఎక్కువమంది చేతుల్లోని తన పుస్తకాలేనని.

బస్సులో కూడా పనికొస్తాయి కదా అనే ఆశతో కొనుక్కుంటే చివరికి ఒక్కటికూడా దక్కకుండా పోయింది. నిష్కర్షగా అడిగి తెలుసుకోవచ్చును.—కాని అలా అడిగినప్పుడు తిరిగి ఇస్తూ వీళ్ళు చూసే చూపు తలుచుకుని ఒణికిపోయాడు సుబ్బారావు. అందుకే గోళ్ళు కొరుక్కుంటూ, ఎవ రెవరి దగ్గర ఏయే పుస్తకా లున్నాయో ఆకళింపు చేసుకోసాగాడు. అందులో కూడా అతనికి కొంత మనశ్శాంతి కలిగించిన విషయం ఏమిటంటే ఇద్దరు అందమయిన అమ్మాయిల చేతుల్లో కూడా తన పుస్తకా లుండటం ! "ఫరవాలేదు, సంఘసేవ కూడా పురుషార్థాన్ని కలిగిస్తుందిట" అని

సంతోషాన్ని తెచ్చుకున్నాడు.

ఖాళీగా దొరికిన శాల్తీని ఊరికే కూర్చో నీయడం సబబుగా కనబడలేదు పక్కసీటు పరంధామయ్యగారికి అందుకే సుబ్బారావుకి ప్రపంచ జ్ఞానం బోధించాలని నిశ్చయించుకున్నారు.

నెహ్రూ రాజనీతిజ్ఞతని గురించి వివరించారు. లుముంబా చావుకి కారణం వర్ణించి, అతన్ని గురించి జాలిపడాలి అన్నారు.

నీరయిపోయాడు సుబ్బారావు.

కాశ్మీరులో ఉన్ని తయారవుతోంది అన్నారాయన. అవునన్నాడు సుబ్బారావు. రాకెట్లు ఇండియాలో వేదకాలంలోనే ఉన్నట్లు ఆధారా లున్నాయి తెలుసా? అన్నా రాయన. తెలియదన్నాడు సుబ్బారావు.

ఆ రాకెట్లు ఈనాడే ఉంటే, చైనావాడిని నాశనం చేసేవాళ్లం ఈపాటికే అన్నారు.

ఆశ్చర్యపడి లేచాడు సుబ్బారావు — తను దిగవలసిన స్టాపింగ్ దగ్గర పడుతోందని గ్రహించినవాడై.

చాలా రోజులుగా దొరికిన ఒక్కడూ ఇలా తప్పించుకుపోవటం ఆయన కేమీ నచ్చినట్లు లేదు. "కూర్చోండి, ఇంకా చాలా దూరముంది .... ఇండియాలో ఆస్ట్రేలియా కూడా ఒకప్పుడు భాగమే తెలుసా ?" అన్నాడు. త నా విషయంపై ఒక పుస్తకం రాసి రుజువు చేయదల్చుకున్నాననీ కూడా ప్రకటించాడు.

ఇక సుబ్బారావు వినిపించుకో దలుచుకోలేదు. ఒక్కొక్కరి దగ్గరకు వెళ్లి పుస్తకాలు సేకరించుకునే ప్రయత్నంలో ఉన్నాడు.

"మాస్టారూ, దిగాలి నే నిక్కడ—పుస్తకం ఇస్తారా ?"

"ఇది మీదా ?" అని ప్రశ్నించి 'ఏమో, నాకయితే అనుమానంగానే ఉంది' అన్నట్లు మొహంపెట్టి, అయినా జాలితలచి ఇచ్చేస్తున్నట్లుగా నవ్వి, ఇస్తున్నారు ఒక్కొక్కరు.

"మాస్టారూ, మీ పే రేమిటో—ముర్రే జాతి ఆవుల్ని ఒక పాతిక తోలుకొచ్చి మీ ఊళ్లో పెడుతున్నాను. మీరు కొనండి" అని అరిచారు పరంధామయ్యగారు.

దిగవలసినచోటు వచ్చేసి బస్సు ఆగింది. కాని ఇంకా ఒకమ్మాయి చేతిలోని పుస్తకం చేరలేదు సుబ్బారావుకి. కొంచెం హుషారు పుంజుకుని దగ్గరకెళ్లి "ఏమండీ! పుస్తకం ఇస్తారా?" అన్నాడు.

పుస్తకం చదువుతున్న అమ్మడు హడలిపోయి తలెత్తి వెనక సీట్లో కూర్చున్న ఆయన్ని "చూడండి ఏమిటీ అబ్బాయి ?" అన్నట్లు చూసింది.

ఆయనగారు విశాలంగా నవ్వి "ఆయనదేట్; ఇచ్చేయి" అన్నాడు.

ఆవిడ కొంచెం నిరుత్సాహ పడినట్లుంది. "అయితే ఒక్క క్షణం, హంతకుడు ఎవరో ...." అంటూనే మళ్లీ లైన్లమీద అటూ ఇటూ తిప్ప సాగింది కళ్లు.

"మాస్టారూ! ఇదేమయినా ఎద్దుబండి 'అనుకున్నారా ?—దిగేదాకా ఆగేందుకు ?" హెచ్చరించాడు కండక్టరు.

సుబ్బారావు కాసేపు తటపటాయించి "పుస్తకం ఇస్తే, దిగాలండి !" అన్నాడు.

"ప్లీజ్ ఒక్క క్షణం...."

"మాస్టారు దిగరు కాబోల్సే; రైట్!..." అరిచాడు కండక్టరు.


చివరిసారిగా అమ్మడివంక చూశాడు సుబ్బారావు. పుస్తకంమీద ఆశ వదులుకున్నాడు. గబగబ దిగసాగాడు.

"నేను ఆస్ట్రేలియా గురించి రాసే పుస్తకం మీకు పంపిస్తాను. అడ్రసు ఇవ్వండి" అని అడ్డుకున్నారు పరంధామయ్యగారు.

అప్పిచ్చినవాడిని తప్పించుకొనే ఒడుపుతో ఒక్క ఊపున కిందికి దూకాడు సుబ్బారావు. అతను దిగిందే తడవుగా బస్సు కదిలింది.

ఆఖరుసారిగా బస్సులోని పుస్తకం పుచ్చుకున్న

35-పేజీ చూడండి



వారఫలాలు

దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

గ్రహస్థితి

కర్కాటకంలో కుజ, రాహువులు; వృశ్చికంలో శుక్రుడు; ధనుర్మకరాలలో సూర్యుడు; మకరంలో బుధ, శని, కేతువులు; కుంభంలో గురువు; కర్కాటక, సింహ, కన్య, తులలలో చంద్రుడు.

11-1-1963 శుక్రవారము మొదలు 17-1-1963 గురువారము వరకు

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

ప్రస్తుతం గ్రహబలం బాగున్నది. ముఖ్యంగా ఆదాయం పెరుగుతుంది. మీకు తెలియకుండా ఇతరులకు సహాయం మీవద్దనుంచీ లభిస్తుంది. వృత్తిలో మీ అభివృద్ధిని గురించి స్నేహితులు ఉత్సాహంతో సహాయం చేస్తారు. సంఘంలో పలుకుబడి పెరగగల అవకాశాలున్నవి. కుటుంబ విషయాలలో గాని, వ్యవహార రంగంలో గాని చేతి నిండుగా పని తగిలే సమయం. సంఘ కార్యాలలో సమర్థతతో మెలగగలుగుతారు. శుభ సంతోష కార్యాలు ప్రశాంతంగా పూర్తి చేయగలుగుతారు. బంధువుల తాకిడి అధికంగా ఉంటుంది. ముందు ఆందోళన కనిపించినా, అవసరానికి ధనం వస్తూ ఉంటుంది. 11, 12 తేదులలో కలహాలు, చికాకు కలిగే వార్తలు, పనులలో శ్రమ.

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా., రోహిణి, మృగశిర 1, 2 పా.)

ఏ ఎండకు ఆ గొడుగు అనే పద్ధతిలో పనులు సాగించవలసి ఉంటుంది. చాలావరకు ఖర్చుల భారం తగ్గించుకో గలుగుతారు. నౌకరులు మొదలయిన వారితో పేచీలు రాగలవు. వృత్తిలో ఇంతకు ముందు జరిగిన పొరపాట్లు ఈ సమయంలో మిమ్ములను చిక్కు పెట్టగల అవకాశాలున్నవి. కుటుంబంలో ఖర్చులు అధికమవుతవి. విద్యాభివృద్ధి మార్గాలలో ప్రోత్సాహం లభిస్తుంది. వృత్తిలో ఎంత నిగ్రహం చూపగలిగితే ముందు ముందు అంత లాభం పొందగలుగుతారు. బాహ్య ఆడంబరంవల్ల గౌరవం పెరిగినట్లు కనుపించవచ్చు. కాని, మనశ్శాంతిమాత్రం ఉండదు. పిల్లల ఆరోగ్యం సరిగా ఉండదు. వారాంతంలో ప్రయాణాలు తగిలే అవకాశాలున్నవి. ప్రస్తుతం వ్యవహారాలలో రాజీ మార్గం అనుసరించటం మంచిది.

మిథునం :

(మృగశిర 3, 4 పా., ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

గ్రహస్థితి అంత సుముఖంగా కనుపించదు. అకస్మాత్తుగా పైన పడే ఖర్చులను భరించలేక పోతారు. చిన్న చిన్న విషయాలలోనే ఆత్మీయులతో కలవలేకపోతూ ఉంటారు. ఈ సమయంలో ఆరంభించిన పనులు చిక్కులను ఎదుర్కొంటూ సాగించవలసి ఉంటుంది. పదిమందిలో పేరు ప్రతిష్ఠలు బాగుంటవి. కాని, మనస్సులో ఉత్సాహం మాత్రం తగ్గుతుంది. ప్రయాణాలు చేస్తారు. విలువగల వస్తువులు కొంటారు. వారం రెండవ భాగంలో వృత్తిలో అనుకూల లక్షణాలు గోచరిస్తవి. ఎదురు చూస్తున్న వార్తలు అందుతవి. వినోద కార్యక్రమాలతో కాలం జరుగుతుంది. ఎవరితో ప్రసంగించినా, చాలా మితంగా ఉండటం మంచిది. పరిస్థితులనుబట్టి, పద్ధతులను మార్చుకొనవలసివస్తుంది. 15, 16 తేదులలో ధన లాభం, ఇష్ట వస్తులాభం.

కర్కాటకం :

(పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష.)

మీ ఆర్థికస్థితి బాగుంటుంది. మరొకరికి బాధ కలుగకుండా మీ వ్యాపార వ్యవహారాలను చక్కపరచుకొనగలుగుతారు. ఇతరుల కార్యభారం పైన వేసుకొనతగిన సమయంకాదు. దైవ కార్యాల నిమిత్తం శ్రమ, వ్యయము కూడా ఉంటవి. మీరు చాలా కాలంనుంచి చేసిన శ్రమకు ఫలితం చేతికి అందుతుంది. అయితే సంతృప్తికరంగా ఉండదు. సాధారణంగా మీ అంచనాలకు, ప్రస్తుతం జరిగే పనులకు పోలిక కనుపించదు. కాని, మీ శక్తిని మించి పోతుందనే బాధ కలుగదు. వస్త్రాలు, విలాస వస్తువులు మొదలయినవి కొంటారు. కొన్ని సందర్భాలలో మీమీద ఆధారపడేవారుంటారు. తరచు మీ ఆరోగ్యాన్ని గురించి జాగ్రత్త పడుతూ ఉండవలసిన సమయం. దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. 16, 17 తేదులలో గౌరవ లాభం, శ్రమ.

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

ఈ వారం మీరు సందిగ్ధావస్థలోనే మీ వృత్తి కార్యక్రమాలను సాగించవలసి ఉంటుంది. ముందు జరుగబోయే మంచి చెడ్డలను గురించి యోచించటానికి అవకాశం ఉండదు. ఇతరులవద్దనుంచి రావలసిన ధనం క్రమక్రమంగా వస్తుంది. దొంగతనంగా వస్తువులు పోవటం కాని, అంచనా తెలియని పనులలో అకస్మాత్తుగా నష్టపడటం కాని జరిగే అవకాశాలున్నవి. విందులు, వినోదాలు మొదలయిన కార్యక్రమాలలో పాల్గొంటారు. రోజు రోజుకు కార్యభారం పెరుగుతూ ఉంటుంది. మీ మాట, పనులు ఎదుటివారి దృష్టిలో విపరీతార్థమును కలుగచేయవచ్చు. సంఘ కార్యాలనుండి తొలగి ఉండతగిన సమయం. 14, 15 తేదులలో ధన వ్యయం, సంతోష వార్తలు.

కన్య :

(ఉత్తర 2,3,4 పా., హస్త, చిత్త 1, 2 పా.)

ఏ సందర్భంలోను ప్రత్యేకంగా చిక్కులు ఏమీ ఉండవు. మీ నిత్య కృత్యాలలో మార్పులు ఏమీ ఉండవు. మనశ్శాంతి లభిస్తుంది. కుటుంబంలో ఉత్సాహం లభిస్తుంది. ధన సంబంధమైన సమస్యలు ఒక దారికి వస్తవి. పరస్పర సహకారంతో సౌమ్యంగా పనులు జరుపుకొనతగిన మిత్రులు లభిస్తారు. తగినంత ఆదాయం వస్తూ, ఖర్చు అవుతూ ఉంటుంది. సంఘంలో కూడా పదిమందియొక్క మంచి అభిప్రాయము లభిస్తుంది. అకస్మాత్తుగా కుటుంబంలో ఎవరికో ఒకరికి దేహబాధలు ఏర్పడగలవు. క్రొత్తగా ఏ పని చేదామనుకున్నా త్వరగా కలిసి రాకపోవచ్చు. ఇతరుల మాటలను నమ్ముకుని అత్యాశలకు పోవద్దు. 12, 13 తేదులలో వ్యవహార పరిష్కారాలు, స్వల్ప ఆదాయము.

ఈ వారము ధరలు

బంగారు ధర 13, 14 తేదులలో మందీ రావచ్చు. వెండి ధర 11, 12 తేదులలో పెరిగి, తరువాత మందీ వస్తుంది. నూలు, నూలు వస్త్రాల ధరలలో మందీ లక్షణం ఆరంభమవుతుంది. వేరుసెనగపప్పుధర పెరిగే అవకాశాలున్నవి. అయినా వారాంతంలో తగ్గుతుందని తోస్తుంది. నూవుల ధర పెద్ద మార్పు ఉండదు. మిర్చి ధర వారం మొదటి భాగంలో గిరాకి, రెండవ భాగంలో తగ్గు సూచన.

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ, 1, 2, 3 పాదాలు)

ఎదటివారి మనస్తత్వాన్ని తెలుసుకొనగలుగుతారు. కుటుంబంలో సుఖము, సంతోషము లభిస్తవి. వృత్తి కార్యక్రమాలను బుద్ధిబలంతో నెరవేర్చుకుంటారు. అధికారులతో స్పర్ధలు రాగల అవకాశాలున్నవి. ఇతరులవద్దనుంచీ ధనం రావలసిన సందర్భాలలో పేచీలు వస్తూ ఉంటవి. మీ ఆరోగ్యం తాత్కాలికంగా లోపిస్తుంది. ముఖ్యంగా ఇతరుల వ్యవహారాలలో మధ్యవర్తిత్వంవంటి బాధ్యతలు ఈ సమయంలో మంచివికావు. మీ మాటను వ్యతిరేకించినవారు తమ లోపాన్ని గ్రహించుకొంటారు. పదిమందిలో గౌరవార్థం చేయు పనులలో ఇబ్బందులు పెరుగుతవి. జరిగిపోయిన వాటిని గురించిన ఆందోళన అధికమవుతుంది. 11, 12 తేదులలో అపవాదులు, శ్రమ.

వృశ్చికం :

(విశాఖ 4-వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ.)

భారం తగ్గించుకుందామనుకునే సమయం. వృత్తిలో అధికారంతోపాటు కార్యబాధ్యత, పైవారికి జవాబు చెప్పవలసిన అవసరం ఏర్పడుతవి. కుటుంబంలో సుఖ సంతోషాలు లభిస్తవి. మీ సహాయం మీద ఆధారపడేవారు ఉంటారు. ఈ సమయంలో ప్రత్యేకంగా అనారోగ్యం చేయదు. కాని, అప్పుడప్పుడు కారణం తెలియని అస్వస్థత కన్నపిస్తూ ఉంటుంది. క్రొత్త వ్యవహారాలను గురించి ఆలోచనలు ఆరంభమవుతవి. ఇతరులమీద ఆధారపడటం అనే సమస్య తొలగిపోతుంది. స్థిరాస్తులవలన సంతృప్తికరంగా ఫలితం పొందగల సమయం. సభా గౌరవం లభిస్తుంది. 14, 15 తేదులలో వినోద కాలక్షేపాలు, అధికారులతో మైత్రి.

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

దైవికంగా కలిసివచ్చేవరకు తొందరపడతగిన సమయంకాదు. వ్రాత, గణితము మొదలయిన పను

లో పొరపొట్లు వస్తూ ఉంటవి. చేతిలోని ద్రవ్యం అయిపోయిన పిమ్మట అవసరాలు పెరుగుతవి. అనుకోకుండా బంధుమిత్రులను గురించిన విచార వార్తలు తెలుస్తవి. స్వంత వృత్తి, ఉద్యోగాలలో ఏ మార్గంలోపోతే ఏమి చిక్కు వస్తుందోననే సందిగ్ధావస్థ ఏర్పడుతుంది. కుటుంబ పరిస్థితులు కొంతవరకు ప్రశాంతంగా ఉంటవి. ప్రయాణాలు చేయవలసి వస్తుంది. చేతిలోని నీరు వదులుకుని వర్షంకోసం ఎదురు చూచినట్లుగా ఉంటుంది. వారాంతంలో వృత్తిలో అనుకూలత, ధనలాభము ఉంటవి. రాజీ పద్ధతిలో వ్యవహార పరిష్కారాలు చేసుకోగలుగుతారు.

* * *

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)

మనస్సు నిలవక ఏదో ఒక ప్రయత్నం చేస్తూ ఉంటారు. కాని, సులభంగా బయటపడే అవకాశాలు తక్కువ. లాభవార్తలు మాత్రం తెలుస్తూ ఉంటవి. కుటుంబంలోనివారి అనారోగ్యాలవల్ల అశాంతి, ధన వ్యయము పెరుగుతవి. ఇంతకుముందు మీ బాధ్యత తీరిపోయిందనుకున్న పనులలో తిరిగి కొంత శ్రమ పడవలసివస్తుంది. దూరపు ప్రయాణాలవల్ల కార్యానుకూలత , ధనలాభము ఉంటవి. ఒకరికి వాగ్దానం చేయటం కాని, సలహా చెప్పటం కాని ఈ తరుణంలో మీకు ఎదురు తిరుగుతవి. కుటుంబంలో ఖర్చులు పెరుగుతున్నట్లు కనుపిస్తుంది. ఎదుటివారి మాటలలోని అంతర్యం గ్రహించుకొని ముందు జాగ్రత్తపడగలుగుతారు. ఆదాయం మందంగా కనుపిస్తుంది.

* * *

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

ఈ వారం మీ వృత్తిలో ప్రత్యేకమైన అనుకూల లక్షణం కనుపించగలదు. రకరకాల మనుష్యుల పరిచయం లభిస్తుంది. మీ ఆలోచనలకు తోడు, మంచి సలహా లభిస్తుంది. రావలసిన ధనం చేతికి వస్తుంది. అనుకోకుండా వ్యవహారాలనుంచి బయటపడగలుగుతారు. దుబారా ఖర్చులను సంతోషంతో భరించగల అవకాశాలు వస్తవి. సంఘంలో కొంత ప్రతికూల వాతావరణాన్ని కల్పించగలవారు ఉంటారు. దైవానుగ్రహంవల్ల ఆ ఫలితం మీమీద కనుపించదు. మీ ఆరోగ్యం బాగుంటుంది. **ఉత్తర దిశనుంచి సంతోషవార్తలు తెలుస్తవి. ఇతరులపై** అధికారం చెలాయించకుండా మంచితనంతో పను జరుపుకోవటం అవసరం. 13, 14 తేదీలు విందులు, శుభవార్తలు.

* * *

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)

మీ సుఖానికి, శాంతికి కావలసిన పరిస్థితులు కల్పించుకొనే బాధ్యత మీ పైన పడుతుంది. మీ చేసే ప్రతి పని ముందు ముందు ఎదురు తిరగ కుండా దూరదృష్టితో చేయటం అవసరం. తాత్కాలికంగా వృత్తి, ధనాదాయము బాగుంటవి. అనుకోకుండా క్రొత్తవారి పరిచయం లభిస్తుంది. వృత్తిలో అభివృద్ధి మార్గాలను గురించిన ఆలోచనలు వస్తవి. ఆదాయం పెరిగినకొలదీ ఖర్చుకు మార్గం కనిపిస్తూ ఉంటుంది. పాత స్నేహితులతో తలవని తలపుగా పేచీలు రావచ్చు. ఇంతకుముందు ఏ విషయాలపైన ఎక్కువ ఆసక్తి చూపుతున్నారో, వాటి వల్ల అంత ఉపయోగం లేదనే భావం తోస్తుంది. బంధువర్గంలో చికాకు కలుగుతుంది. 15, 16, 17 తేదులలో ప్రయాణ సూచనలు, శుభవార్తలు, ధన లాభం.

వేట

32-వ పేజీ తరువాయి

అమ్మాయివంక చూద్దామని ప్రయత్నిస్తుంటే ఒకానొక శాల్తీ వచ్చి అతని ముఖంమీద తగిలి కింద పడింది. దాని వెనకనే "థాంక్సండి" అనే మాటలు మల్లెపూల మధ్యగా వచ్చి, కోపం పోగొట్టేశాయి.

పుస్తకాన్ని ఆప్యాయంగా తీసి దుమ్ము దులిపి ఆ అమ్మాయిని అంతగా ఆకట్టినది ఏమిటా అని ఆఖరి పేజీ తీశాడు. అందరూ టేబుల్‌చుట్టూ కూర్చున్నప్పుడు డిటెక్టివ్ మోహన్ లేచి "హంతకుడు మనలోనే ఉండి ఇన్నాళ్ళుగా మన కళ్ళు కప్పాడు. ఇక అతని ఆటలు సాగవు. ఇప్పుడు ఇక్కడే ఈ గదిలోనే కూర్చుని ఉన్నాడు ...."

"పూర్తిచేయకుండా లాక్కునిఉంటే ఈ రోజు ఆవిడ నిద్రపోయేదికాదు—ఆయన్ని పోనిచ్చేది కాదు" అని నవ్వుకున్నాడు సుబ్బారావు.

* * *

మట్టి—రోడ్డుమీద నడుస్తున్నాడు సుబ్బారావు.

అతనికి మాగజైన్లు కొనడమూ అలవాటే, ఇలా ఇబ్బందులు పడటమూ పరిపాటే ! అందుకనే అతనికి గతంలోని ఒక సంఘటన, ఈమధ్యనే ప్రారంభమై ప్రస్తుతం క్లయిమాక్సుకి వచ్చిన మరొకటి గుర్తురావడంలో ఆశ్చర్యంలేదు.

ఇళ్ళదగ్గర సీటు :

సుబ్బారావు—వాళ్ళింటిప్రక్కన ఒకానొక అప్పారావుగా రున్నారు. ఉద్యోగం షుమారుదే అయినా ఒక ముప్ఫయి ఎకరాల—వాడికి ఉండవలసినంత పై రాబడి ఉంది. మంచి మాగాణి భూమిలాంటి రాబడికల పని మరి. కాని ఆయనకి తన సీటుని ఎలా సేద్యం చేయాలా, పంట ఎప్పటి కాయేడు ఎలా పెంచాలా అనే ధ్యాస తప్ప మరోహాటి తల కెక్కేది కాదు. అది అంతటితో పోతే, సుబ్బారావుకి అప్పారావుగారి ఉనికి పట్టేదికాదు. కాని అప్పారావుగారి భార్య అంటే అప్పారావుగారికి అమితమయిన ప్రేమ. ఎవరి భార్యమీద ఎవరికి మాత్రం ప్రేమ ఉండదూ ? అని సూటిగా ప్రశ్న వేయచ్చు. కాదనను. తప్పక ఉంటుంది. అయితే అప్పారావుగారిది మోతాదు మించిన ప్రేమ. ఆవిడ కోరినది కాదనడు.

ఆవిడగారికి వారపత్రికలంటే అమితమయిన ప్రేమ—నల్లులకి రక్తం అంటే ఉన్నంత ప్రేమన్న మాట ! లేనిదానికోసం దమ్మిడీ ఖర్చుపెట్టకుంటే ఆవిడగారి కోర్కె తీర్చాలని అప్పారావుగారి తాపత్రయం. ఎందుకంటే ఆయన దృష్టిలో ఏ వస్తువయినా కొంటే, అది ఇంటిల్లిపాదికీ ఉపయోగపడాలి. అందుకే ఆయన సిగరెట్లు కొనడు; పార్టీలిస్తే తాగుతాడు.

ఆయనకి మాగజైన్లు పట్టవు. అందుకే సుబ్బారావుని పట్టాడు.

"ఇవ్వాళ పత్రిక వస్తుంది కదండీ? ఆఁ" .... "సీరియల్ ఏముందో ?" అనేది అప్పారావుగారి భార్య—లాంగ్‌షాట్‌లో సుబ్బారావుని పత్రికతో చూసి—భర్త నుద్దేశించి.

ఆయన కూడా సుబ్బారావుని వరండాలోకి రానిచ్చి, "ఎందుకు, మన సుబ్బారావు దగ్గరుంది కదూ—ఒక్కసారి అడిగి చదివిస్తే పోలా ! ఏమంటావు సుబ్బారావు ?" అనేవాడు.

సుబ్బారావు బిక్కచచ్చిపోయి "మరే, పోతుందండీ" అందామనుకుని, ఒక ఆవిడ అడిగితే లేదనడమా, అని "చదివి ఇవ్వమనండి" అని ఇచ్చేసి లోపలికి వెళ్ళి భోరున ఏడ్చేవాడు.

రెండోరోజున అతని చేతికి వచ్చేది పత్రిక—నలిగిపోయి.

అప్పున్నవాళ్ళకి కాబూలీవాలాని చూస్తే ఎంత భయమో సుబ్బారావుకి అప్పారావుగార్ని చూస్తే అంత భయం. సైకిల్ లైసెన్సుని తప్పించుకునేందుకు సందులెమ్మట తిరిగినట్లు ఒక్కోసారి దొడ్డిగుమ్మం గుండా వచ్చేందుకు ప్రయత్నించేవాడు. ఆ సంగతి ముందుగానే ఊహించిన శ్రీమాన్ అప్పారావు అది కాస్తా గడియవేసేవారు.

ఇలా హోరాహోరీగా సాగిపోతుంటే ఒకనాడు సుబ్బారావుకి ఒక 'బ్రిలియంట్ అయిడియా' వచ్చింది.....

పాత పత్రికల్లో తనకి దారుణంగా నచ్చిన కథలు—నవ్వొచ్చేవి, భోరున ఏడ్పించేవి, రొమాన్సువి—మచ్చుకొకటి చొప్పున ఏరాడు. ఒక పెట్టె సిగరెట్లు కొన్నాడు.

ఆదివారం రానిచ్చి, అప్పారావుగార్ని పట్టుకున్నాడు. అప్పుడే ఆయన కంట్రాక్టరు పంపించిన చక్కెరకేళి గెలని భార్యతో పంచుకుని బయట కొచ్చాడు.

"చూడండి సార్! ఈ మధ్య రోజుల్లో మనవాళ్ళల్లో పేపరు చదువుతున్నవాళ్ళు తెగ పెరిగిపోతున్నారు. అందువలననే రానురాను వాటి అమ్మకం పెరిగిపోతోంది. అదే విధంగా ఈ వారపత్రికలు కూడాను. మనవి ఆలిండియా స్థాయిలో పోటీ చేస్తున్నాయట ! దీనికి కారణం ఏమంటారు ?"

పడక కుర్చీలో పడుకుని తాపీగా వింటున్న అప్పారావుగారు "పనిలేనివాళ్ళు ఎక్కువయ్యారన్నమాట మనలో" అన్నారు.

సుబ్బారావు గతుకుమన్నాడు. 'బిగినింగ్' బాగుండ

వేట

లేదు కాబోలు అని భయపడ్డాడు. గభాలున జేబు లోంచి సిగరెట్టుపెట్టె తీసి 'ఉపకోండి, మావా లోకడు టుబాకో కంపెనీ ....''

మాట పూర్తికాకుండానే దాన్ని ఆయన స్వాధీన పరచుకున్నారు.. ఒకటి అంటించి పొగ వదిలి "చెప్పావుకాదు ఇన్నాళ్ళా .... ఆఁ! ఏమిటంటు న్నావు? పత్రికల విషయం కదూ—'' అన్నాడు.

"మరేనండి. వీటిలో కథలూ, రాజకీయాలు, సినిమాలు, వనితాలోకం అన్నీ ఉండి, అన్నిరకాల పాఠకుల్నీ ఆకట్టుకుండటున్నాయండి. చక్కని బొమ్మలు వేస్తున్నారు. అందుకే రాను రాను అమ్మకం పెరిగిపోతోంది. కథలు కూడా చాలా మంచివి ఉంటాయండి. మనవాళ్ళ ఏ ప్రాంతం వాళ్ళకి తీసిపోరంటే నమ్మండి. ఇంగ్లీషు మాగ జైన్లలో తెలుగు కథలు అనువాదంచేసి వేసు కుంటున్నారు తెలుసా ?''



"తెలియదు'' అన్నారు అప్పారావుగారు.

"ఉదాహరణకి మీకు అందు మూడు కథలు వినిపిస్తాను చూడండి ......''

రెండు విన్నాక అప్పారావుగారు లేచి కూర్చుంటూ "మనవాళ్ళు కూడా బాగానే రాస్తారోయ్ పాపం! ఏదీ, అవన్నీ ఇలా ఇవ్వు.'' అని పుచ్చుకున్నారు. సాయంత్రందాకా చదువుతూనే ఉన్నాడు.

సుబ్బారావు ఆనందానికి అవధులు లేవు. పక్కింటి అమ్మాయి తన చూపును తిర్పేసి, పైన చిరు నవ్వు కూడా నవ్వినంత ఆనందపడిపోయి నేరుగా సినిమాహాల్లో కెళ్ళాడు. అప్పారావుగారికి కూడా మాగజైన్లమీద ఉత్సాహం కలిగించ గలిగాడు తను. ఇప్పుడు వాళ్ళ ఇంట్లో ఒక పత్రిక కొంటే ఇద్దరు చదువుతారు కాబట్టి ఆయన తప్పకుండా కొంటాడు. తను తనదయినదాన్ని హాయిగా చదువుకోవచ్చు.

మరుసటి ఆదివారం పత్రిక కొనుక్కుని తీవిగా లోపలికి నడిచి వచ్చాడు సుబ్బారావు. అప్పారావుగారు వరండాలో నిలబడి ఉన్నారు.

"పత్రికలు వచ్చేశాయండి'' అన్నాడు నవ్వుతూ సుబ్బారావు — ఆమాట వినగానే సైకిలేసుకుని బజారు పరుగెడతాడన్న ధైర్యంతో నమ్మకంతో !

"అవునోయ్, అందుకోసమే — నువ్వొస్తావని ఎదురుచూస్తున్నాను. కొత్తగా ఆ సీరియల్ ఒకటి చదివించావా నా చేత —చస్తున్నా ననుకో సస్పెన్సుతో! ఏదీ, పత్రిక ఇలాగివ్వు'' అంటూ బిగుసుకుపోయిన సుబ్బారావు చేతిలోంచి — జేబులోంచి డబ్బులు తీసే ఒడుపుతో — పత్రిక లాక్కుని ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

ఇదివరకట్లో ఆవిడ ఒక్కతే అయినప్పుడు ఒక్కరోజులో చదివి ఇచ్చేసేది పాపం. ఇప్పుడు మూడోరోజుకి గాని జేరడంలేదు సుబ్బారావుకి పత్రిక!

కాని ఈ పత్రికలు ఇచ్చి పుచ్చుకోవటాల్లో కేవలం అన్నీ ఇటువంటి సంఘటనలే కాదు. చాలా మధుర మయిన అవకాశాలు కల్పించేవి కూడా ఉంటాయి. పూర్వకాలం నలుడు దమయంతిని ప్రేమించే రోజుల్లో పత్రికలు లేకపోవడం వలనవే హంస కాళ్ళ పట్టుకున్నారు. ఇది సుబ్బారావు అభిప్రాయం. అందుకు కారణం కూడా ఉంది.

వేటవలన లాభములు లేక కథాప్రారంభం :

సుబ్బారావు బామ్మగారితోబాటు బస్తీలో ఉండి దీపాలార్పి చదువు వెలిగిస్తున్నాడు సదరు ఇంటి కాంపౌండులో సుబ్బలక్ష్మి అనే అందమయిన అమ్మడు కనబడటమే సుబ్బారావు ఆ ఇంటిలోకి మకాం మార్చటానికి కారణం అంటారు కొందరు. ప్రాణస్నేహితుల దగ్గర లోపాయికారిగా ఈ నిజాన్ని ఒప్పుకున్నా, బయటికి మాత్రం అది కాదు కారణం—'తమరి ముఖం' అంటాడు.

ఏది ఏమైనప్పటికీ, బంతిపూల రథంలాంటి సుబ్బ లక్ష్మి వీరి ఇంటి పక్క వాటాలో ఉండటం మాత్రం నిజం. ఆ అమ్మాయి సుబ్బారావు దగ్గర నుంచి వారపత్రికలు అప్పుచ్చుకుంటుందన్నది సత్యం. ఆ అమ్మాయి సుబ్బారావు కంటికి చాలా బావుం టుందన్నమాట నగ్నసత్యం. కాని ఆ అమ్మడిని సుబ్బారావు ప్రేమిస్తున్నా డన్నది ఇంకా నగ్నంకాని సత్యం.

అసలు అప్పారావుగారికి పత్రిక స్వాధీనపరచే ప్పుడు సుబ్బారావు ప్రాణం గిలగిల — ఉన్న ఒక్క రూపాయి అప్పిచ్చినవాడు తన్నుకుపోతున్నంతగా, ఊళ్ళో అమ్మాయిలకి వేరే కాలేజీ పెట్టేస్తున్నా

రని విన్న కాలేజీ కుర్రాడిలా — తన్నుకోవటానికి కారణం సుబ్బలక్ష్మి.

గేటులోంచి వస్తున్న తన చేతిలోని వారపత్రిక కని (గేటులోంచి తను వస్తున్నాడు కాబట్టి తనతో పాటు తన చేయి కూడా వస్తుందని మనవి) "ఇంతలు కన్నులుండ" అన్నట్లు చూస్తున్న ఆడపిల్లకి ఆ పుస్తకం కాస్త ఇచ్చేసి "ధన్యుడిని దేవి" అనాలని ఎవరికుండదు చెప్పండి ?

కాని అప్పారావు అనే స్థానిక విలన్ ఈ సదవకాశాన్ని సుబ్బారావుకి కలగనీయకుండా అడ్డుకుంటున్నాడు.

సుబ్బారావు—బాధ గ్రహించిన సుబ్బలక్ష్మి కూడా ఒక్కరోజు ఆగి, చెల్లెల్ని పంపుతుంది. "మా అక్కయ్య వారపత్రిక కావాలందండీ" అంటుంది పిల్ల. "పుస్తకం ఏం ఖర్మ! కావాలంటే నన్నూ పట్టుకుపో" అని విట్టేస్తాడు సుబ్బారావు. మొదటి సారి నవ్వింది కాని తరువాత నవ్వకుంది ఆ పిల్ల.

కాని గోడకి ఆనుకుని నిలబడి ఈ మాటలు విన్న సుబ్బలక్ష్మి మాత్రం నవ్వుకోలేదు. ఆలోచనలని రేకెత్తించే 'హెవీ డైలాగు'లా తోచాయి ఆపిల్లకి ఈ మాటలు. అందుకే కొంచెం తీవ్రంగానే ఆలోచించసాగింది సుబ్బారావుని గురించి.

ఒక్కోసారి సుబ్బలక్ష్మి స్వయంగా తిరిగి ఇచ్చేది పుస్తకం. ఇస్తుంటే అడిగేవాడు సుబ్బారావు, ఫలానా కథని గురించి మీ అభిప్రాయం ఏమిటండీ ? అనో, లేక ఆయొక్క సీరియల్‌లో ఇలా వాళ్లిద్దరూ ఇంట్లోవాళ్లకి చెప్పకుండా లేచిపోవడం (క్షమించాలి, వెలితే లేచిపోవడం అనరుగా) బాగుంది కదండీ అనో !

ఇద్దరూ చాలాసేపు చర్చించుకునేవారు. అభిమాన రచయితల్ని పరస్పరం మార్చుకునేవారు. ఝుర్ఝూమారుతంగా సాగిపోతుండేవి వాళ్ల సమావేశాలు. సాధారణంగా అవి కనుచీకటి పడుతున్న టైములో సుబ్బారావు స్నానానికి ఉపక్రమిస్తున్నప్పుడు ఏర్పాటయ్యేవి. ఆ వేళప్పుడు ఇళ్లల్లోని ముసలి జనాభా అంతా దేశంమీద పడేవారు పురాణాలకని !

సుబ్బారావు ధైర్యం చేయదల్చుకున్నాడు. ఆ విషయమే ఒకానొక చెలికాని చెవిన వేసి "అదీ సంగతి" అన్నాడు.

వాడు కొంచెం ఆశ్చర్యపడుట నభినయించి "ఏమంత బాగుంటుందిరా ఆ అమ్మాయి ? ఆట్టే ఉన్నవాళ్లూ కూడా కాదు. పైగా నీకు మీ అత్తయ్యగారి అమ్మాయి నిస్తారుటగా" అన్నాడు మందలింపు ధోరణిలో.

సుబ్బారావుకి అతని మొదటి మాటకి ప్రాణం చివుక్కుమంది. ఇంకా అంటూనే ఉండటంతో "మనిషికి కాస్త ఈస్తటిక్ సెన్సుండాలి" అని సమాధానపరిచాడు. రెండవదానికి మాత్రం ఘాటుగా సమాధానం చెప్పదలుచుకున్నాడు వెంటనే ఫెళ్లున నవ్వుతూ "పెద్ద విట్టు విన్నాను గురూ! ఇవ్వాళ. ఎవళ్లు చెప్పారు మా అత్తయ్య కూతుర్ని. విషయం పై నలుగురిలో "అది నా కూతురు" అని మా అత్తయ్యే చెప్పుకోదు తెలుసా ?" అని మళ్లీ నవ్వి, అంతలో విచారం ముఖాన పులుముకుని "పాపం, ముఖం బాగానే ఉంటుంది కాని గురూ! చాలా బలహీనమయిన మనిషి. అంతా కలిపి ఈ కాఫీ కప్పులో పట్టేస్తుందనుకో – అల్లా ఉద్దీన్‌లో రాకసుడిలా !" మళ్లీ నవ్వుదామనుకున్నాడు కాని, తను చెప్పినది అతిశయోక్తి అని తెలిసి ఉండటంవలన ఆ ప్రయత్నం విరమించాడు.

ఝుమ్మంటూ పాత పత్రికలు ముందేసుకుని అందులో ప్రేమలేఖలు గల కథలు వెతికి తీసి, వాటి అడుగుజాడల్లో ఒక బ్రహ్మాండమయిన ఉత్తరం రాశాడు సుబ్బలక్ష్మికి. వారపత్రిక కోసం సుబ్బలక్ష్మి — చెల్లెలు రాగానే ఈ ఉత్తరం కాస్తా అందులో పొందుపరచి పంపించేసి హమ్మయ్య అనుకున్నాడు.

అన్నమాటే గాని, గుండె మాత్రం ఆగనన్నా ఆగుతాను; లేక పగులుతాను అని బెదిరించసాగింది. తను చేసినది తొందరపాటు పనేమోనని భయపడ్డాడు. సుబ్బలక్ష్మి ఒప్పుకోకపోతే—ఒప్పుకోకపోగా వాళ్ల నాన్నా—వాళ్లకి చెబితే! ఒకవేళ ఒప్పుకున్నా తను నాన్నగారికి ఈవార్త చెవిన వేయడం ఎలా? "డొక్కచీలికలు ...." అంటూ ఆయన ఉత్తరం రాస్తే భరించేదెలా? .... మర్నాడు బెజవాడలో బ్రహ్మాండమయిన ఇంగ్లీషు — పిక్చరు రిలీజవుతోందని తెలిసి వెళ్లేందుకు డబ్బులేక బందర్లో చిక్కడ్డ కుర్రాడిలా, ఇల్లు దున్నేసి బయటికి పారిపోయాడు సుబ్బారావు.

ఆందోళన తగ్గేందుకని వాల్‌పోస్టర్లు బట్టీ పట్టేసి, కిళ్లీ కొట్ల బయట తగిలించిన కాగితాల ద్వారా స్టూడియోలో ఫలానా తార, ఫలానా తారడు ఎలా ప్రవర్తించినదీ అర్థంచేసుకుని, ఇంటి గుమ్మం తొక్కిన సుబ్బారావు లోపలి దృశ్యం చూసి కొయ్యబారిపోయాడు—

సుబ్బలక్ష్మి చెల్లెలు అప్పుడే పత్రిక వాపస్ తీసుకొచ్చేసి "ఆయనేరీ?" అంటుంటే సుబ్బారావు—బామ్మ "నే నిస్తానులేవే పిల్లా" అని ఆ అమ్మాయి చేతులోంచి తీసుకుని పేజీలు తిరగ వేస్తుంటే, అందులోంచి కవరు ఒకటి జారి పడుతున్న సన్నివేశం అది ! ....

ఒక్క దూకున దాన్ని స్వాధీనపర్చుకున్నాడు సుబ్బారావు.

"సుబ్బిగా! ఎవరురా రాసింది ఉత్తరం" అంది బామ్మగారు.

"ఇదా! బామ్మా, ... ఇది ...."

"సీతాలక్ష్మి రాసిందా ఏమిట్రా, చూడు సరిగా."

ప్రాణం లేచివచ్చింది సుబ్బారావుకి. ఆవిడ చెప్పిన శాల్తీ ఆవిడగారి మనుమరాలు—కూతురు కూతురన్నమాట !

"అవునే బామ్మా, సీతాలే రాసింది ....."

"చదువకుండా అలా లోపలికి పోతావేంరా ?"

"ఆ, ఆ! చదువుతున్నాగా ..... 'బామ్మగారి పాదపద్మములకు సీత నమస్కరించి వ్రాయునది. (తనకు తోచినదేదో పైకి చదివేస్తూ—సుబ్బలక్ష్మి రాసిన ".... మీరు ఎంతో ప్రేమతో రాసిన ఉత్తరం అందింది. నాకు అంతటి అదృష్టం కలిగించినందుకు కృతజ్ఞురాలిని. నేను మనసా ఏనాడో మీ దాన్ని .... " అనే మాటలు చదువుకుని ఎరవశమయిపోతూ "....ప్రేమిస్తున్నాను. త్వరలో."

సుబ్బారావు చదువుతున్న దేమిటో బామ్మగారికి అంతుపట్టలేదు. "ఏమిట్రా, అది ఎవర్ని ప్రేమిస్తోందిట ? "త్వరలో" ఏమిటి ?" అంది అనుమానంగా. మనవడి వరస ఆవిడకేమీ నచ్చలేదు.

సుబ్బారావు తప్పు గ్రహించుకున్నాడు.

"అదికాదు బామ్మా, వాళ్లాయన సీతాలక్ష్మితో

అన్నట్టు—నిన్ను దారుణంగా ప్రేమిస్తున్నాను అని"

"త్వరలో అంటుందేమిటి ?"

"ఓహో! అదా! భలేదానివేనే బామ్మా, దానికి డోకులు అని ఒస్తున్నాయిట. 'త్వరలో నీకు మునిమనుమణ్ణి ఇస్తాను, అని రాసింది!'' ఫెళ్ళున నవ్వాడు సుబ్బారావు.

బామ్మగారు నవ్వలేదు సరికదా, మనవడివంక నిశితంగా చూసింది. "నీ కేమయినా మతి పోయిందేరా, లేక పెద్దముండని చేసి ఆడిస్తున్నారా—అది కాపరానికి వెళ్ళి నెలన్నా కాలేదు! ..... పైగా "బామ్మగారి'' కి అని రాసిందేమిటి ? అమ్మమ్మనికదా—.... అసలేదీ ఆ ఉత్తరం ఇటివ్వు, నీ వేషాలు నా దగ్గరటరా—అన్నీ చూస్తూనే ఉన్నాలే భడవా! కానీ, మీ నాన్నకి రాసి ....''

హడావుడిగా వీధిలోకి 'ఫేడవుట్' అయిపోయాడు సుబ్బారావు

మూడోరోజున నాన్నగారి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. "అత్తయ్య నిన్ను చూడాలనుకుంటోందిట. 'సుబ్బిగాడు మా ఇంటికి వచ్చి మూడేళ్ళయింది' అని రాసింది. కాబట్టి రేపు శలవల్లో బామ్మని ఇటు పంపేసి, నువ్వు అత్తయ్యగారింటికి వెళ్ళవలసింది. వెళ్ళి, అక్కడ నాలుగు రోజులున్నాక ఇక్కడికి వద్దువుగాని! వెధవ వేషాలు వేయక చెప్పినట్లు చేయి'' అని రాశారు సుబ్బారావు నాన్నగారు.

ఇప్పుడు ఆ ప్రయత్నం మీదనే దిగాడు సుబ్బారావు. "ఇదేదో పూర్తిచేసుకుని ఇంటికెళ్ళి అమ్మతో మెల్లిగా సుబలక్ష్మి విషయం చెప్పేసి ...."

"ఎవరూ అది ? సుబ్బులా — అదేమిట్రా అలా పోతావు ? మనుషుల్ని మరిచిపోయావు. సరే ఇల్లు కూడా ....''

స్నప్రహాలోకి వచ్చి, వెనక్కి తిరిగి ఇంట్లోకి వచ్చాడు సుబ్బారావు. "ఏం అత్తయ్యా, కులాసేనా! మావయ్యగారేరీ?—పొలం వెళ్ళారా ? ఆఁ ఏమిటి కబుర్లు — సుబలక్ష్మి బాగుందా ?'' ఏకధాటిగా పరామర్శ చేసేశాడు సుబ్బారావు.

"సుబ్బలక్ష్మి ఎవరురా—నీకు ....'' అంటూనే ఆవిడగారి దగ్గరగా వచ్చి సుబ్బారావు—ఒళ్ళు తాకి చూసి "జ్వరం ఏమీ లేదే!'' అని ఆశ్చర్యపోయింది.

సిగ్గుపడిపోయాడు సుబ్బారావు తన పొరపాటుకి.

"నువ్వు నన్ను సుబ్బులు అన్నావు. దానిపేరు మీనాక్షి. రెండూ కలిపి—ఏదీ చూశావు'' నవ్వుతో ఖంగారుగా తప్పుకున్నాడు.

"అమ్మాయి మీనాక్షీ, బావకి కాళ్ళకి నీళ్ళు పట్టుకురా!'' అని కేకేసింది సావిత్రమ్మగారు.

సుబ్బారావు కిదంతా చాలా బాధాకరంగా ఉంది. ఇప్పుడు ఇష్టమున్నా లేకపోయినా దాన్ని పలకరించాలి. అదేమో అతన్ని చూసి సిగ్గుపడిపోతుంది కాబోయే మొగుడన్న భ్రాంతితో! దాని కేం తెలుసు తనకోసం సుబ్బలక్ష్మి-'ఏ గ్రేట్ బ్యూటీ'—వెయిట్ చేస్తోందని!'' దగ్గిరవుతున్న పాదాలని చూస్తూనే ఆలోచనలు ఆగిపోయాయి.

చక్కటి పాదాల్ని కావలించుకుని పట్టీలు వాటిని ముద్దు పెట్టుకుంటూ గుర్రపుజూలులా ఎగిరిపడుతున్న పట్టు పరికిణీ, కుచ్చెళ్ళని ఎత్తి పెట్టుకున్న అతి నాజూకయిన చేయి—దానిమీద

వేట

ఉన్నాయా లేవా అన్నట్టున్న బంగారపు గాజులు' పచ్చగా కళ్ళని కట్టేసేట్టు జాకట్టుకి, వోణికి మధ్యగా అగపడుతున్న నడుము ..... ఖంగారెత్తిపోయి గబుక్కున తలెత్తి చూశాడు.

దిగ్భ్రాంతు డయిపోయాడు!

ఎవ తీ సుందరి?—ఎన్ని జన్మల తపః ఫలితం ఇంత అందాన్ని ఇంత దగ్గిరసా చూడగలగడం! అవి కళ్ళు కావు; నిజంగా చేపపిల్లలే! అది నుదురు కాదు; పాలరాయి! అది ముక్కు కాదు; సంపెంగ పువ్వు! అది నోరు కాదు చిన్న సున్నా! అవి బుగ్గలు కావు; పాలబుడగలు! ... తను మనిషి కాదు; ఉట్టి వెధవ.

"నీళ్ళు తీసుకోవేం బావా!'' అని మెత్తగా నవ్వింది మీనాక్షి.

"అలా చూస్తావేంరా, మన మీనాక్షి! ఎప్పుడో మూడేళ్ళయింది నువ్వు చూసి'' మేనల్లుడి బాధ గ్రహించి తృప్తిగా నవ్వుతూ లోపలికి వెళ్ళిపోయిందావిడ.

అబ్బాయి గుర్రాల పెంప
కంలో ఆరితేరినవాడు ఓసారి
యుద్ధంలో చేరదామని వెళ్ళాడు.
డాక్టర్ "ఏవి బాబూ? పళ్ళేవీ
చూద్దాం?" అన్నాడు.
"బాగానే ఉంది. నేను
గుర్రాన్ని అనుకున్నారా?" అని
అడిగాడు అబ్బాయి.

రమణి (పెండ్యాల)

సగం పెంటుమీదే బోర్లించుకున్నాడు చెంబుని.

"టవలు నా భుజంమీద ఉంది తీసుకో!'' అంది, పుస్తకాలు చూడటంలో నిమగ్నమయి ఉన్న మీనాక్షి.

వణికే చేతులతో తీసుకున్నాడు.

"అబ్బ! ఇన్ని పుస్తకాలు తెచ్చుకున్నావెందుకు బావా ?''

వీణలు మాట్లాడును అనుకున్నాడు సుబ్బారావు.

"మాట్లాడవేం బావా ?''

"ఏమిటి ?"

"ఇన్ని పుస్తకాలు తెచ్చావెందుకు అని అడుగుతున్నాను.''

"నీ కోసమే!''

నవ్వింది మీనాక్షి.

మల్లెలు విచ్చుకున్నాయి అనుకున్నాడు సుబ్బారావు.

"నా కోసమా, లేక మా ఊళ్ళో తోచదన్న భయంవలనా ?''

"నువ్వుండగా నాకు తోచకపోవడమేం ఖర్మ ?''

"మాటలు నేర్చావే!''

"నువ్వే నేర్పుతున్నావు.''

"సరే, పాపం!'' అని నవ్వి, అతను పట్టుకొచ్చిన పుస్తకాలన్నీ పుచ్చుకుని లోపలికి దారి తీసింది.

"హంసలు నడవటం ఇన్నాళ్ళకి చూడగలిగాను" అన్నాడు సుబ్బారావు ధైర్యం పుంజుకొని. ఎంతగాకపోయినా స్వంత అత్తయ్య కూతురు; పైగా ఇన్నాళ్ళు తనే ఇష్టపడలేదు కాని, అది పుట్టినప్పటినుంచి "సుబ్బిరి భార్యగానే చలామణి అవుతోంది.'' తనే గుడ్డివాడు; ఇంత అందాన్ని చేతి ముందుంచుకుని ......

"అయితే నువ్వు మానస సరోవరంలో ఉన్నావన్నమాట'' నవ్వింది ఫకాలున మీనాక్షి.

"అబ్బ! నేలనిండా ఎన్ని ముత్యాలు రాలాయో!''

వెనక్కి తిరిగి, "అయితే ఏరుకోరాదూ'' అంది బుంగమూతి పెట్టి మీనాక్షి.

"నాకేం ఖర్మ, కురిపించే మనిషే నాదయినప్పుడు.''

సిగ్గుపడి "ఛీ, పో'' అంది మీనాక్షి.

"పోదాం కలిసే!—అందుకే వచ్చాను'' అన్నాడు.

స్నానం చేస్తున్నంతసేపూ ఆలోచనలు స్వర్గంలోనే ఉన్నాయి. ప్రతి నిముషానికి ఆశ్చర్యపడి లేస్తున్నాడు. అప్పుడలా బక్కగా ఉన్న మీనాక్షి ఇప్పుడు ముద్దబంతిపూవులా ఎంత బాగుంది! తనెంత అదృష్టవంతుడు! ఇంటికి వెళ్ళగానే నాన్నగారు "ఏరా, వెధవ్వేషాలు వేయక మీనాక్షిని చేసుకుంటావా, లేక ....'' అనగానే తను సవినయంగా "మీ ఇష్టం నాన్నగారూ, నా కభ్యంతరంలేదు'' అంటాడు. తరువాత .... నీళ్ళు చుర్రుమన్నాయి.

భోజనం చేస్తున్నంతసేపు అత్తయ్యమీద బోలెడు కోప్పడిపోయాడు సుబ్బారావు. మీనాక్షి ఎక్కడా అగపడదు. రాకరాక వచ్చాడు కదా తను; మీనాక్షికి, తనకి కలిపి వడ్డిస్తే ఏంపోయిందో ఈవిడకి అని. "తెలియదు; పాతకాలం'' అని సమాధానపడ్డాడు.

భోజనం అయిందనిపించి చేయి కడుక్కుని లేచాడు.

"మీనాక్షీ, బావకి వక్కపలుకివ్వు'' కేకేసింది.

ఒళ్ళంతా కళ్ళతో చూశాడు సుబ్బారావు—గదిలో తను తప్ప మరెవరూ లేరు. మీనాక్షి రాగానే చేయి పట్టుకోవాలని రెడీగా ఉన్నాడు.

కాని లోపలికి వచ్చిన మీనాక్షి ముఖం చూసి, గతుక్కుమన్నాడు!

ముఖంలో స్పష్టంగా కోపం కనబడుతోంది. కొద్దిగా ఏడ్చిన లక్షణాలు కూడా ఉన్నాయి—కళ్ళు, బుగ్గలు తడిసి ఉన్నాయి. ముక్కు ఎర్రబడింది! .... వక్కపొడి డబ్బా బల్లమీద పెట్టి గిరుక్కున వెనక్కి తిరిగింది.

ఎలాగో ధైర్యం చేసుకుని చేయి పుచ్చుకోబోయాడు సుబ్బారావు. ఒక్కసారి విదిల్చేసింది మీనాక్షి.

"మీనాక్షి!'' అన్నాడు ఆశ్చర్యంగా.

"చాల్లే, ఆడిన నాటకాలు చాలు. నీ మాయ మాటలకి మోసపోయేదాన్ని కాను.'' అని విసవిస నడిచి మేడమీదికి వెళ్ళిపోయింది.

ఖంగారుపడిపోయాడు సుబ్బారావు. తన కలల వెన్నెల కరిగిపోయింది. గబగబా ఆమెను వెంబడించి మేడమీదికి వెళ్ళాడు—

"ఏమిటి మీనా—నే చేసిన అపరాధం ఏమిటో చెప్పు. నా తప్పు దిద్దుకునేందుకు మనస్ఫూర్తిగా ప్రయత్నిస్తాను. నన్ను మాత్రం నీ ప్రేమకి దూరం చేయకు—అది భరించలేను.'' అన్నాడు

బాధగా.

"మాటలు నేర్చిన మనుషులు ఎప్పుడయినా అన గలరు."

"ఏమిటి నే చేసిన తప్పు? చెప్పకపోతే నామీద ఒట్టే!" అతని కంఠం ఒణికింది. కళ్లు ఆర్ద్ర మయ్యాయి.

మీనాక్షి అతనివంక చూసి "ఏమీ ఎరగనట్టు!" అంది.

"దైవసాక్షిగా తెలియడంలేదు; నువ్వు చెప్పే దేమిటో! నాకు తెలిసినదల్లా ఒక్కటే—నిన్ను మన స్ఫూర్తిగా ప్రేమిస్తున్నా నన్నది. నీకోసం ఏం చేయమన్నా చేస్తాను!"

"అయితే మరి దీని అర్థం ఏమిటి?—ఇందాక నువ్వు తెచ్చిన పత్రికలో ఉంది" అని గబాలున జాకెట్టులోంచి తీసి ఒక ఉత్తరం అతనిముందు పడేసింది.

స్తంభించిపోయాడు సుబ్బారావు. భూమి గిర్రున తిరిగిపోయింది. అది సుబ్బలక్ష్మి తనకు రాసిన ఉత్తరం.

"ఏమంటావు దీని విషయం?" రెట్టించింది మీనాక్షి.

అనాలోచితంగా తను తొందరపడినదాని ఫలితంగా అమూల్యమయినదాన్ని పోగొట్టుకుంటు న్నాడు. స్వర్గ సౌఖ్యాన్ని చేజేతులా వదులుకొంటు న్నాడు ఎన్ని అబద్ధాలయినా సరే ఆడి, ఒక్క ఇల్లు నిలపమన్నారు. తనూ ఆడతాడు—ఒక్కసారి. కాని, ఎవరి కొంపలూ తీసేందుకు కాదు. తన కొంప నిలుపుకునేందుకు. మీనాక్షిని తనదాన్ని చేసు కునేందుకు. మీనాక్షి తనది కానినాడు బ్రతుకు అంధకారబంధురం.

ఒక్కసారి ఫెళ్ళున నవ్వాడు సుబ్బారావు. తెల్ల బోయింది మీనాక్షి.

"ఓ! మై డియర్ గర్ల్! ఈర్ష్య ఆడదాని సొత్తు అన్నమాట ఋజువు చేశావుకదే నా బంగారు బొమ్మా ...."

"పైత్యం ఎక్కిందా ఏమిటి బావా?"

"చెబుతాను విను. ఆ ఉత్తరం నువ్వనుకున్నట్టు నీకు పోటీదారు రాసింది కాదే నా చిట్టితల్లీ. నేను రాస్తున్న కథల్లో హీరోయిన్ హీరోకి రాసినది. అంతర్కితం వాడిచేత ఆ అమ్మడికి రాయించాను. ఆ పిల్ల అబ్బాయికి రాయకపోతే వాడు ఏడ్చేయడూ! అందువలన ఇందాక రైల్లో కూర్చుని సుబ్బలక్ష్మి —అంటే మా కథానాయకి — తన ప్రియుడికి రాసిన జవాబు రాశానన్నమాట."

ఆశ్చర్యంతో పెద్ద కళ్లని మరీ పెద్దవి చేసి "అయితే నువ్వుకూడా కథలు రాస్తావా బావా?" అనడిగింది మీనాక్షి.

అప్పటి ఆమె అందానికి ముగ్ధుడయిపోయాడు సుబ్బారావు. తను గండం గడించాడు ఇహ భయం లేదు.

"అవునండీ, రాణిగారు! 'కామిని' అనే పేరు ఎప్పుడయినా చూశారా పత్రికలో?"

మరి ఆశ్చర్యపోయింది మీనాక్షి — "అంటే నువ్వేది ....." ఏ

"ఎక్జాక్ట్లీ మై డియర్! ఆ కామిని నీ ధం మ్యత్ భర్త. దేవుడి — సారీ, పతిదేవుడికి కలం పేరు—అంటే పెన్ నేమ్."

నిలబడిపోయింది. మీనాక్షి తరువాత తేరుకుని ఫక్కున నవ్వి "భలేవాడివే బావా, చెప్పావుకావు ఇన్నాళ్లు! నాకు 'కామిని' కథ అంటే చాలా ఇష్టం. నువ్వే 'కామిని' అని తెలిస్తే మా ఫ్రెండ్సందరికీ చెప్పి నిన్ను చూపించి నేను గర్వ పడేదాన్ని! అబ్బ! ఎంత బాగా రాస్తావు బావా."

అపాయం తప్పిపోయినందుకు ఆనందపడి గాఢంగా నిట్టూర్చాడు సుబ్బారావు. తనకి కూడా దారుణమయిన 'బ్రెయి'నంది—

"అయితే బావా, వచ్చే వారం నీ కథ పడు తుందని రాశారు — ఏం కథేమిటి?" అంది నవ్వుతూ మీనాక్షి.

దెబ్బతినేశాడు సుబ్బారావు. "ఎందులో వేశారు?"

"అదే, వారపత్రికలో చివర వేశారులే; వచ్చే వారం 'కామిని' గారి కథ చదవండి అని. ఏం కథ బావా, అది?" గోముగా అడిగింది అతని భుజం మీద ఆనుకుంటూ.

తేలిపోయాడు సుబ్బారావు. "దాని పేరు 'అందిన అమరలోకం.' కథ బాగుంటుందిలే తప్పకుండా చదువు ......"

గబుక్కున అతనికి ఎడంగా జరిగింది మీనాక్షి. ఖంగారుపడి, ఏమిటన్నట్టు చూశాడు సుబ్బారావు.

పత్రికలో ఒక ప్రకటన:

"ఉదయం మార్కెట్ వీధిలో మా అయిదేళ్ళ "బుజ్జి"కి కుక్క పిల్ల నిచ్చి, వాడి సైకిలు తీసు కున్న వారు దయచేసి ఆ సైకిల్ను తెచ్చి యిచ్చేస్తారా?"

"ఏమోయ్ సుబ్బారావు, ఎన్నాళ్లకి మామీద దయ కలిగింది! ఆఁ భోజనం చేశావా—గుడ్. ఇప్పుడే అలా బయటికి వెళ్లి వస్తా ..... అన్నట్టు అమ్మడూ, నీ కథ పడుతుందని వేశారు వాళ్లు మొన్న నాకు వినిపించిందేనా? సుబ్బారావు, మన మీనాక్షి కథలు రాస్తుంది తెలుసా? — ఎలా తెలు స్తుందిలే, చక్కగా పేరు రాసు కోవే తల్లీ! అంటే 'కామిని' ఓ—శాకినీ, ఢాకినీ అన్నట్టు. నువ్వన్నా చెప్పు" అంటూ మెట్లు దిగి వెళ్లిపోయా రాయన.

సుబ్బారావు శిలయిపోయాడు.

మీనాక్షి కిలకిల, గలగల నవ్వుతోంది, సెల యేరులా. కొంతసేపు అలా గడిచాక, మీనాక్షి నవ్వాపేసి "ఎందుకు బావా అలా అబద్ధం ఆడావు?" అనడిగింది లాలిస్తున్నట్టు.

కాని శిల కదలలేదు.

"ఎవరు సుబలక్ష్మి? — నువ్వు కథలు రాయడ మేమిటి—ఇన్ని అబద్ధాలు ఆడవలసినంత రహస్యం ఏమిటి?"

శిల కొద్దిగా కదిలింది కాని, ఇంకా నోరు రాలేదు.

అతని జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి, "చెప్పవు బావా?" అంది.

శిల కరిగిపోయింది.

"నీకోసం—నీ ప్రేమకోసం. ఆ సుబ్బలక్ష్మిని సమాధానం రాస్తే అంత అదృష్టవంతుడు లేడనుకున్న మాటా వాస్తవమే. ఇదంతా నిన్ను చూడనప్పటి విషయం. చూసినా, మూడు సంవత్స రాల క్రిందటి నీ రూపం గుర్తున్నప్పటి విషయం. కాని ఇప్పుడో నా హృదయంలో ఎక్కడ చూసినా నీ రూపే! నాలోని రక్తం ప్రతి బిందువు స్మరిం చేది నీ పేరే! కాని ఏం, లాభం, నువ్వు నన్ను క్షమించవని నాకు తెలుసు. నువ్వు లేని నా ఙూ బ్రతుకు వృథా అని కూడా నాకు తెలుసు. అందు కని ఇక్కడితో నా జీవితానికి స్వస్తి పలుకుతాను. నువ్వయినా సుఖపడాలని భగవంతుణ్ణి ప్రార్థి స్తున్నాను" అంటూనే టేబుల్‌మీద నున్న కత్తి తీసి, ఆమెముందు మోకాలుదండ వేసి, గుండెలకి సూటిగా పట్టుకున్నాడు. "నా కోసం మా బావ ప్రాణం కూడా వదిలాడు" అనే విషయం ప్రతి యేడూ కనీసం ఈరోజు నయినా జ్ఞాపకం తెచ్చుకో—"

పొంగివస్తున్న నవ్వుని నియంతలా పెదిమల చాటున దాచేసి—"కత్తి పదున్ది బావా! చేయి తెగుతుంది" అంది మీనాక్షి.

"ఫరవాలేదు. పిడి ఉందిలే" అన్నాడు సుబ్బా రావు కత్తివైపు చూసి.

ఫకాలున నవ్వేసింది మీనాక్షి. తెల్లబోయి నిల బడ్డాడు సుబ్బారావు.

"నువ్వేం చేసినా హడావుడిగానే చేస్తావు బావా! ఇదివరకేమో మీనాక్షిని ఎస్ట్ చేసుకోను అని భీష్మించావు. ఇప్పుడు నాకోసం ఆత్మహత్య అంటు న్నావు. అందుకే నీ కేం కావాలో తెలియక, నీతో బాధలు పడలేక మావయ్యావాళ్లు—వాళ్లకి తోచింది చేసేస్తున్నారు."

"అంటే?" అన్నాడు ఆశ్చర్యంగా సుబ్బారావు.

"అయ్యా! ప్రేమికుడుగారా! తమరి తండ్రి గారు మా తండ్రిగారికి ఉత్తరం రాశారు ముహూర్తం వగయిరా అతి త్వరలో ఏర్పాటు చేయమని. దానికి మీరు ఒప్పుకోకపోతే మీ డొక్క చింపే బాధ్యత తనదే ననీను. ఆ విధంగానే ఇవ్వా ళ్టికి పధ్నాలుగవరోజు రాత్రి ఎనిమిది గంటలకి మిమ్మల్ని మా నాన్నగారు కాళ్లు కడిగి అల్లుడిగ చేసుకోబోతున్నారు. మంగళం మహత్ మామ్మయ్య"

"ఏమి—నిజమే—గుడ్‌గాడ్! పాపం దేవుళ్ళు మంచివాళ్లే సుమీ! ఎటొచ్చీ మంచి కాని దాని నువ్వొకత్తివే—దానికి శిక్ష ...."

"ఇస్స్, అమ్మ వస్తోంది—" అని నేరుగ అతని చేతుల్లోంచి తప్పించుకుంది మీనాక్షి.

"ఒరేయ్ సుబ్బులూ, నువ్వు తెచ్చిన పత్రిక పక్కింటివారమ్మాయికి కావాలట్రా" అంటూ వచ్చింది సావిత్రమ్మగారు.

"ఆ బల్లమీద ఉంది పట్టుకెళ్లమను—కావా లంటే అన్నీ పట్టుకెళ్లమను—ఇంకా కావాలంటే బల్ల కూడా పట్టుకెళ్లమను—ఇంకా కావాలంటే..."

అల్లుడి ప్రేలాపన అర్థంకాక తెల్లబోయి మీనాక్షివంక చూసింది ఆవిడ. సిగ్గుతో తల దించుకుని కళ్ళ చివర్లనుంచి సుబ్బారావు వంక చూసింది మీనాక్షి చిరునవ్వుతో.

కాని సుబ్బారావు అక్కడ లేడు; గాలిలో తేలిపోయాడు. ★

శ్రీదేవి

31-వ పేజీ తరువాయి

లేదని చెప్పారు దుర్గాప్రసాద్‌కి తండ్రిమీద కోపం వచ్చింది

విసురుగా భార్య గదిలోకి వచ్చాడు ఆమె అతనిని చూసి, ఏమీ మాట్లాడలేదు భర్తతో ఆమె ఎప్పుడూ ముభావంగానే ఉంటుంది. "నీ దగ్గరేమైనా డబ్బుందా?" అనిఅడిగాడు దుర్గాప్రసాద్ సాధారణంగా దుర్గాప్రసాద్ భార్య నెప్పుడూ డబ్బడగడు ఆమెకు తండ్రి ఇచ్చిన పొలంమీద సాలుకు అయిదారువేలు వస్తాయి కాబట్టి ఎప్పుడూ డబ్బు ఉంటుంది. ఈసారి తనకు చాలా అవసరమైన పరిస్థితి ఏర్పడ బట్టి ఆమెను డబ్బడిగాడు దుర్గాప్రసాద్ కాని, ఆమె, భర్త అవసరం గురించి ఆలోచించే మనిషి కాదు భర్త ఏ పని చేసినా, ఏ మాట మాట్లాడినా అది తనమీద ఏదో పగ సాధించడానికే చేస్తున్నా డనుకొంటుంది. ఇకనుంచి తన దగ్గర డబ్బు కూడా లాక్కొని తనను హింసించాలని భర్త ఉద్దేశమను కొంది.

"ఉహూ! లేదు" అని మొహం తిప్పేసుకుంది అనసూయమ్మ.

"అబద్ధమాడకు. నీ సొమ్ము నేనేమీ ఎగెయ్యను. నెల రోజుల్లో తిరిగి ఇచ్చేస్తా. రెండువేలియ్యి" అన్నాడు దుర్గాప్రసాద్ శాంతంగానే. అనసూయమ్మ వినిపించుకోలేదు. దుర్గాప్రసాద్‌కి కోపం వచ్చింది. "ఏదీ నీ పెట్టె తాళా లియ్యి చూస్తాను" అన్నాడు.

"నే నివ్వను" అంది ఆమె. పెట్టెలో డబ్బుంది. తాళాలిస్తే దుర్గాప్రసాద్ ఆ డబ్బంతా తీసుకుంటా డని ఆమె భయం.

"ఇస్తావా? పెట్టె బ్రద్దలు కొట్టమన్నావా?" అని ఉరిమాడు.

"అంతేగా మీరు చేసేది! నా తల కూడా బ్రద్దలు కొట్టండి! మీకు మానాభిమానాలుంటేగా? కట్టుకున్న పెళ్ళాం దగ్గర డబ్బు కూడా లాక్కొని— ఆ—ఉంచుకున్న దానికి తగలబెట్టడమేగా మీ ఘనత! మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి. నన్నిన్నివిధాలా ఏడిపిస్తేనే గాని మీకు తృప్తి ఉండదు. నేను అన్నిటికీ ఓర్పు వహించబట్టే మీ ఆట లిలా సాగుతున్నాయి. ఒక్కదమ్మిడీఅయినా సంపాదనలేదు గాని, మీ ఆస్తేగాక, నా ఆస్తి కూడా దానికిచ్చేద్దామను కుంటున్నారు" అని అనసూయమ్మ అంటూంటే, దుర్గాప్రసాద్‌కి ఒళ్లుమండినంత కోపం వచ్చేసింది. "ఏమిటే అంటున్నావ్? నా సంపాదన ఊసు నీ కెందుకు? నా ఇష్ట మొచ్చినట్లు నేను చేసుకుంటాను. నువ్వెవరివి అడగడానికి? పెట్టెలో దివ్వకపోతే, నీ మెడలో నగలియ్యి! ఇవ్వకపోతే నీ తల నిజంగా బ్రద్దలు కొడ్తాను" అన్నాడు.

"మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి. మీ రేం చేసినా సరే ఒక్క దమ్మిడీ ఇవ్వను. మీ తాగుడికీ, ఉంపుడుకత్తెలకూ ఇవ్వడానిక్కాదు నా డబ్బు! మీకు సిగ్గు లేకపోయినా నాకు సిగ్గుంది" అని అనసూయమ్మ మాట మాటకీ భర్త నెత్తి పొడుస్తూ, సాధిస్తూ మాట్లాడడం, జయమ్మగదిలోనున్న జయమ్మా, సుభద్రమ్మా, శ్రీ దేవి వింటూనే ఉన్నారు. సుభద్రమ్మ తరుచూ ఈ ఇంటికి వస్తూండడంవల్ల ఆమెకు కొత్తగాదు.

జయమ్మకూ, ఈ పరిస్థితికి కారణం అనసూయమ్మేనని, అనసూయమ్మ మూర్ఖత్వం గురించి సుభద్రమ్మకు చాలాసేపు అనేక విషయాలు చెప్పింది. ఆమెకు మేనల్లుడైన దుర్గాప్రసాద్‌మీద చాలా అభిమానం ఉంది. అనసూయమ్మ ఆమెను ఎక్కువ మన్ననగా చూడదు. అలాగని తనే అధికారం చలాయించదు. అయితే జయమ్మకు సేవచేస్తూ, తియ్యటి కబుర్లు చెప్తూ తిరగదు. ఆమె స్వభావమే అంత. ఆమెకు బోలెడు అహంభావముందని అందరూ అనుకుంటారు. సుభద్రమ్మకు కూడా తనని కొంచెం తక్కువగా చూస్తుందని అనసూయమ్మమీద లోలోపల క్రోధం ఉంది.

తల్లి తండ్రుల స్పర్థతో శ్రీదేవి మనస్సంతా ఆనాడు వికలమైపోయింది. అందువలన సుభద్రమ్మవద్ద పాట కచ్చేరీ ప్రస్తావన తేలేదు శ్రీదేవి ఆవాళ.

ఆదివారంనాడు సుభద్రమ్మ మళ్లీ వచ్చింది. శ్రీదేవి ఆమెవద్ద ఈ విషయం ఎత్తింది. వెంటనే జయమ్మ దగ్గర శ్రీదేవిని కాలేజీలో జరిగే పాట—కచ్చేరీకి తను, దగ్గరుండి తీసికెళ్ళడానికి అనుజ్ఞ సంపాదించి ఆమె.

మరునాడు సుభద్రమ్మా, ఆమె పిల్లలూ, శ్రీదేవీ, కాలేజీలో ఏర్పాటుచేయబడ్డ, వీణావాద్య కచ్చేరీకి వెళ్లారు. ఆంధ్ర వారోత్సవాలు ఏటా, సాధారణంగా అన్ని కళాశాలలూ ఆంధ్రదేశంలో జరుపుతుంటాయి. కాలేజీ అంతా రంగురంగుల కాగితాలతోనూ, స్వాగతమిచ్చే బోర్డులతోనూ, విద్యుద్దీపాలతోనూ, మైకులతోనూ శోభయమానంగా అలంకరించారు. ఆ అలంకరణలన్నీ స్తబ్ధాలంకరణలే గాని చైతన్యంతో, నిముష నిముషానికీ, ఆ ఆవరణకు అలంకారం తీసుకువచ్చేవాళ్లు విద్యార్థినీ, విద్యార్థులు! రంగు రంగుల చీరలూ, రకరకాల పువ్వులూ ఆభరణాలతో, తమ నడకలో, చూపులో, మాటల్లో నవ్వుల్లో, వింతవింత సోయగాల్ని చూపిస్తున్న యుక్త వయస్కులైన విద్యార్థినులు ప్రతివారి దృష్టినీ ఆకర్షిస్తున్నారు. తమకు దుస్తుల విషయంలోనూ, స్నో, పౌడర్ల వాడుకలోనూ, ఎటువంటి వారైనా తప్పుపట్టగలరేమోనని సవాలు చేస్తున్నట్లు, బట్టల షాపుల్లో కొత్తగా దిగుమతైన గాబర్డీనులూ, షార్కుస్కిన్‌లూ, నైలానులూ ఎంతమాత్రం ఆలస్యం చెయ్యకుండా కొనేసి, కుట్టించేసి, వీలైనన్ని జతల్ని ధరించి ప్రదర్శించే విద్యార్థులు కాలేజీ ఆవరణకు కొత్త వికాసం కల్పిస్తున్నారు. ఖరీదైన సిల్కుతెరలతో, అత్యధిక కాంతివంతమైన విద్యుద్దీపాలతో, స్టేజీ చాలా బాగా అలంకరింపబడింది. ప్రేక్షకులలో స్త్రీలకు ఒక వైపూ, పురుషులకు ఒకవైపూ స్థానాలు ఏర్పరచబడ్డాయి. వాలంటీర్లు ఎవరు కూర్చుండవలసిన చోట్లను వారికి చూపిస్తున్నారు. శ్రీదేవీ, సుభద్రమ్మా, పిల్లలూ వచ్చేసరికి ఇంకా కచేరీ ఆరంభం కాలేదు. ఆ ఏర్పాట్లూ, ఆ జనం, ఆ స్టేజీ శ్రీదేవికి చాలా సంతోషం కల్గించాయి.

విద్యార్థుల కళ్లన్నీ విద్యార్థినులవైపు ఉన్నాయి. ఇంచుమించు అందరి దృష్టినీ ఆకర్షించింది శ్రీదేవి. ఆమె తమకు కేటాయించిన స్థానంలో కూర్చోడానికి వస్తూంటే, ఒక విద్యార్థి, తోటి విద్యార్థితో, "ఆ అమ్మాయి ఎంత అందంగా ఉందో చూడరా!" అవడం శ్రీదేవికి విన్పించింది. తనవైపు చూస్తూ ఒక విధమైన మెప్పుదలను ప్రకటించడం ఆమె గమనించింది. విద్యార్థులనూ, వాళ్ల చేష్టల్నీ గమనిస్తూ, శ్రీదేవి ఒక నూతన ప్రపంచంలోకి వచ్చినట్లు భావించసాగింది.

పొంగి పొరలుతూ పరవళ్లుతొక్కే గోదావరిలాగ ఆ యువతీ యువకుల సమూహం ఉప్పొంగుతున్న ఉత్సాహంతో సయనానందంగా ఉంది. యవ్వనం, బాధ్యత తెలియని కులాసా జీవితం, భవిష్యత్తు గురించి మహోన్నతంగా కలలుకనే మనసూ, స్త్రీ పురుష పరస్పరాకర్షణా జనిత సౌందర్యమాధుర్యాల కాలవాలమైన హృదయం, ఆ కళాశాల విద్యార్థులలో ప్రతిఫలిస్తూ, సభాసదుల సందర్శి ఒక వినూత్న వాతావరణంలోకి, నందన వనవిహారానికి, ఉత్సాహ సముద్రంలో స్నానానికి, తీసికెళ్లినట్లు భావింపజేసింది ఆ ఆవరణ! పరస్పర కాంక్షలతో చూపుల రాయబారాల్ని పంపే యువతీ యువకులూ, చిరునవ్వుల ప్రేమసందేశాల్ని ఒయ్యారంగా తమ ప్రేమికులకే అందించుకొంటూ మనసులో పూచిన మధుర మాలతుల తమ మాధవదేవుల కర్పించుకొంటున్న మనోజ్ఞ యువతీమణులు, తమ హృదయాల్ని ఏనాడో వారి ప్రేమల సమర్పించుకొన్నట్లు తమ హావ భావ విలాసాలతో సుస్పష్టం చేస్తున్న సుందర యువకులూ, ఆ ఆవరణలో విరివిగా కన్పించసాగారు. ఎటు చూచినా, హృదయాన్ని కదిలించే ఆకర్షణలు అనేకం కన్పిస్తున్నాయి అందరికీ, ముఖ్యంగా శ్రీదేవికి! విద్యార్థులు పనున్నా లేకపోయినా, సూట్లు ప్రదర్శిస్తూ ఇటూ అటూ తెగతిరుగుతున్నారు. విద్యార్థుల మన్ననల్ని గర్వంగా మౌనంగా మందహాసంతో స్వీకరిస్తున్న మానినీమణులు తమలో తాము తమ స్నేహితులగు విద్యార్థుల గురించి ముచ్చటించుకుంటున్నారు.

దేవిక అనే బి. ఏ. చదువుతున్న స్త్రీ వేదిక ఎక్కడం, ప్రిన్సిపాలుగారు ఆమె వాద్యంగురించి కొన్ని వాక్యాలు చెప్పడం, విద్యార్థులంతా చప్పట్లు కొట్టడం జరిగిన తరువాత కచ్చేరి ప్రారంభమైంది. ఆమె సోదరే మృదంగం వాయిస్తుందని ఎవరో అంటూండగా శ్రీదేవి వింది. శ్రీదేవికి ముందు కూర్చున్న యువతుల్లో ఇద్దరు, తమలో తాము అనేక విషయాలు మాట్లాడుకొంటూ, తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్నే మరిచిపోయారు. వారికి సంగీతం గురించి కూడా బాగా తెలిసినట్లుంది. ఎందుకంటే, దేవిక వాద్యం ప్రారంభించగానే, "భైరవి ఎత్తుకుందే! 'విరిబోణి' వాయిస్తుంది కాబోలు". అని వాళ్లు అనుకోడం శ్రీదేవి వింది.

ఆ యిద్దరు యువతుల మాటలూ శ్రీదేవి చెవుల్లో పడుతూనే ఉన్నాయి. ఆ యిద్దరిలో ఒకామె, కొద్దినెలల క్రిందట వివాహమై, కాలేజీ చదువు మానేసినట్లుంది. ఆమెపేరు శ్యామల. రెండవ అమ్మాయి ఇంకా చదువుతోంది. ఆమెపేరు సావిత్రి. వారిద్దరూ తమ హృదయాలు విప్పి మాట్లాడుకోవడానికి, వేరే మంచి సమయం దొరకడం అసంభవం అనిగుర్తించి, ఇంతగొడవలో తామేమి మాట్లాడుకొనేది ఎవరూ గమనించరనే ధైర్యంతో మెల్లిగా మాట్లాడుకుంటూ ఈ అవకాశం వినియోగించుకుంటున్నారు. కాని వారి మాటలు శ్రీ దేవికి విన్పిస్తూనే ఉన్నాయి. ఆమె ఒక చెవితో వీణావాద్యాన్ని వింటున్నా, రెండవ చెవితో వారి మాటల్ని వింటూనే ఉంది. సుమారు పదిహేడు సంవత్సరాల ప్రాయంలో

ఉన్న ఆ యువతుల సంభాషణ శ్రీదేవి హృదయాన్నెంతో ఆకర్షించింది. దేవిక 'విరిబోణి' వర్ణం ప్రారంభించింది. ఆ వర్ణం తను కొన్ని వందలసార్లు సాధన చేసింది శ్రీదేవి. అందువల్ల ఆమె మనసు ఆ వర్ణంమీద నిలవలేదు. శ్యామల సావిత్రితో తన పెళ్ళి అనుభవాల్ని మెల్లగా చెప్తూంటే శ్రీదేవి మనసును అటు కేంద్రీకరింపజేసింది.

"మొదట నాకు చాలా భయం వేసిందిగాని, ఆయన చాలా మంచివారేనే! పెళ్ళిలో బోలెడన్ని పేచీల పెట్టారు. ఒక్కొక్కసారి నాకోసంకదా మా అమ్మా, నాన్నా ఇన్ని కష్టాలు పడుతున్నారు అని ఏడుపు వచ్చేది. కాని, అన్ని చికాకులూ అయిన తరువాత ఆయన మనస్సు తల్చుకుంటే ఎంతో ఆనందంగ ఉంది. నన్నొక దేవతలా చూసుకుంటున్నారు."

"ఆరోజు మీ ఇద్దరిలో ముందు ఎవరు మాటాడేరే?"

"ఏ రోజే?......"

"ఆ రోజేనే, ఏమీ తెలియనిదానిలా నటిస్తావేం? మీ ప్రణయ జీవితంలో తొలి మజిలీ ఆరంభమైన రోజు—ఇంకా చెప్పమంటావా........?"

"వద్దులే! అబ్బ! తల్చుకుంటే ఎలాగో ఉంటుందే! మళ్ళా మనం తీరికగా కల్సుకొన్నప్పుడు చెప్తాను. ఇక్కడెవరైనా వింటే బాగుండదు."

"అయితే, దాచుకో! ఏదో స్నేహితురాలివి కదాని అడిగాను. అంత రహస్యం, చెప్పకూడనిదీ అని తెలిస్తే అడిగేదాన్ని కాను."

"ఉష్! అది కాదే. తరువాత నీకు అన్నీ వివరంగా ఒక్క విషయం కూడా దాచకుండ చెప్తాను. మనం .ంత మెల్లిగా మాట్లాడు....."

సావిత్రికి ఆ రోజు ఏం జరిగిందో కొద్దిగనైనా తెలుసుకోవాలని చాలా ఆతృతగా ఉంది. అంతకన్నా ఆతృతగా పిల్ల మాటలు వింటోంది శ్రీదేవి. వాళ్ళిద్దరూ నెమ్మదిగా మాట్లాడుకునే విషయాలు ఆమె మనస్సుకు ఏదో హాయి కలిగిస్తున్నాయి. ఆ రోజు — ఏం జరిగిందో శ్యామల చెప్తే, విని సంతోషించేది ఒక్క సావిత్రే కాదు—శ్రీదేవి కూడా!

"మీ ఆయనను నువ్వు ప్రేమించకలిగావా?"

"ఆయనకోసం ప్రాణమివ్వాలన్నా ఇస్తాను. ఈ ప్రపంచంలో ఆయనే నా సర్వస్వం అనిపిస్తోంది. ఆయనను తల్చుకోని నిముషంలేదు."

"మరి, ఆ ఆచారిని పూర్తిగా మర్చిపోగలిగావా? ఇందాకా నీతో మాట్లాడాలని ప్రయత్నించాడ చూశావా?"

"అవును. కాని, అతన్ని నిజంగానే మర్చిపోయాననుకుంటా. నా మనస్సులో ఇప్పుడు, నా భర్తకు తప్ప, మరెవరికీ స్థానంలేదు."

"అన్నాళ్ళు అతనిని మురిపించి, అతనికి ఆశలు కల్పించి, అతను రాసిన ప్రేమలేఖలకు జవాబిచ్చి, ఇప్పుడతన్ని అంత సులభంగా ఎలా మర్చిపోగలిగావ్?"

"అదేమిటో నేను చెప్పలేనే. భర్త—అనే—వ్యక్తిమీద మనకు కలిగే భావంలో చాలా ప్రభావం ఉంది. ఆయనకు నా హృదయం, శరీరం, అన్నీ అర్పించినా ఇంకా తృప్తి తీరటంలేదు.

"ఈ రెండు చేతులూ కాక, మరొక పది చేతులున్నా, ఆయన సేవలో వినియోగించాలనే ఉంటుంది" అంది శ్యామల.

"ఆచారి నీ గురించి చాలా బాధపడ్డాడనీ, నిద్రాహారాలు కూడా మానేసి చిక్కిపోయాడనీ విన్నాను. నువ్వితన్ని అంత సులభంగా ఎలా మర్చిపోయావో నాకు అర్థం కావటంలేదు!"

దేవిక వీణమీద అప్పటికి మూడు త్యాగరాజ కీర్తనల వాయించింది. ప్రేక్షకుల శాస్త్రీయ సంగీతం అంత మెచ్చుకున్నట్లు కనిపించలేదు. చిన్న కలవరం, అక్కడక్కడ గుసగుసలూ ప్రారంభమయ్యాయి. ఇంక తను ఎక్కువసేపు శాస్త్రీయ సంగీతం వాయిస్తే వాళ్ళు వినలేరని గ్రహించింది దేవిక. జయదేవుడి అష్టపది ఒకటి ఎత్తుకుంది వీణమీద. "కృష్ణా" అనే పిలుపుతో ప్రారంభించి, రాధయొక్క విరహాన్ని లలితమైన సంగీతంతోటి మృదు మధుర కవిత్వంతోటి వర్ణిస్తూన్న ఆ పాటను దేవిక తన వీణమీద వాయిస్తూ, నాదస్పర్శచేత ప్రేక్షకుల మనోఫలకంపై మనోజ్ఞ రూపాల్ని సృష్టింపజేసి, వారికి రాధా—మాధవ ప్రణయాన్ని దర్శింపజేసి, తన్మయులను చేసింది.

"ఏమిటోనే! అదంతా పాత కథలా ఉంటుంది. చిన్నతనంలో తెలియక ప్రేమంటే ఏమిటో అనుకుంటాము. అది మన వెనకాల తిరిగే ప్రతి యువకుడిలోనూ ఉందనుకుంటాం. కాని, అది ఎంతో పవిత్రమైనదనీ, గుప్త ధనంలాటిదనీ, హృదయేశ్వరుడికి మనం సమర్పించుకొనే భావ నవనీతమనీ, పెళ్ళయ్యాకభర్తతోకాపురంచేసినప్పుడేతెలుస్తుంది."

"భర్త కూడా ఒక మనిషే సుమా! నువ్వు ఆయన్ని దేవునిలా చిత్రించడం మేం సహించలేం" అంది సావిత్రి, ఆమె నెత్తిపొడుస్తూ.


"కావచ్చు. కాని నీ పెళ్ళయ్యాక నువ్వూ ఆ విషయం ఒప్పుకుంటావు" అంది శ్యామల.

అటు సంగీతం, ఇటు వీరి మాటలూ, చుట్టూ తనను వేయి కళ్ళతో చూస్తున్న యువక బృందం శ్రీదేవి హృదయంలో కొత్త భావాలను మేల్కొల్పాయి. శ్యామల మొహం చూసిన వారెవరైనా, ఆమె ఏదో ఒక స్వప్న ప్రపంచంలో విహరిస్తూ, తన్మయత్వం చెందుతున్నట్లు కనిపిస్తుంది. ఆ ఆనందం తనకు కూడా లభిస్తే బాగుండునన్నట్నుంది, సావిత్రికీ, శ్రీదేవికీ. ఆ భావనా ప్రపంచం ఎలా ఉంటుందో కూడా ఎరుగని శ్రీదేవి తనకు ఆ అనుభవం కొంచెమైనా తెలిస్తే బాగుండునని అనిపించి, అది ఎలా సాధ్యమా అని ఆలోచించసాగింది.

"ఈ అమ్మాయి వాద్యంకన్నా, నీ వాద్యం ఎంతో బాగుంటుంది" అనే సుభద్రమ్మ మాటతో, ఆమె మామూలు లోకంలోకి వచ్చింది. ఆ మాట విని, శ్యామలా, సావిత్రీ వెనక్కి తిరిగి చూశారు.

"ఎందుచేతో మా మేస్టారు, మరి, తెగ పొగిడి చెప్పారు" అంది శ్రీదేవి, సుభద్రమ్మతో.

"ఆఁ! ఏముంది, కాలేజీలో చదువుకుంటున్న



అమ్మాయి వీణ కూడా వాయిస్తుందంటే అదొక గొప్ప!" అంది సుభద్రమ్మ.

శ్యామలా, సావిత్రీ, తమలో తాము శ్రీదేవి చాలా అందంగా ఉందనీ, అందమేకాక, ఆమెకు సంగీతం రావడం చాలా విశేషమనీ అనుకున్నారు. సావిత్రిది చాలా చొరవగల స్వభావం. అందువల్ల, ఆమె "మీరు వీణ వాయిస్తారా?" అని శ్రీదేవి నడిగింది. శ్రీదేవి అవునంది. సుభద్రమ్మ, "చాలా, అద్భుతంగా వాయిస్తుంది" అని చెప్పింది. శ్యామలా, సావిత్రీ కూడా "అలాగా?" అన్నారు

"మీరు ఎవరిదగ్గర నేర్చుకుంటున్నారు?" అని శ్యామల అడిగింది.

"జగన్నాథంగారివద్ద" అని శ్రీదేవి జవాబిచ్చింది.

"అహ! నేనూ ఆయన దగ్గర ఫిడేలు నేర్చుకుంటున్నాను. బహుశా మీరు ప్లీడరు విశ్వేశ్వరరావుగారి మనవరాలై యుంటారు."

"అవును" అని జవాబిచ్చింది శ్రీదేవి.

"మీ వాయిద్యం బాగుంటుందని మేస్టారు చెప్పారు. ఎన్నో రోజులనుంచి, మీ వాయిద్యం విందామని ఉంది."

"మా ఇంటికి ఒకసారి రండి" అని ఆహ్వానించింది శ్రీదేవి.

"నేను కూడా వస్తాను. మే మిద్దరం కలిసి వస్తాము" అంది సావిత్రి.

తరువాత శ్యామలా, సావిత్రీ తమలో తాము మాటాడుకోవడం మానేసి, సంగీతం గురించీ, పరస్పర అభిరుచుల గురించీ మాట్లాడ నారంభించారు శ్యామల, రాజమండ్రిలో బాగా పేరొందిన డాక్టరు విశ్వనాథ్ కూతురు. సావిత్రి తండ్రి ఒక వ్యాపారస్తుడు. ఆయన పేరు రామస్వామి.

ఆ రోజు దేవిక వాద్యం అంత బాగులేదనీ, అష్టపది మాత్రమే బాగా వాయించిందనీ వాళ్లనుకున్నారు. పాటకచ్చేరీ పూర్తయింతరువాత ఇళ్లకు వెళ్ళబోయే వరకూ శ్రీదేవీ, శ్యామలా, సావిత్రీ ఏదో మాట్లాడుతూనే ఉన్నారు. పరస్పరం సదభిప్రాయం కలిగింది వారిలో వారికి. వారు తమ ఇళ్లకు రమ్మని శ్రీదేవిని ఆహ్వానించారు.

ప్రిన్సిపాలుగారు దేవికను చాలా పొగిడి, ఒక రజితపాత్రను బహూకరించారు. కాలేజీ విద్యార్థులు తమ ఉత్సాహాన్నీ ఆనందాన్నీ ప్రకటిస్తూ, దేవిక నభినందించారు. సభ ముగిసి అందరూ ఇళ్లకు బయల్దేరారు.

సుభద్రమ్మ శ్రీదేవిని ఆమె ఇంటివద్ద దిగబెట్టి, తను తమ ఇంటికి వెళ్ళిపోయింది పిల్లలతో.

ఉత్సాహ తరంగాలపై తేలియాడుతూ శ్రీదేవి తమ ఇంట్లో ప్రవేశించేసరికి అనసూయమ్మ, జయమ్మ పెద్దగా కేకలేసుకోవడం విన్పించింది. అప్పుడప్పుడు జయమ్మ చిన్న చిన్న విషయాలను పట్టించుకొని, అనసూయమ్మను కేకలేసినట్టు మాట్లాడడమూ, దానికి అనసూయమ్మ తిరిగి కఠినంగా జవాబివ్వడం, దాంతో వా రిద్దరిమధ్యా చిలికి, చిలికి ఒక పెద్ద గాలి—వానవడం జరుగుతూండేది. అటువంటి తగువులలో శ్రీదేవి ఎవరినీ సమాధాన పరచలేక బాధపడేది. జయమ్మ, అనసూయమ్మకి నిర్లక్ష్యం హెచ్చనీ, పెద్దవాళ్లంటే గౌరవంలేదనీ, తనన్నా, దుర్గాప్రసాదన్నా, బొత్తిగా ఖాతరు చెయ్యదనీ, అందుకే దుర్గాప్రసాద్ ఆమె నలా శిక్షిస్తున్నాడనీ అనేది. అనసూయమ్మ, జయమ్మే దుర్గాప్రసాదుని చెడగొట్టిందనీ, ఆమె పెంపకం లేకపోతే, అతను ఎంతో బాగా ఉండే వాడనీ, తనమీద జయమ్మకు కక్ష ఉండడంచేత, అది సాధించుకోడానికి దుర్గాప్రసాద్‌ని రెచ్చగొట్టి, అతనిచేత తనని హింసింపజేస్తోందనీ అనేది. వీరిద్దరిలో ఎవరిని ఊరుకోబెట్టాలని ప్రయత్నించినా, వాళ్ళు ముందు తనమీద విరుచుకుపడతారని శ్రీదేవికి తెలుసు. అందుచేత వాళ్ల తగువులో తనేమాత్రం కలుగజేసుకోకుండా తిన్నగా మేడమీదికి వెళ్ళిపోయింది.

బట్టలు మార్చుకుంటూంటే, ఆమెలో మొట్ట మొదటిసారి—ఈ ఇల్లన్నా, ఈ ఇంట్లోని జీవితమన్నా—ఒక రకమైన అసహ్యభావం కలిగింది. ఈ ఇంట్లోని వ్యక్తులందరిమీదా ఆమెకు కోపం వచ్చింది. ఏం మనుషులు వీళ్ళు! డబ్బుంది. గౌరవం ఉంది. సుఖపడడానికి కావలసిన జీవితావసరాలన్నీ ఉండీ కూడా తాము సుఖాన్ననుభవించలేరు. ఇతరులు అనుభవించడానికి ఇష్టపడరు. ప్రతివాళ్లకూ వాళ్ల పంతాలే ముఖ్యం. ప్రపంచంలో తమ విషయం తప్ప, మరొక విషయమేమీ వారి కక్కరలేదు. వీళ్ళను ఆదర్శంగా తీసుకోవడం శుద్ధ తెలివితక్కువ అనిపించింది శ్రీదేవికి. బయట ప్రపంచంలోఉన్న స్వేచ్ఛా, ఆనందం, ఉత్సాహం వీళ్లలో వెతికి చూసినా కన్పించవు.

* * *

గెడ్డాలూ, మీసాలూ పెరిగిపోయి వస్తున్నాడు పరంధామయ్య. మాంచి సిల్కు చొక్కా తొడుకుని రంజుగా మూడైదుల టిన్నుతో వెళ్లుతున్నాడు ఆసామీ. పరంధామయ్య: ఓయ్! ఆసామీ ఎక్కడికి? ఆసామీ: ఫిలిమూ తియ్యడానికిగాని నీ దుంప తెగా యిలా 'ఆమ్యాన్' ఎక్కడిన్నొంచి? పరంధామయ్య: సినీమా తీసి వస్తున్నానయ్యా.

రాజశ్రీ (ఉదయగిరి)

* * *

రాత్రి భోజనంచేసి, పక్కమీద పడుకొని, శ్రీదేవి ఆ రోజు సాయంకాలం శ్యామలా, సావిత్రీ మాట్లాడుకున్న మాటలు నెమరువేసుకుంది. స్త్రీయొక్క జీవితంలో పెళ్లి, భర్త అనురాగం అవేవి ఎంత వాంఛనీయమో, ఎంత సౌఖ్యప్రదమో ఆమెకు తెలియ నారంభించింది. ఆయన తన నొక దేవతలా చూసుకొంటారని ఎంత గర్వంగా చెప్పింది శ్యామల! అలా చెప్పుకొనే మధురక్షణం తన జీవితంలో ఎప్పుడు వస్తుందా! అని ఏ స్త్రీ ఎదురు చూడదు? సావిత్రి ఆ అనుభవం గురించి తరచి తరచి అడుగుతూంటే, శ్యామల బుగ్గలు ఎర్రవారి, ముఖం ఎంత అందంగా మారింది! అప్పుడు శ్యామల ఏం చెబుతుందోనని శ్రీదేవి గుండె కొట్టుకుపోయింది. ఎందుచేతో ఆ విషయం శ్యామల చెప్పకుండా ఉంటేనే మంచిదని పించింది శ్రీదేవికి! అసలు ఆ సంభాషణ తన శరీరంలో కల్గించే ఏదో బాధను, నిద్రపోతున్న స్వభావాన్ని మేల్కొల్పుతూ, తను భరించలేదేమోనని పిస్తోంది. సావిత్రికి ఆతృత ఉండడం సహజం. తమకు కలగబోయే అనుభవం గురించి, తమకన్నా ముందుగా ఆ అనుభవం పొందిన వ్యక్తిని అడగడం ప్రతి వ్యక్తియొక్క స్వభావమే. అందులో ముఖ్య స్నేహితురాలిని అడగకుండా ఎలా ఉంటుంది? తనకే గనక శ్యామలతో పరిచయముంటే, తను ఆ వివరాలన్నీ చెప్పేదాకా ఊరుకునేదేకాదు! ఎలాగైనా శ్యామలతో గట్టి స్నేహం చెయ్యాలి.

శ్రీదేవికి ఆ విద్యార్థుల సమూహం జ్ఞాపకమొచ్చింది. వాళ్ళు తన అందాన్ని మెచ్చుకుంటూ తన వైపు చూసిన చూపులూ, వారి ఉత్సాహ చేష్టలూ అల్లర్లూ, మాటలూ జ్ఞాపక మొచ్చాయి. అందులో ఒక పదిమంది యువకులదాకా శ్రీదేవి మనసులో ఏదో ఒక ప్రత్యేకత సంపాదించారు. వారిలో ఏ ఒక్కరితోనైనా, సరదాగా మాట్లాడడానికి శ్రీదేవి కభ్యంతరం లేదనిపించింది. నిజంగా అటువంటి ఒక యువకుడి స్నేహాన్ని సంపాదిస్తే ఎలాగుంటుందో? తనని మగవాళ్లంటే, అసహ్యించుకొనేటట్లూ, భయపడేటట్లూ తన తల్లీ, అమ్మమ్మ పెంచారు. మగవారితో మాట్లాడడమే తప్పు! వారి ఉద్దేశంలో. మరి ఆ— ఆచారి అనే అబ్బాయి, శ్యామలకు ప్రేమలేఖలు రాయడం, శ్యామల వాటికి జవాబివ్వడం—ఇవన్నీ తప్పుకాదా? తప్పయితే మరి శ్యామల ఆ పని ఎందుకు చేస్తుంది? మళ్లీ హాయిగా పెళ్ళి చేసుకొని భర్తనెంతో ఆరాధిస్తోందే! స్త్రీలు, ఒక హద్దులో తమ ప్రవర్తనసుంచుకొని పురుషులతో తిరిగితే తప్పులేదు కాబోలు! నిజమే. ప్రతి స్త్రీకి కొంత అటువంటి అవకాశం ఉండాలి. అంతలో వాళ్ళు చెడిపోతారనీ, వారి నెవరూ పెళ్లి చేసుకోరనీ, పెద్దవాళ్ళు భయపడకూడదు. కాలేజీలో అలా యువతీ యువకులు కలిసి మెలిసి తిరగడానికి ఎన్నో అవకాశాలుంటాయి. ఆ జీవితం ఎంత బాగుంటుంది! శ్యామల చాలా అదృష్టవంతురాలు. అటు కాలేజీ జీవితంలో ఆచారిలాంటి స్నేహితుణ్ణి సంపాదించింది. ఇటు, తనను దేవతలా చూసుకునే భర్తను పొందింది. స్త్రీకి, తన సర్వస్వం అర్పించడానికి భర్త కావాలి. కాని, ఆమె అందరిలో తిరుగుతూ, అందరి ప్రశంసలనూ పొందాలి.

భవిష్యత్తు గురించి ఏవో కలలు కంటూ శ్రీదేవి నిద్రపోయింది. ఆమెది సహజంగా భావావేశంగల స్వభావం. ఇంట్లో తల్లీ, అమ్మమ్మా, ఆమె నొక జడ— ప్రకృతిగల వ్యక్తిగా తయారు చేయాలని ప్రయత్నించారు — తమకు తెలియకుండానే—కాని, ఆమె సహజ ప్రకృతి చాలా చురుకైనది. ఆమెలో చాలా తెలివి తేటలున్నాయి ఊహ ద్వారా ప్రపంచాన్ని అర్థం చేసుకోగల శక్తి ఆమెకుంది. అవన్నీ ఇన్నాళ్లూ ఆమెలో అణిగి ఉన్నాయి. బాహ్య ప్రపంచపు స్వేచ్ఛా వాయువు సోకగానే అవి ఒక్కసారి విజృంభించసాగాయి. ఇన్నాళ్ళూ, ఆమె నణచి ఉంచకపోతే, అవి అంత ఎదురు తిరగ నవసరంలేదు కాని, ఆమె గృహ వాతావరణం, త[illegible] శక్తులను మరింత విజృంభింపచేసింది (సశేషం)



ధన్యవాదాలు — నేను కూడా సిజర్సు మాత్రమే కాలుస్తాను



ఈ యిద్దరేకాదు — ఏభై సంవత్సరములకు పైగా పల్లె పల్లెలలోనూ వాడ వాడలలోనూ దేశమంతటా అనేక తరహాల వేలాది ప్రజలు 'సిజర్సు' సిగరెట్టును కాల్చి కొనియాడుచున్నారు. దినదినాభివృద్ధి చెందుచున్న దాని వాడకమే 'సిజర్సు' యొక్క విలువకు తార్కాణము. 'సిజర్సు' నాణ్యమైన సిగరెట్టు — దాని రుచి మరచి పోరానిది— దాని సువాసన అద్భుతము. చలికాలమైనా. వేసవి కాలమైనా. వర్షాకాలమైనా సరే 'సిజర్సు' ఎల్లవేళలయందును సంతృప్తి పరచును.

పన్నీరు - కన్నీరు

23 వ పేజీ తరువాయి

గార్ని పిలిచి ఒడుక్కి ముహూర్తం పెట్టమన్నారు.

లక్ష్మమ్మగారి హడావిడి చెప్పలేం. లక్షవత్తుల నోములు, హరికథలు, పురాణాలు, ఆచారాలు, మర్యాదలు, ఇల్లంతా పురోహితులు, హరిదాసులు, ముత్తైదువలతోనిండేది. సీతమ్మగారు కూడా వెనకాలె సంబరపడుతూ, అత్తగారికి సాయం చేసేది గోజా ఇంట్లో ఎన్ని వరసల విస్తళ్ళు లేచేవో ఎవరికీ లెక్క ఉండేదికాదు.

హడావిడిలో హడావిడి పెద్ద బొమ్మగారు పోడం. ఆవిడ కర్మలు కూడా సౌరారు మని చేయించారు సూరపరాజుగారు.

6

హోరాహోరలు

నరసింహంగారు పుంజుకున్నారు. మనుష్యుల్లో పడ్డాడు పూర్తిగాను. ఊరి పురోహితుడు పెరిగి వయసు దాచుకోవల్సివస్తూన్న కూతుర్ని నరసింహం గారి కిచ్చి పెళ్ళి చేశాడు; సూరపరాజుగారిచేత చెప్పి ఒప్పించి వయసువార కొంచెం ఎక్కువే అయినా, స్ఫురద్రూపి, బాగా చదువుకున్నావాడూ అనే సంబరంతో. తనకి కాకుండా పోయిన వేద పాఠాలు తన అల్లుడికి గదా అని సంతోషించాడు.

నరసింహంగారి రాకతో ఊళ్ళో పుట్టిన పురుగు మెల్లిగా దొలచడం మానలేదు. అంతవరకూ కలిసి కట్టుగా నడుస్తూన్న పెద్దల్లో స్పర్థ ఎప్పుడైతే కలిగిందో, అది దైనందిన చర్యల్లో అనేక అనుమానాలకు దారితీసింది. గ్రామీణ జీవితంలో ఈ పురుగు పుట్టకుండానే ఉండాలి గాని, పుడితే దీన్ని హరింపజేసే క్రిమిసంహారిణిని ఏ శాస్త్రం ఇంతవరకూ కనుక్కోలేదు. అందులో కలిమి పెరుగుతూన్న గ్రామంలో చెప్పనక్కర్లేదు. ఎవరిమటుకు వాళ్ళు నా యంతటివాడులేడు; మిగిలినవాళ్ళు నాకు అనుగుణంగా నడుచుకోవాలనుకుంటాడు. పైగా దీంట్లో మతం, కులం, శాఖా విభేదాలు చోరబడ్డాయంటే అసలు పైసలు. అయితే సిరిపాలెం వ్యవహారంలో తమాషా ఏమిటంటే స్పర్ధ రావడానికి్కారణం బహు స్వల్పమైనదీ, అప్పుడే మర్చిపోవడానికి వీలయినదీను. సూరపరాజుగారిదీ, సూర్యనారాయణగారిదీ కులం, శాఖ అన్నీ ఒకటే. ఎక్కణ్ణించో వచ్చిన వైదీక పాడు మనకంటే ఈయన కెక్కువయ్యాడనే కించిత్ క్రోధకారణం కరణంగారికి. దీనికి కొన్ని పరిస్థితులు తోడయ్యాయి.

సుబ్బారావు చిన్నతనంనించీ అతిగారాబంగా పెరుగుతూ వచ్చాడు. తండ్రికి ఊళ్ళోఉన్న పలుకుబడీ, పెరుగుతున్న ఆదాయం, ప్రథమ సంతానమవడంవల్ల రాజ వైభవంగా జరిగేది. పిల్లలందర్నీ పువ్వుల్లో పెట్టి పెంచుతూన్న సూరపరాజుగారు ఇతడంటే మొదట్నుంచీ మరీ విపరీత అభిమానం చూపేవారు. సీతమ్మగారక్కడికీ అప్పుడప్పుడు కుర్రాణ్ణి పాడుచేస్తున్నారండీ, అతిగారం చేసి అనేది. ఆయనో "వాడికేమీ మహారాజబిడ్డ" అనేవారు. బడికి వెళ్ళి చదివితే ఎక్కడ అరిగిపోతాడోనని భయపడేవారు. అయినా అలాగే నరసింహంగారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చెప్పేవారు. కొంచెం వయసొచ్చాక కొంచెం దూరంలోఉన్న పెరుగూరి స్కూలికి పంప

పన్నీరు - కన్నీరు

డం తప్పనిసరయింది. కొన్నాళ్ళు రెండెడ్లబండిమీద పంపేవారు. తరవాత కొనిచ్చారు సైకిలొకటి.

సుబ్బారావుకి సహజంగానే ఆటలు, సరదాలులంటే ఎక్కువ ఉత్సాహం; చదువంటే కొంచెం బెరుగ్గాను ఉండేది. అలాగే కష్టపడి మెల్లిగా మెట్రిక్యులేషనుకు వచ్చాడు. ఆ గట్టుమాత్రం దాటలేక పోయాడు. ఆ రోజుల్లో మెట్రిక్యులేషన్ దాటి పైకి చదివే వాళ్ళు బహుకొద్దిమంది ఉండేవారు. సూరపరాజు గారుకూడ "ఇక చాల్లే నాయనా. ఇంతకన్న పై ఊళ్ళకెళ్ళి, నానాగడ్డీ కరిచి చదవాల్సిన ఖర్మ నీకేం పట్టింది. హాయిగా కాలుమీద కాలేసుకుని ఇంట్లో ఉండు" అన్నారు.

సుబ్బారావుకి చిన్నప్పట్నించే తండ్రంటే ఎంత గారాం చేసినా, కొంచెం భయం. నరసింహంగారంటే కొంచెం భక్తి గౌరవం ఉండేవి. ఇంక మిగిలినవాళ్ళని బ్రహ్మదేవుడైనా సరే లెక్కజేసేవాడుకాదు. ముఖం మెప్పు గుణం సహించలేక పోయేవాడు. ఊళ్లో పెద్దల్నయినా సరే ఒక్కొక్కప్పుడు తీసిపారేసినట్లు మాట్లాడేవాడు. వాళ్ల ప్రవర్తన ఏ విషయంలోనేనా నచ్చకపోతే — ఎదుటివాణ్ణిగురించిన అభిప్రాయం లోపల దాచుకుని, పైకి నవ్వుతూ మాట్లాడే నాగరిక స్వభావం అతనికి అలవాటు కాలేదు; పట్నం వెళ్లి చదువుకోనొచ్చినామా. సుబ్బారావు స్వభావం ఈ విధంగా సూరపరాజుగారి కుటుంబంమీద ఊళ్లో కొంత ద్వేషభావం పెరగడానికి కారణమయింది.

చిన్నప్పట్నించీ సుబ్బారావుకి సూర్యనారాయణగారమ్మాయి నిద్దామనుకునేవారు. మొదట్లో ఆ సంబంధం అంటే మోజుపడిన సుబ్బారావు కొంచెం పట్నం ప్రభావం చవి చూశాక వెనుదీయడం మొదలెట్టాడు. ఇంతలో ఆ రోజుల్లో మంచి జోరులో ఉండే ఒక తాసిల్దారుగారు, పిల్లనిస్తామని కబురెట్టారు. సుబ్బారావు ఆ సంబంధానికి ఇష్టపడ్డాడు. కొడుక్కి వ్యతిరేకంగ వెళ్లటం ఇష్టం లేక సూరపరాజుగారు ఎప్పుడో అనుకున్నమాట కోసం ఎక్కువ పట్టుపట్టలేదు. పైగా ఆఫీసరుతో సంబంధం ఆయన్నాకర్షించింది. కరణంగారి ఈర్ష్య అప్పటికే కొంచెం రుచి చూడ్డంవల్ల ఆయనతో సంబంధానికి అంత కోరికగూడా మిగల్లేదు ఆయనలో. కరణంగారికి సూరపరాజుగారి వైఖరి అగ్గిమీద గుగ్గిలమైంది; ముఖాముఖి అడిగినా ప్రయోజనం లేకపోయేటప్పటికి.

7

నిత్యకల్యాణం — పచ్చతోరణం

సూరపరాజుగారి కొడుకు పెళ్లంటే ఆ ఊరందరికి ఇంట్లో పెళ్లిలాగే; అందులో అవతల తాసిల్దారుగారితో సంబంధం. సూరపరాజుగారుకూడా మంచి పట్నం పుచ్చుకుంటున్నాము; ఆఫీసర్లతో వియ్యమందుతున్నాము; పెళ్లి హుషారుగా జరగాలనుకున్నారు. ఆరోజుల్లో బ్రాహ్మళ్లిళ్లల్లో వెయ్యినూట పదహార్లు చాలా పెద్దకట్నాల్లో లెక్కగా ఉండేది. పుచ్చుకున్న కట్నంలో సాధ్యమైనంత పెళ్లిఖర్చులు పెళ్ళవారు ఇచ్చేవారు సాధారణంగాను. సూరపరాజుగారి

తరహాసేరు. ఆయన దర్జాకోసమే కట్నం తీసుకున్నారు కొడుకుపెళ్లికి. పుచ్చుకున కట్నమంతా పిల్లకి నగలకీ, మంగళహారతి పళ్లానికీ పెట్టేశారు. ఇంకా కొంత ఆయన చేద్దే పడింది. పెళ్లికొడుకు బట్టలు బాబాయిగార్ని మెద్రాసు పంపించి తెప్పించారు; ఇంకా ఏవో పెళ్లికి కావలసిన సరుకులతోబాటు. అసలు ఖరీదుకి రెండింతలు కమీషను తీసుకుని తెచ్చాడాయన.

"నేను రైలు దిగ్గానే ఎవడో పల్లెటూరి రైతు వచ్చాడని వాళ్లంతా అరవంలో గొడవ మొద లెట్టారు. నన్ను బోల్తాకొట్టిద్దామని మహ చూశారు. నేను వాళ్లకి లొంగే ఘటాన్నా ? బజార్లో ప్రతి దానికి గంటసేపు బేరమాడి, వాళ్లుచెప్పినదానికి సాలికి తగ్గించి మరీ కొన్నాను. అబ్బ! మెద్రాసు వచ్చి మోసం. వాబోటిగాడు అయితే నెగ్గుకు రాగలడు కాని, అబ్బే! మన సూరపరాజునే పంపితే, ఇంతకి నాలు గింతలు ఖర్చుపెట్టి నాసి రకం సరకు తీసుకొచ్చే వాడు." అన్నాడు. అందరూకూడా ఆయున్ని తెగ మెచ్చుకున్నారు. లక్ష్మమ్మగారు మాత్రం "ఏమాత్రం మిగుల్చుకున్నావేమిటి?" అనేసింది పుసుక్కున ఉండ బట్టలేక; విపరీతమైన ధరలు అనిపించి. "అదేమి టమ్మా! నీ మనవడి పెళ్లికోసం నే నింత కష్టపడి తేనూ" అని మళ్లీ ఆ విడక్కనపడకుండా మొహ మ్ముడుచుకుని వెళ్లిపోయాడు.

పెళ్లికి ఇంటికి వచ్చిన చుట్టాల్లో ముత్తయిదు లందరికీ బట్టలు పెట్టాలంది సీతమ్మగారు. "చాలా ఏళ్లతరవాత ఇప్పటికిగదా మన ఇంట్లో పెద్ద శుభకార్యం" అంది. ఇదికాక వచ్చిన చుట్టాల్ని, ఊళ్లో వాళ్లని తర్లి తీసుకువెళ్లడం, వెనక్కి తీసుకురావడం ఖర్చులు సూరపరాజుగారివే. ఊళ్లో మూడొం తులు జనాభా పెళ్లికి తర్లి వెళ్లారు. వారంరోజులు ఆడపెళ్లి వారింట్లో నైతేనేం, మగపెళ్లివారింట్లో నైతేనేం భోజనాలు. ఊళ్లో వాళ్లంతా పొయ్యిలు తప్పేశారు.

ఎక్కడ లేని ఖర్చు భోగం మేళానికీ, బాణసంచాకే అయింది. ఒకటో రకం మేళానికని సూరపరాజుగారు పెద్దాపురం పంపించారు. పెళ్లిళ్ల హడావిడి రోజులని వాళ్లు మామూలుకంటె రెండురెట్లు అడిగారు. పెళ్లిఇంట్లో పెళ్లి హడావిడి కంటె మేళం హడావిడి ఎక్కువై పోయింది. "ఆహా ! ఏమి హావభావాలు! ఏమి నాట్యాలు!" అనేవారు, సిల్కు లాల్చీలవారు, జరీ—పంచెలవారు, ఉత్తరీయాలవారు అందరూ పందిట్లోనే చేరేవారు. బాణసంచా కట్ట డానికి ప్రత్యేకం కాకినాడనించి ఇద్దరు బాగా తెలిసిన వాళ్లని తెప్పించారు. వందలు, వేల సంఖ్యతో మతా బాలు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు అనేక రకాలు కట్టించారు. ఒక్కొక్క తారాజువ్వ రంగురంగుల పువ్వులు జల్లుతూ ఆకాశాన్నంటేది. చిచ్చుబుడ్డి పెడితే తాడిఎత్తున పడేవి ముత్యాలు. ఊరంతా వెలుగుతో నిండిపోయేది.

వీళ్ల హడావిడి ఇలాఉంటే, అవతల తాసిల్దారు గారు పదిహేనేళ్ల ఉద్యోగంలో వెనకేసిన సొమ్మంతా పెళ్లికే ఖర్చుపెట్టాల్సొచ్చింది. పెళ్లికి దిగిన జనాభా విడిదికి మూడిళ్లు [illegible]. ఆయన దగ్గర పనిచేసే ఇన్స్పెక్టర్లు, గుమాస్తాలు, జవా నులు పదిమందీ పది విధాల సర్దుకున్నా, పెళ్లివారిని సంబాళించడం కష్టమై పోయింది. మరి వాళ్లకి సరిగా అన్ని తగలకుండా భోజనం అందలేదని సూరపరాజు గారి అప్పగారు అలిగింది. కాఫీసప్లై, ఆలస్యంగా లేచిన స్నేహితుడి కెవరికో రెండోసాటు రాలేదని కుర్రకారు కొంచెం బిగిశారు. ఇవన్నీ సర్దుకుని ఐదు రోజుల పెళ్లి అయేటప్పటికి తాసిల్దారుగారికి నడుం వంగిపోయింది.

ఈ హడావిడిలో సూరపరాజుగారి అక్కగారి కొడుకు, ఆయన అజాగ్రత్తగా పెట్టుకున్న సొమ్ము అయిదొందలు కాజేసి మేళానికొచ్చిన ఒకమ్మాయిని తీసుకుని మెద్రాసు పారిపోయాడు.

పెళ్లి బాగా అయింది. సూరపరాజుగారికిమాత్రం కొడుకుపెళ్లి ఐనాకూడా ఇదివరకటి అప్పుకి ఇంకో మూడువేలు కలిసింది.

ఆ ఇద్దరు సినిమాకు బయలు దేరారు. నువ్వు టిక్కెట్ లు తియ్యి అంటే నువ్వు అని అను కున్నారు. మొదటివాడు పర్సు మరిచిపోయానన్నాడు. రెండో వాడు డబ్బులు మరిచిపోయా నన్నాడు. ఇద్దరూ 'యిళ్ళ'కని బయల్దేరారు. కానీ, ఆశ్చర్యం! యిద్దరూ ఇంటర్ వెల్ లో కల్సు కున్నారు.

నిర్మలాదేవి (కాకినాడ)

రెండు మూడేళ్లు బాగా హుషారుగా గడిచి పోయాయి. పంటలు విపరీతంగా పండాయి. రెండువేలు అప్పు తీర్చారు. కొడుకూ, కోడలు నిశ్చిం తగా ఆనందంగా ఉన్నారు. ఒక మనవడు కలిగాడు సూరపరాజుగారికి. బారసాల వగైరా వేడుకలు ఘనంగా సాగాయి.

పెద్దమ్మాయికి మంచి సంబంధం కుదిరింది. మూడువేల కట్నం, వెయ్యిరూపాయిలు లాంఛనాలు. అప్పటికప్పుడే కట్నాల రేటు మునెన్నడూ లేనంత జోరుగా పెరుగుతోంది. అబ్బాయి ఎఫ్. ఏ. చదువు కున్నాడు; కొంచెం ఉన్నవాళ్లే. సూరపరాజుగారు ఎంత ఆదాయం వస్తున్నా, నిలవచెయ్యడం అంటూ ఎప్పుడూ లేదుకనుక, మామూలుగా అప్పిచ్చే షావు కారు నాగయ్య దగ్గరకే వెళ్లారు. అతను ఎదురుగా కాదనలేక చూస్తున్నాడు. వెనకటి అప్పు అయిదు వేలదాకా ఉంది. పరిస్థితులు మారుతున్నాయి. అందుకని సూరపరాజుగారు కనబడినప్పుడల్లా తన వ్యాపారం కొంచెం దెబ్బతినేటట్టుందనీ, ఎక్కువ ధరలో సరుకు కొన్నాక అంతవరకూ పెరుగుతూ వచ్చిన ధర ఒక్కసారిగా పడిపోయిందని అంటూ వచ్చాడు. ఇక లాభంలేదని సూరపరాజుగారు పట్నం వెళ్లి, భూమి తనఖా పెట్టి పదివేలు తీసుకువచ్చారు; బొత్తిగా అమ్మెయడం ఇష్టంలేక.

కూతురు పెళ్లి దర్జాగా చేశారు. మొగ పెళ్లి వారు ఇది కావాలి, అది కావాలి అని చెప్పి చేయించుకున్నారు. వాళ్లు అడగనివి కూడా వీళ్ల సరదాకొద్దీ వీళ్లు చేశారు. మొగ పెళ్లివారు మాత్రం కోడలికి బంగారం తక్కువ పెట్టి, వీళ్లకి జరపవలసిన ముచ్చట్లు దుడ్డుపెట్టి, కట్నంలోనే కొంచెం మిగిల్చారు. ఏమైనా, ఆ తాలూకాలో అంత ఘనంగా పెళ్లి ఎప్పుడూ జరగలేదని అందరూ చెప్పుకున్నారు.

8

కరి మింగిన వెలగపండు

మిగిలిన పిల్లలు పెరుగుతున్నారు. వాళ్ల చదు వులూ, సరదాలూ, ఖర్చులూ పెరుగుతున్నాయి. కూతురి పెళ్లవటంతో దానికి తగిన తరువాతి ఖర్చులు, ఆషాఢ పట్టీలు, పండగలకి రావడాలు, వేడుకలూ వగైరాలన్నీ యథావిధిగా సాగిపోతు న్నాయి. అయితే రెండుచోట్ల అప్పు గండమై కూచోగా, ఇంటిఖర్చులకే ఎక్కడలేని ఆదాయమూ చాలని పరిస్థితి వచ్చింది. ఇంట్లో ఎవరి మటుకు వాళ్లు డబ్బు లెక్కబెట్టి ప్రవర్తన దిద్దుకునే వాళ్లు కాదు. అందులో ఎవ్వరికీ, సుబ్బారావు దగ్గ ర్నించీ కూడా కొంచెం ఆర్థిక పరిస్థితుల్లో, కతరా లొచ్చిందని గ్రహింపే లేకపోయింది. పిల్లలకి చెప్పి, వాళ్ల మనస్సులు పాడుచెయ్యడ మెందుకని సూరపరాజుగారెప్పుడూ చెప్పనూ లేదు. కొందరు ముఖ్యంగా జీవితంలో చాలా భాగం సాఫీగా హాయిగా నిర్విచారంగా కాలం గడిపినవాళ్లు ఇటువంటి ఆర్థిక సమస్యలు కలిగితే, అవి అందరికీ తెలియడం పరువు తక్కువ అనుకుంటారు. ఇంట్లో కావలసిన వాళ్లకి తెలిస్తే వాళ్లు కూడా బాధపడ్డంకన్న ఏం చెయ్యగలరని వాళ్లకి తెలియనివ్వరు. మరి వాళ్ల చేతులు దాటిపోయి కొంపలు మునిగిపోయే పరి స్థితి వచ్చినప్పుడు అందరికీ అకస్మాత్తుగా తట్టుకో లేని దెబ్బ తగులుతుంది.

నరసింహంగారు ఊళ్లో కొంచెం పరువూ ప్రతిష్ఠ సంపాదించాడు. ముగ్గురు బిడ్డల తండ్రయ్యాడు. ఇద్దరు మగవాళ్లు; ఒక్కతే ఆడ పిల్ల. అమ్మాయి తండ్రిపోలిక; చాలా అదృష్ట వంతురా లనేవారు. నరసింహంగారికి కమలంటే అమిత అపురూపం. ఎక్కడికి వెళ్లినా ఆ అమ్మా యిని కూడా తీసుకుని వెళ్లేవారు. సూరపరాజుగా రింటికి తరుచుగా వెళ్లి పిచ్చాపాటీ మాట్లాడేవారు. సూరపరాజుగారు అప్పుడప్పుడు "అమ్మాయి చాలా చురుగ్గా ఉంది. మా మనవడి కియ్యండి" అనేవారు. అప్పటికి సుబ్బారావు మొదటి కొడుకు సూర్యానికి ఆరేళ్లో, ఏడేళ్లో. అప్పటివరకూ అక్కడ కూచుని ఆ పిల్లని ఆడిస్తూ సరదాగా ఉన్నవాడల్లా "పో, తాతా" అని విదిలించి పారి

పన్నీరు కన్నీరు

పోయేవాడు కాని అంత పసివాడికే లోపల ఏ మూలో ఏదో ఆనందం కలిగేది అలా అన్నప్పుడల్లా. ఒక్కొక్కరోజున నరసింహంగారు రాక పోయినా, లేక వాళ్లమ్మాయిని తీసుకురాకుండా వచ్చినా, తోచనట్లు కూచునేవాడు తాతగారు "మీ ఆవిడ రాలేదని అలిగా వేమిట్రా" అని ఎగ తాళి చేసేవారు.

నరసింహంగారికి ధనేషణ బొత్తిగా లేదు. కాని దర్జాలూ, సరదాలూ చిల్లర ఖర్చులూ వగైరా లేవీ లేవు జీవితం వెళ్లబుచ్చడానికి కనీసావసరాలు తప్పించి ఏమీ అక్కర్లేదు. పైగా భార్య మంచి జాగ్రత్తపరురాలు ఆవిడకి ప్రపంచంలో డబ్బుకున్న విలువ భాగా తెలుసు. అందుకని డబ్బు యావ లేని నరసింహంగారు మెల్లిమెల్లిగా స్థితి మంతుడు కావటం మొదలెట్టాడు అయితే ఆయన కెప్పుడూ తనపరిస్థితులు మారాయని కాని, తను ఊళ్లో పెద్దమనుషుల్లో జమగా తనూ ఒక ప్రత్యేక వ్యక్తిత్వం కలవాడిగా అయ్యాననిగాని, గమనింపే లేదు. ఏదో సూరపరాజుగారి మంచితనం మూలంగానే తను ఇంకా ఇక్కడ నిలవగలిగానని అనుకుంటూనే ఉండేవారు ఊళ్లో తిరిగి, పది మందితో లోకాభిరామాయణం ముచ్చటించి వార్తలి పోగుచేసే అలవాటు లేదు అందుకని సూరపరాజుగారి ఆర్థిక పరిస్థితులు రోజురోజుకీ విషమిస్తున్నాయని ఆయనకి తెలియలేదు ఏ ఇబ్బంది గురించేనా చూచాయగా అనుమానం వచ్చినా, ఏదో ఖర్చు మనుషులు అనుకునేవారు చిన్నచిన్న ఇబ్బందులకి తనబోటివాడు అలాంటి పెద్దమనుషులకి సహాయం చేయబూనడం వాళ్లకి అవమానకరంగా ఉంటుందని ఊరుకున్నారు.

వీళ్లిద్దరి స్నేహం మొదటినించీ కరణంగారి జట్టువాళ్లకి కంటకంగానే ఉంటూ వచ్చింది. అందుకని కొంతమంది సూరపరాజుగారి దగ్గర ఆయన హితం కోరినవాళ్లలా చేరి "నర సింహంగారు బోల్డు డబ్బు ఉంచుకుని, మీ కెక్కడ అడ్డుపడాల్సివస్తుందోనని భయంతో అలా ఏమీ లేనట్లు పాత బట్టలు కట్టుకుని తిరుగుతున్నా" డన్నారు. ఆయన నియోగపు దర్జా చూపించి, వాళ్ల మీద తాడెత్తున లేచేవారు. "ఎవరయ్యా మీకు చెప్పింది, నేను ఇబ్బందుల్లో ఉండి ఇంకోళ్ల సహాయం కోసం చూస్తున్నానని" అనేవారు

సూరపరాజుగారు కొడుక్కి ఆఫీసరు సంబంధం, కూతురికి పెద్దింటి సంబంధం వచ్చాక, గర్వం ఎక్కువై ఊళ్లో మోతుబరుల్ని లెక్కచెయ్యటం లేదని అనడం మొదలెట్టారు కరణం సూర్య నారాయణగారి అనుయాయులు. అంతవరకూ తటస్థంగా ఉన్న మున్సబుగారినీ, రాయుడుగారినీ తనవైపుకు తిప్పుకున్నాడు సూర్యనారాయణగారు. మెల్లిగా షావుకారు నాగయ్యని సిద్ధంచేశారు. సూరపరాజుగారు ఖర్చులు ఎక్కువై అప్పులు తీర్చలేరనీ, ఇక జాగ్రత్తపడటం మంచిదని [illegible]

(ఇంకావుంది)★

13 వ పేజీ తిరువాయి

అవకాశంగా తీసుకొని, వారి మనసులను మెరిపెట్టే రాక్షస ప్రకృతిని ప్రతివారూ విసర్జించి, వీలయినంత వరకు ఎదటివారికి తృప్తి, ఆనందమూ, శాంతీ యివ్వడమే జీవితాదర్శంగా పెట్టుకుంటే, మన క్షతుల వల్ల, శరీరం వ్యాధిగ్రస్తం కావడం తగ్గుతుంది.

సృష్టి ఏనాడు ఆరంభమైందో ఎవరికీ తెలియదు. కాని యీనాటివరకూ పుట్టిన ప్రతిజీవి గిట్టుతూనే ఉన్నది. జంతుప్రపంచంలో రోగనివారణకూ, ఆయుర్దాయం పొడిగించడానికీ ఏ ప్రయత్నాలు జరుగుతున్నవో మనకు తెలియదు. కాని, మానవకోటి, కారణాంతరాములచేత కలిగిన రోగ బాధలను నివారించుకొనటానికీ, ఎంతకాలం జీవించటానికి వీలుంటే అంతకాలం జీవించడానికీ ప్రయత్నిస్తూనే ఉన్నది ఆ ప్రయత్న ఫలితమే వైద్య శాస్త్రముః యోగశాస్త్రము. యోగశాస్త్రము ఇంచుమించుగా అంతరించిపోయింది ఇప్పుడిప్పుడే ఆ శాస్త్రంలో అభిరుచి ప్రారంభమైనది. కాని వైద్యశాస్త్రము-ముఖ్యంగా ఆధునిక వైద్యశాస్త్రం దినదినం విస్తరించిపోతున్నది. ఎన్నో అనివార్యములయిన రోగాలకు నివారకౌషధములు, నిరోధకౌషధములు శాస్త్రజ్ఞులు కనుక్కున్నారు అయినా, శరీరం వ్యాధిగ్రస్తము అవుతూనే ఉన్నది. అకాలంలోనూ, వృద్ధాప్యంలోనూ మనుషులు మృత్యువువాత పడుతూనే ఉన్నారు. కాని రోగకారణంను తెలుసుకోడానికై విపరీతమయిన, నిరంతరమైన కృషి జరుగుతున్నది

ఒకప్పుడు రోగము కేవలం శారీరికమే ననే విశ్వాసం పాశ్చాత్య వైద్యులో ఉండేది సోమా (Soma) అంటే శరీరం, సైకే (Psyche) అంటే మనసు, క్రమంగా వారు శరీరమును శాసించేది మెదడనీ, దానిని శాసించేది మనస్సనీ గ్రహించారు. ఈనాడు శరీరం అన్యోన్యాశ్రితములయిన మానసిక భౌతిక శరీరముల సమ్మేళనమని వారు గ్రహించారు అందువల కొన్ని రోగములకు మనస్థితి చాలా ప్రధానమనీ, మనఃస్థితినిబట్టి శరీరంలో జరిగే పనులు— ముఖ్యంగా స్పందనములు, కొన్ని కండరముల సంకోచ వ్యాకోచములు— మారుతూ ఉంటవని ప్రయోగరీత్యా నిర్ధారణ చేశారు. మనస్సు బుద్ధి, అనే విచక్షణ వారికింకా కలగలేదు మనస్సు బుద్ధి, అపేక్ష, ఉద్రేకములు, అన్నీ మెదడును ఆశ్రయించి ఉన్నవనే నేటివరకూ వారి భావన యోగాచార్యులయిన ప్రాచీన యోగులు శిరస్సునుంచి మూలస్థానమువరకు గల నరాశయమును ఏడు భాగములుగా విభజించి, అందులో బుద్ధికీ, మనస్సుకూ, స్థూల శరీరానికీ, సూక్ష్మశరీరానికీ, ఆధ్యాత్మిక శరీర ప్రభేదాలకూ ప్రహరీలు నిర్మించారు ఆ విషయం చర్చించడానికి కిది తరుణం కాదు.

(సశేషం.)

ఉచిత సలహా కోసం

(9 వ పేజీ తరువాయి)

యిలు సంగీతం సాధన చేసే సమయంలో)ఆ రేడియో మోగిస్తూండడమే ఆయన ఏకైక లక్ష్యం.

ఇక వెనుక ఇంటివారి విషయం ఆ ఇంట్లో 'ఆవిడ' గురించి అందరికీ బాగా తెలుసు కాని, 'ఆయన' గురించి అంత బాగా ఎవరికీ తెలియదు. ఆ ఇంట్లో ముఖ్యవ్యక్తి ఆవిడే! ఆ ఇంట్లోంచి కొట్టవచ్చినట్టుగా వినిపించే జోలపాటలు, మంగళ హారతులు, మేలు కొలుపులూ, తెలుగు సినిమా పాటలు—వీటన్నిటినీ బట్టి ఆవిడకి సంగీతమంటే 'ఇష్టం' పిచ్చిగా మారిందనే అనుకోవాలి ముఖ్యంగా చెప్పాల్సింది ఆవిడ కో 'పసిబిడ్డ' ఉన్న విషయం ఆ పసిబిడ్డే ఆమెకు సంగీతం అంటే ఉన్న అభిమానాన్ని ఇనుమడింప చేసిందని నా దృఢ విశ్వాసం. ఆ పసిబిడ్డ పూచిక పుల్లలా ఉన్నా, ఇంటి పైకప్పు ఎగిరిపోయేటట్లు 24 గంటల్లో ముప్పాతిక మూడువంతులు ఏడుస్తూనే ఉంటుంది ఆ పసిబిడ్డను ఊరుకోబెట్టడానికి ఈ మహా తల్లి జోలపాటలు పాడుతూ ఉంటుంది. జోలపాటలు పిల్లల్ని నిద్ర బుచ్చటానిగ్గాను ఏర్పడినవి కాని, ఈమె విషయంలోమాత్రం ఆ సిద్ధాంతం తల్లక్రిందులు చేసుకోవాలి మనం. ఒకవేళ పొరపాట్న ఆ పసిబిడ్డకు కునుకుపట్టినా, తల్లి పాడే జోలపాటలకు ఆ పట్టిన నిద్ర కాస్తా పటాపంచలయి ఆ బిడ్డ మేలుకుని కూచుంటుంది ఇహ అక్కణ్ణుంచి ఒక పక్కనుంచి తల్లి పాడే పాట, మరోవేపునుంచి బిడ్డ ఏడుపు! అలాంటి సందర్భాల్లో పక్కఇంటివాళ్ళ పరిస్థితి ఎలా ఉంటుందో చదువరుల ఊహ కందని విషయం కాదనుకుంటాను

ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలా అన్నదే నన్ను వేధించే సమస్య! వీటన్నిటికీ ఓర్చుకుని చేతులు ముడుచుకుని కూచోవడమా, లేక ఒక కిరసనాయిలు డబ్బా తెచ్చి, వాళ్ళు చేసేదానికి ప్రతీకార సూచకంగా నేనూ వాయిస్తూ కూచోడమా? లేకపోతే కండ బలం చూపించి వాళ్ళ నోరు మూయించడమా? ఏమిటి చేయడం?

ఇరుగు పొరుగు వాళ్ళతో స్నేహ సుహృద్భావాలు పెంపొందించుకొని— 'శాంతియుత సహజీవనం' చేయాలనే సదుద్దేశం కలవాళ్ళలో నే నొకణ్ణి! అంచేతనే మా ఇంటి పరిసరాల్లో ఏర్పడిన ఈ అవాంఛనీయమైన వాతావరణాన్ని శాంతి మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని నిశ్చయించుకున్నాను. ప్రశాంత వాతావరణం భంగపరిచి, ఒక్క నిమిషమైనా నిశ్చింతగా గడపడానికి వీల్లేని—పరిస్థితి ఉత్పన్నం కావడానికి వాళ్లెలా కారకులవుతున్నారో ఆ విషయం వారికే ప్రార్థనాపూర్వకమైన లేఖలు వ్రాసి, తెలియజేయాలని నిర్ణయించుకున్నాను నా నిర్ణయం ఆచరణలో పెట్టానని మీకు తెలియజేసేవే తుచ తప్పకుండా ఈ క్రింద పొందుపరుస్తున్న నా లేఖలు, వాటికి నాకు ఆ యా వ్యక్తులు ఇచ్చిన జవాబులు

* * *

ఆర్యా!

శాస్త్రీయ సంగీతమంటే విలువ లేకుండా పోతున్న ఈ రోజుల్లో ఇంకా అదంటే అభిమానం చూపే మీలాంటి వ్యక్తులుండడం ఆనందించాల్సిన విషయం. అందులోనూ చక్కగా పాడగల ఇద్దరు కుమార్తెలు ఉన్నందుకు మీరెంతో అదృష్టవంతులయ్యారు వారిలోని కళా నైపుణ్యం గమనించి, దానికి మెరుగులు దిద్దడానికై మీరు మీ అమ్మాయిలకు తగిన శిక్షణ ఇప్పించడం మెచ్చుకోదగిన విషయం కాని, ఒక్క సందేహం!

ఆ సంగీతం—టీచరు అమ్మాయిలచేత ఒకేసారి పాడించడంలో పెద్ద పొరపాటు చేస్తున్నదేమోనని, అన్నిటికంటే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే — మీ ఇద్దరమ్మాయిల కంఠస్వరాలూ ఒక దానితో ఒకటి కలవ్వు అనే విషయం ఆవిడ తెలుసుకోలేక ఆ కలిసి పాడించడమనే కార్యక్రమం ఇంకా కొనసాగించడం అయ్యో! ఇకనైనా ఈ రకమైన శిక్షణ మాన్పించండి తర్వాత ఇంకొక్క మనవి ఒక గది తలుపులు అన్నీ మూయించి, ఇకపై మీ అమ్మాయిల సంగీత శిక్షణ ఆ గదిలో ఏర్పాటు చేయించండి ఎంచేతనంటే అలాంటి ఏర్పాటు జరిగేటట్లయితే చుట్టుప్రక్కల ఉండే నాలాంటివాళ్లు కొంచెం ప్రశాంతంగా జీవించడానికి అవకాశం ఉంటుంది మరో చిన్న సలహా! గంటలకొద్దీ పాడించకుండా, 'శిక్షణ' కాలపరిమితి కూడ కొంచెం తగ్గిస్తే మీ అమ్మాయిల ఆరోగ్యానిక్కూడ కొంత మంచిది.

ఇట్లు,

'... .. .. '

* * *

పై ఉత్తరానికి ఎలాంటి జవాబు వచ్చిందో చూడండి—

మహాశయా!

మీ లేఖ అందింది నేనంటే మీకుగల సదభిప్రాయం వెలువర్చినందుకు కృతజ్ఞుణ్ణి! అమ్మాయిలను మీరు ప్రశంసించినందుకు వాళ్ళు మీకు 'థాంక్సు' చెప్పమన్నారు ఈ లైన్‌లో ఉత్తములుగా ప్రసిద్ధి గాంచినవారిచేతనే మా అమ్మాయిలకు 'శిక్షణ' ఇప్పిస్తున్నాను అలాంటివారిలోనే మీరు తప్పులెన్నుతున్నారంటే మీ సంగీత పరిజ్ఞానాన్ని మేము శంకించవల్సి వస్తోంది పైగా అలా అనడం వ్యక్తి దూషణ క్రిందికి వస్తుందనీ, వ్యక్తిదూషణ నేరమనీ, మీరు గమనించాలి. ఇకపోతే వాయుదిగ్బంధన గదిలో మా అమ్మాయిలకు పాఠాలు చెప్పించమనడంలో మీ ఉద్దేశం? ఊపిరాడక చావమనేనా? మీ సలహాలకు చాలా కృతజ్ఞత. ఇలాంటి సలహాలు ఇకపై ఇవ్వద్దని మనవి. ఇది కూడ వినండి ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏమాత్రం కూడా మార్పులు తీసుకురావడమనేది జరగబోదని మీరు గుర్తించాలి సెలవ్!

ఇట్లు,

'.. . ...'

* * *

ఎదురింటివారికి వ్రాసిన లేఖ!

డియర్ మిస్టర్!

విరామమనేది లేకుండా మీరు మీ రేడియో 'ఆన్' చేసి ఉంచుతున్నప్పటికీ, అది చెడిపోకుండా ఎప్పటిలాగే ఉన్నదీ అంటే అదేదో మంచి సరుకే అయ్యుండాలి తగినంత స్థాయిలో — ఇంట్లో ఉన్న నలుగురికి వినిపించేలాగ, 'వాల్యూమ్' తగ్గించి పెట్టుకున్నట్లయితే — 'రిసెప్షన్' బాగుంటుందని అందరికీ తెల్సిన విషయమే అలా వాల్యూమ్ తగ్గించి పెట్టుకున్నట్లయితే మీ రేడియో బాగానూ ఉంటుంది, నాలాంటివాళ్ళ చెవులు బద్దలవకుండానూఉంటాయి. సహృదయంతో నా బాధ అర్థం చేసుకోగలరని ఆశ!

ఇట్లు,

'.......... ....'

సంక్రాంతి శుభ సమయమున మా
హృదయపూర్వక అభినందనలు

సులభ వాయిదాలలో అద్దె కొనుగోలు
పద్ధతిలో రూ. 15/-కే


ప్రపంచ ప్రఖ్యాత రేడియో

"రాడార్"ను పొందండి

(జర్మన్ డిజైన్)

దీపావళి శుభ సమయంలో మా ప్రకటన చూచి వివరముల కొరకు వ్రాసిన వారందరకు మా అభినందనములు


చాలామంది మా సంస్థలో సభ్యులుగా చేరి సులభ వాయిదాలలో రేడియోను సంతృప్తిగాపొందగలిగారు. మీరుకూడా చేరి ఆకర్షణీయమైన, మన్నికైన, నమ్మకమైన, వినుటకురమ్యమైన మా రేడియోలను పొందండి.




రేడియో తరంగ ప్రతిధ్వనుల సహాయంతో, సముద్ర యాన, విమాన ప్రయాణ, ఖగోళశాస్త్ర పరిశోధనలలో విస్తృతంగా తోడ్పడి ప్రపంచ ఖ్యాతి గాంచిన పరికరము "రాడార్".

రేడియో డిటెక్షన్ అండ్ రేంజింగ్ లలో అగ్రస్థానం పొందిన 'రాడార్' రేడియోనే కొనండి


మాసమునకు రూ. 15/-లకే సులభ పద్ధతిలో పొందుటకు సంప్రదించండి




ఆర్ డి ఆర్ 60
3 బ్యాండ్సు, 6 వాల్వులు



మోడలు నెం టి ఆర్ 801బి
8 ట్రాన్సిస్టర్స్, 2 బ్యాండ్సు



ఆర్ డి ఆర్ 59ఎ
6 వాల్వులు, 5 బ్యాండ్సు



మోడలు ఆర్ డి ఆర్ 63
8 వాల్వులు, 8 బ్యాండులు,
3 స్పీకర్సు, 2 టోన్ కంట్రోల్స్

మార్స్ రేడియో సేల్స్ అండ్ సర్వీస్

రాష్ట్రపతి రోడ్ - సికింద్రాబాద్. ఫోన్ 73340

ఉచిత సలహా కోసం

పై లేఖకు వచ్చిన జవాబు చూడండి—

డియర్ ఔరంగజేబ్!

నా రేడియోను మీరు మెచ్చుకున్నారు ధన్యవాదాలు చెప్పాల్సిన అవసరం నాకేమీ కనపడ్డంలేదు ఎంచేతనంటే రు. 750 లు పెట్టికొన్న నా రేడియోను మేడమీద తలఉన్న వాడెవడైనా మెచ్చుకుంటాడు. అంత డబ్బు వెచ్చించి, మోజుపడి కొనుక్కున్న రేడియోను వినీ వినిపించకుండా మంద్ర స్థాయిలో, వాల్యూమ్ కంట్రోల్‌చేసి పెట్టుకో వల్సిన అవసరం, అగత్యం నా కున్నట్లుగా ఏమీ కనిపించడంలేదు. రేడియో బిగ్గరగా పెట్టుకుని దగ్గరగా కూచుని వినడం నా కలవాటు సంగీతం అలా వింటేనే కాని, నాకు విన్నట్టుండదు.

రేడియో పెట్టుకునే పద్ధతిలో మీరు చేసిన సూచనలు చూస్తే మీరు ఏ క్రీ పూ నాటి వ్యక్తి లాగానో కనపడుతున్నారు. సంగీతం అంటే మీకు ఇష్టంలేకపోతే అది కేవలం మీ దురదృష్టం. నేను సంగీతమంటే చెవి కోసుకుంటాను. కనుక నేను నా రేడియో పెట్టుకోక తప్పదు. అందువల్ల ఎవరికైనా బాధగా ఉంటే నే చేసేదేమీలేదు. కాబట్టి ఒకరి సూచనల ప్రకారం నా మామూలు అలవాట్లలో మార్పు తెచ్చుకోవడం జరగబోదని మరీ మరీ తెలియజేస్తున్నాను

ఇట్లు,

‘..................’

* * *

వెనక—ఇంటివారికి వ్రాసినది!

ఆర్యా!

మీ పాపాయి పుట్టినప్పటినుంచీ మీ శ్రీమతి కమ్మని కంఠంతో (!?) పాడే జోలపాటలు వినే అదృష్టం పట్టింది నాకు. ‘జోలపాటలు’ చిన్న పిల్లలు నిద్రపోయేందుకుగాను పాడతారని చిన్నప్పుడెప్పుడో విన్నాను. చిన్నపిల్లలు ఏడవకుండా చెయ్యటానిక్కూడా అవి ఉపయోగపడుతాయని ఇప్పుడర్థమైంది

కడుపులో ఏమన్నా బాధగా ఉంటే చిన్న పిల్లలు సాధారణంగా ఏడుస్తారు. అలాంటి బాధలు పిల్లలకు ఉంటే - ‘మందు’ - ఇస్తే తగ్గిపోతుంది. కనుక ఎల్లప్పుడూ ఏడ్చే మీ పాపకు—‘జోలపాటల’కు బదులు మందు ఏదైనా వాడమనీ, విన్నవాళ్ళకు తలనొప్పి పుట్టించే ఆ జోలపాటలు ఇకపై ఆపు చేయించమనీ సవినయంగా మనివి చేసుకుంటున్నాను. తప్పు లేమన్నా ఉంటే ఆగ్రహించకండి. మందు సంగతి మర్చిపోరుకదూ! ఉంటాను సెలవ్!

భవదీయు,


‘..................’

* * *

పై ఉత్తరానికి అందిన జవాబు—

ఆర్యపుత్రా!

మీ గోడు నా కర్థమయింది. మీరు చెప్పేదానికీ, మా, ఆవిడ వాళ్ళ అమ్మ, లమ్మమ్మలవద్ద నేర్చుకున్న విషయాలకూ ఎక్కడా పొసగటం లేదు జోల పాటల విషయంలో మీ అభిప్రాయాలతో నేను ఏకీభవిస్తున్నాను. మీరు ఇచ్చిన అమూల్యమైన సలహాలకు నా హృదయ పూర్వక అభివందనాలు. కాని, పాపాయి పోషణ బాధ్యత యావత్తూ మా ఆవిడ అధీనంలోనే ఉంది కనుక మీ రిచ్చిన సలహాల్లోనూ ఏ ఒక్కటి కూడ ఆచరణలో పెట్ట





వస్తోంది!
పద్మిని పిక్చర్స్ వారి
పెంపుడు కూతురు
నిర్మాత-దర్శకుడు :
బి.ఆర్.పంతులు
ఎన్.టి.రామారావు
హరనాథ్‌రాజు · రేలంగి
రమణారెడ్డి · బాలకృష్ణ · లంకాసత్యం
షావుకారు జానకి · దేవిక
మాలతి · రమాదేవి · అరుణశ్రీ
మాటలు : డి.వి.నరసరాజు
పాటలు : సి.నారాయణరెడ్డి · కొసరాజు · అనిసెట్టి
కెమెరా : వి.రామమూర్తి
సంగీతం : టి.జి.లింగప్ప
విజయ రిలీజ్...
S.H.RAO
VANAJA

ఉచిత సలహాకోసం

డానికి నా సాధ్యం కాదని చెప్పాల్సివచ్చినందుకు చాలా విచారిస్తున్నాను పాపాయి ఏడవటంవల్ల మీ ప్రశాంత జీవితానికి అంతరాయం కల్గుతున్నట్లు మీరు వ్రాసిన వాక్యాల్లో తేటతెల్లమౌతోంది మీకు ఇబ్బంది కలుగుతున్నందుకు నే నెంతగానో ఇదవు తున్నాను.

శిశు సంరక్షణ విషయంలోనూ—ముఖ్యంగా జోల పాటల విషయంలోనూ మీరు ఇచ్చిన సలహాలు ఆవిడతో చెప్పేసరికి 'భద్రకాళి' అవతారం ఎత్తి నంత పని చేసింది. ఇంకా నయం! మీరు వ్రాసిన ఉత్తరం ఆవిడ చేతుల్లో పడలేదు కనుక సరి పోయింది అలా జరిగి ఉంటేనా! ఇంతకీ మీ కాలం బాగుంది బైటపడిపోయారు. ఇహ ఎప్పుడూ అలాంటి ఉత్తరాలు వ్రాయబోకండి. అలా చేశారంటే మీ ఒంటి కేమంత మంచిదికాదు. ఫ్రెండ్స్‌గానే విడి పోదాం. బై! బై!

ఇట్లు,

'.........'

* * *

పరిస్థితి అంతవరకూ వచ్చాక—'మౌనం కలహం నాస్తి' అన్నట్లుగా పలక్కుండా ఉండడమే మేలని పించింది మర్నాటినుంచీ ఎప్పటి పరిస్థితులే!

అమ్మాయిల సంగీతం సాగిపోతోంది

రేడియో, వారితో పోటీ పడుతుంది

బిడ ఏడుపుతోపాటు తల్లి జోలపాటలా వినపడు తున్నాయి.

అన్నిటికీ సహించక తప్పదు మరి. ఇటు అద్దె తక్కువతో అన్ని వసతులూ ఉన్న ఇల్లా వదల్లేం, అటు ఇరుగు పొరుగు—వాళ్ళ పోరూ భరించలేం ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో తోచడంలేదు ఇదంతా చదివి, సహృదయులైన పాఠకు లెవరయినా ఉచిత సలహా ఇవ్వకపోతారా అన్న ఆశమాత్రం ఒక్కటి మిగిలిఉంది. ఆ ఆశతో మీ సలహాకోసం ఎదురు చూస్తున్నాను. ఎవరైనా పంపిస్తే, కృత జ్ఞత తెలుపుకోగలను. ★

హరివంశము
15-వ పేజీ తరువాయి

"అధి మహాబ్రాహ్మణ ! ధర్మమునందును రక్తి యట్టులుండవలెను" అని శ్రీ కృష్ణుడనెను గల్లున నవ్వెను. వేణువుపై మధుర సంగీత మేదియో మొరసినట్లు లది భాసించెను.

ఆచార్య సాందీపనియు నవ్వుకొనెను. ఇతడేదో విచిత్ర ధర్మవేత్త ! నాకు శిష్యుడయ్యెను ఇది నన్ను ఉద్ధరించుటకో! నే నతని కేమి గురువును ! యాదవులకు గురువులు తక్కువయి యీతడు నా వద్దకు వచ్చెనా ! మహాకాళనాధ ! ఇదియంతయు నీ దయ ! అనుకొనుచు నాయన గృహాభిముఖు డాయెను దారిలో చెట్లు; అవి విచిత్రముగా పూవులు పూసి, క్రొత్త పెండ్లికూతురు సొబగులు పోవు చున్నవి. సిగ్గుతో తలవాసి ఆకుల చాటున మరుగు చొచ్చుచున్నవి. ఆచార్యుడు పోవుచు తల ఎత్తి పూలను తిలకించెను. ఈ యందము శిప్రజలము లదా ! మహాకాళనాధుని వనస్థల సంజనితమా ! అను కొనెను. ముందునకు నడచెను. ఎవరో పుష్పాపచ యము చేయుచున్నట్లున్నారు ఎవ్వరై యుందురు! వారు కన్పించలేదు; వారి నవ్వులు వినిపించు చుండెను. వారెవరో తెలియలేదు గాని, వారి మాటలు వినిపించుచుండెను.

"వదినె !"

"ఊఁ !"

"మా అన్న బాగుగానుండెనా !"

ఒక కంఠమున ఆనందము, ఒక కంఠమున కించిద్విషాదముగా నున్నది ఆచార్య సాందీపని గుర్తు పట్టెను వారు వామాక్షియు, మిత్రవిందయు

మిత్రవింద యన్నది

"వదినె! మీ యన్న యందముగానున్న నాకేమి?

"మా అన్ననే అడిగెదను "

"అడుగుము. నాకు భయమనుకొన్నావా!"

"ఎట్లనుకొందును నీవు రాచకూతురువు. మా మా యన్న యువునా! మీవారు నిన్ను రాజులకుగాని ఈయరుగదా !"

మిత్రవింద యున్సురన్నది .

"వదినె ! నా జీవితము శిప్రపాలు చేసెదను అది యెంతమంది ప్రేమికులను తన పొట్టను బెట్టుకొనలేదు మా యింటి నెరుగుదువుగదా ! మా యన్నల పద్ధతి యొక్కటి, మా నాయనగారి పద్ధతి యొక్కటి అది యేమో ఆయనకే తెలియవలెను మా అమ్మ, వారి నడుమ నలిగిపోవు చున్నది "

"మరి నీవు ...."

"పామ్మానల "

"అదిగో ! రాచకూతురు లక్షణము మాటలలో గూడ పోనిచ్చితివికాదు "

ఇరువురును నవ్వుకొనిరి

ఆచార్య సాందీపనియు నవ్వుకొనెను.

రాచకూతురు దుఃఖము నెరిగెను

దూరమున గృహమునుండి ఆచార్యాణి పిలుపు వినవచ్చెను

"ఏమే ! పిల్లలు ! మధ్యాహ్నమగుచున్నది ఆచా ర్యుల కగ్నికార్యమునకు వేళయగుచున్నది మీరు పూలు తెచ్చుటమాత్రము కాలేదు "

ఆచార్యు డాకసము వంక చూచెను

నడిమింట సూర్యుడు గార్హపత్యాగ్నివలె

[ప్రకాశించెను] ★

రాజధాని కబుర్లు

7-వ పేజీ తరువాయి

తగిన చర్య తీసుకోబోతున్నారట. అంటే ఇప్పటి వరకు 58 అనవసర చర్యలు తీసుకుంటున్నారన్న మాట! ఇంకొక విషయం ఏమిటంటే ప్రమోషన్‌లో కూడా కమ్యూనల్ జి వో ను అమలు పరుస్తున్నారు ఉద్యోగాల్లో వెనకబడిన తరగతులకు ప్రత్యేకమైన సదుపాయాలు ఏర్పాటు చేశారు ఇంతవరకు బాగానే ఉంది ఇక ప్రమోషన్‌లో కూడా ఇది జొరపడేటప్పటికి, నిన్నటి క్లర్కు తన సూపరింటెండెంట్ మీద కొద్ది రోజులకే అధికారం చెలాయించే హోదాలోకి వచ్చేస్తున్నాడు దీనివలన తగిన అనుభవం పొందని ఉద్యోగస్తునికి పెద్ద పదవి ఇవ్వటం జరగటమే కాకుండా, ఎన్నాళ్ళనుంచో కష్ట నష్టాలకు, ఇతర అయిష్టాలకు ఓర్చుకుని, ఏదో పదవిలోకి ఏ సిఫార్సు లేకుండా క్రమబద్ధంగా వెళ్ళిపోదామనుకున్న ఉద్యోగస్తులకు పెద్ద దెబ్బ; అసూయా, అసహనాలు ఏర్పడటం, ఎంత చేసినా ఇంతేనని నిస్పృహ, మొదలయిన అనారోగ్యకరమైన వాతావరణం ఏర్పడటానికి అవకాశం ఎక్కువగా ఉంది అన్ని తరగతులవారికి సమాన అవకాశాలు ఇవ్వాలిసిందే! ఈ ఆదుర్దాలో అసలు పరిపాలనా వ్యవస్థే కుంటుపడేటట్టు ప్రవర్తిస్తే, సమాజానికి తీరని నష్టం దీనివలన కొన్ని తరగతులకు ప్రత్యేక సౌకర్యాలు ఇవ్వాలనే సిద్ధాంతానికి, ఆచరణకూ దెబ్బ తగలక మానదు.

ప్రమోషన్ విషయం అయిపోయింది! ఈ బెడదలో పడేదానికన్నా, స్వయంగా తా నేదో వృత్తి చేసుకుని బ్రతుకుదామని, ఉన్న స్థిరాస్తిని చరాస్తిగా మార్చేసి, వ్యాపారంలోకి దిగితే కంఠం లోతు పన్నులు పరిశ్రమో, దుకాణమో పెట్టుకుందామంటే దానికి కావలసిన దరఖాస్తులు పెట్టుకున్న దగ్గర్నుంచి ఎంతమంది చుట్టూ ఎన్నిసార్లు ప్రదక్షిణం చెయ్యాలో తెలీదు. ప్రాణం విసిగి, వేసారి, ఇంతకంటె ఇంట్లో కూర్చోవటం నయమనిపిస్తుంది ఈ లైసెన్సులకు అంతు కనబడదు. అందువలనే ఓ రాజకీయ విజ్ఞుడు ఈ ప్రభుత్వాన్ని, లైసెన్సు పర్మిట్ రాజ్ అని చమత్కరించాడు ఆ పర్మిట్ అనే మాటకు అర్థం అనంతంగా ఉంది ఈమధ్య ఓ ప్రముఖుడు కుటుంబ నియంత్రణం కూడా చట్టంలో బిగించెయ్యాలని సూచన చేశాడు ఇది కూడా చేసిఉంటే 'మన' తెలివి తేటలు పరాకాష్ఠ అందుకున్నాయని సంతోషించవచ్చు ఈ విధంగా అధికారాలన్నీ హస్తగతం చేసుకుని కేంద్రీకృతమై ప్రభుత్వం పరిపాలన సాగిస్తోంది ఇలాంటి పరిపాలనా యంత్రాంగానికి మూలస్తంభాలు సచివాలయ భవనాల్లోని ఆఫీసులు, వాటి తాలూకు అసంఖ్యాకమైన సిబ్బంది. తన 'చిట్టా' ఏ దశలోఉందో, ఎంతవరకు చలనం కలిగిందో, ఇంకా ముందుకు సాగటానికి ఏ రకమైన 'చర్యలు' తీసుకోవాలో ప్రత్యక్షంగా కనుక్కొని పోదామని వచ్చిన అభ్యర్థిని సెక్రటరియేట్ భవనం గేటు ముందరే నీ 'పాస్' ఏది? అని నిలవేసి అడుగుతున్నారు. అతను తెల్లబోయి చూస్తున్నాడు 'పాస్' లేనిమాట నిజమే! 'పాస్' తీసుకోవటానికి వీల్లేని మాటా నిజమే! లోపలికి వెళ్ళాలంటే రెండు ప్రశ్నలకు సమాధానం చెప్పాలిసి ఉంటుంది మొదటిది.

రాజధాని కబుర్లు

ఈ రెంటికీ సరియైన సమాధానం చెపితే ఆనాటికి లోపలికి వెళ్లటానికని తాత్కాలికంగా 'పాస్' జారీ చెయ్యటం జరుగుతుంది. అదైనా, కలుసుకోవా లనుకుంటున్న ఆఫీసర్‌కు ముందుగా ఫోన్‌చేసి, ఆయన రమ్మనమని అనుమతిస్తేనే! ఈ అభ్యర్థి ఎవరో మొర పెట్టుకోవటానికి వచ్చిన బాపతు అయితే ఆ ఆఫీసరుకు పరిచయమూ ఉండదు; ఆయన రమ్మనటం అంతకంటె జరగదు. అలాంటి పరిస్థితిలో ఈయనగారు గేటు ఇనప చువ్వలు లెక్కపెట్టుకుంటూ నిలబడిపోవాల్సిందే!

ఇక్కడ రెండు మూడు విషయాలు ముఖ్యంగా కనిపిస్తాయి. ఏ విషయాన్నైనా ప్రభుత్వంవారు నిర్ణయింపబడిన రూలు ప్రకారం క్రమబద్ధంగా పరిష్కారం చేసే పద్ధతిని, సమర్థవంతంగా అమలు పరుస్తున్నారా! ప్రభుత్వంవారు ఇలాంటి సక్రమమైన చర్యను తీసుకుంటారని ప్రజల్లో విశ్వాసం ఉందా! ఒకవేళ లేకపోయినట్లయితే దానికి కారకులెవరు? ఈ అవిశ్వాసానికి ప్రభుత్వం ఎంతవరకు బాధ్యత వహిస్తుంది? ఇలాంటి ప్రశ్నలు ఎన్నో ఉదయించక మానవు. ఈ సామాన్యమైన అభ్యర్థి తనకు న్యాయం కలుగుతుందని నమ్మకం కుదరక, ప్రత్యక్షంగా తన గోడును విన్నవించుకోవటానికి అవకాశం దొరక్క, మధ్యలో నలిబిలియిపోతున్నాడు. అందువల్లనే, ఏ అభ్యర్థి కూడా తనకు తానై కాగితం వెంట కదిలి వెళ్లాలి అనే మనస్తత్వాన్ని విడనాడేటట్లు న్యాయంగా, క్రమశిక్షణగా ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరిస్తుంది అనే నమ్మకం కలిగేటట్లు ప్రభుత్వం ప్రవర్తించిననాడే ఇలాంటి చిన్న చిన్న చర్యలవలన సత్ఫలితాలు కలుగుతాయి.

అయితే ఇక్కడో విషయం చెప్పాలసి ఉంటుంది. సచివాలయ భవనాల్లోకి వెళ్లటానికి ఏర్పాటు చేసిన ఈ 'పాస్' సిస్టమ్ ముఖ్యంగా మనదేశంలో ఏర్పడిన అత్యవసర పరిస్థితిదృష్ట్యా చేసింది. అవును నిజమే. ఇది ఎంతైనా అవసరమే! గూఢచారుల బారినుండి, 'ఇంటిదొంగల' దేశద్రోహ చర్యల్నుంచి మనం రక్షింపబడాలి. ఇలాంటివాళ్లంతా విచ్చలవిడిగా లోపల ప్రవేశించి, యథేచ్ఛగా తమ కార్య కలాపాల్ని సాగిస్తూనే వచ్చారు. లోపలున్న సిబ్బందికి పరితూగేటట్లు జనం కిటకిటలాడుతూ ఉండేవాళ్ళు. వీళ్లకూ హద్దూ, పద్దూలేదు. అమాంతం వెళ్ళిపోవటం, సంబంధించిన శాఖ ఆఫీసులోకి జొరపడటం, కాస్త పరిచయం చేసుకున్నా, గంటల తరబడి మాట్లాడేసెయ్యటం, దీంతో పని ఆగిపోవటం, అసలే తికమకలతో తన్నుకుపోతున్న ఫైళ్ల జీవితాలు ఇంకా పొడుగవటం, ఇవన్నీ చాలా వరకు తగ్గినాయి. బాతాఖానీకోసం ప్రత్యేకంగా పని పెట్టుకుని, సచివాలయంలోకి ప్రవేశిస్తున్న 'తీరిక మనుషుల' సందడి చాలావరకు తగ్గిందనే చెప్పాలి. అసలు ప్రయోజనాన్ని సాధించాలంటే ప్రభుత్వ దృష్టిలోనే గొప్పమార్పు రావలసి ఉంటుంది.

ఈ ఆఫీసులచుట్టూ తిరిగేవాళ్లను, ఇక్కడి ప్రజలు పైరవీకార్లని అంటూఉంటారు. వీళ్ల పని కేవలం పరోపకారమే! ఆఫీసులకు సంబంధించిన ఏ పనైనా సరే ఇట్టే చిటికలో చేసిపెడ్తారు. వీళ్లకు అసాధ్యమైన పనంటూ ఏమీ ఉండదు. తెల్లారి లేచినప్పటినుంచి వీళ్ళు చేస్తున్న ప్రజాసేవకు తగిన



జనవరి 14 విడుదల
MAV PICTURES
ఎం.ఏ.వి. పిక్చర్సు వారి
ఎదురీత
రచన ఆచార్య ఆత్రేయ
సంగీతం కె.వి. మహాదేవన్
నిర్మాత ఎం.ఏ. వేణు
స్టుడియో రత్నా (సేలం)
దర్శకత్వం బి.ఎస్. నారాయణ
రాజశ్రీ రిలీజ్
BHARATH STUDIO

రాజధాని కబుర్లు

ప్రతిఫలం పొందుతూనే ఉంటారు. వీళ్ల పరిచయాలు బహుముఖాలు. వీళ్ల మనస్తత్వం అందుబాటులో ఉండదు. వారి భాషే వేరు! వారి మాటలకు అంతకంటె అర్థాలు వేరు. సూటిగా, ప్రత్యక్షంగా మాట్లాడరు. వారి మాట లన్నింటిని క్రోడీకరించి, వాటిలోని భావాన్ని నీరక్షీరన్యాయంగా విడదీసి, అవసరమైనవాటిని గ్రహించుకోవాలి. ఉదాహరణకు కాగితానికి బరువేమైనా పెట్టారా, చెయ్యి 'గరం' చెయ్యాలండీ! ఇలాంటి భాషకు అలవాటు పడటంలో మొదట్లో తికమకలు తప్పవు. మనస్సు మనస్సు కలిసిన తర్వాత, అభ్యర్థిని పిండి, పిప్పిచేసి, కార్యాన్ని సాధించుకు వస్తాడు. ఈమధ్య నేను సెక్రటరియేట్‌కు వెళ్లటం తటస్థించినప్పుడు ప్రత్యక్షంగా విన్నవీ, కన్నవీను! ఈ 'పాస్' సిస్టమ్ ప్రవేశపెట్టిన తర్వాత వీళ్ల రేటు గిరాకీ పెరిగిపోయింది. లోపల ఏమవుతోందో తెలుసుకోవటానికి వీల్లేదు. వీళ్లకు ఇలాంటి అడ్డంకులు ఏమీ ఉండవు. ఎవరో ఉద్యోగిపేరు చెప్పి, లోపల ప్రవేశించి, సాయంత్రందాకా తాపీగా ఉండి, అన్ని పనులు చేసుకుని బైటపడే ధైర్య సాహసాలు ఉన్నాయి. వీళ్ళకు కేవలం ఈ సచివాలయ భవనాలతోనే సంబంధంకాదు. పూర్తి ప్రభుత్వ యంత్రాంగం వివిధ శాఖలతోనూ సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకుని ఉంటారు. వీళ్లకు హృదయపూర్వకమైన మద్దతు యిచ్చే ఇతర జాతి ప్రముఖులు అండదండలుగా ఉంటారు. ఇంటి ప్లాను ఆమోదింపచేయటానికి, కంట్రోలు వస్తువుల్ని మంజూరు చేయించటానికి పెన్షన్ నిర్ణయించటానికి, గవర్నమెంటునుంచి డబ్బు రాబట్టటానికి, కొత్తవాటికి లైసెన్స్‌లు ఇప్పించటానికి వీరు చేస్తున్న ప్రజాసేవ అమోఘము, అనిర్వచనీయము.

ఎన్ని రూల్సుపెట్టినా, ఎన్ని అడ్డంకులు ఏర్పరిచినా, ప్రత్యేకంగా పని పెట్టుకుని ఉల్లంఘించేవారు ఉండనే ఉంటారు. వారి విషయంలో మనం బాధపడనక్కరలేదు. చట్టంయొక్క అమలు ఖచ్చితంగా చేస్తూ ఉంటే, వారికి తగిన శాస్తి జరుగుతూనే ఉంటుంది. ఇంతకీ పరిపాలనలో న్యాయము, పక్షపాత రహితంగా ప్రవర్తించటం, ఒక సిద్ధాంతాన్ని ప్రవేశపెడితే, దానిని అందరికీ ఒకే మనస్తత్వంతో వర్తింపచేయటం, ఒక కాల పరిమితిలో ప్రతి సమస్య పరిష్కరింపబడేటట్లు ఖచ్చితంగా చర్యలు తీసుకోవటం అవసరం. 'క్లీన్ అడ్మినిస్ట్రేషన్' అనే మాటను నూటికి నూరుపాళ్లు అర్థవంతంగా ప్రవేశపెట్టిననాడే ప్రజల్లో ఏర్పడ్డ ఈ అసంతృప్తి, అలజడి, ప్రభుత్వంమీద తీవ్ర విమర్శ సమసిపోతాయి. ఏదో చిన్న ఉద్యోగస్తుడు అవసరానికని నాలుగు రూపాయలు తీసుకున్నంతమాత్రాన పెద్ద గజదొంగను పట్టేసినట్లు పట్టుకొచ్చి, ఎంక్వైరీ చేసి, గభాలున డిస్‌మిస్ చేసినంతమాత్రాన ఈ సమస్య పరిష్కారమయ్యేదికాదు. ఎంతసేపటికి తప్పులు చేస్తున్నారనే గోలే కాని, అవి ఎందుకు చేస్తున్నారో తెలుసుకోవాలని తాపత్రయం కనబడటంలేదు. పైపైన ఈ తప్పుల్ని దండించినంతమాత్రాన అసలు విషయం మరుగుపడి పోదు. నిర్దుష్టంగా, నిర్మలంగా, దక్షతతో పరిపాలన సాగినప్పుడే ఇలాంటి మరకలు క్రమ క్రమంగా మాసిపోగలవు. ★

ఐ. ఎల్. ఎన్.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press 6 & 7, Thambuchetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.



ప్రసిద్ధి చెందిన
శంఖు బ్రాండ్
EVERSHINE
STAINLESS STEEL
స్టెయిన్‌లెస్ స్టీల్
పాత్రలు వాడండి
MOHAN Art
ఫోన్. 2066
తయారు చేయువారు
గ్రామ్స్... ఎవర్‌షైన్
శ్రీ వెంకటేశ్వర స్టెయిన్‌లెస్‌స్టీల్ & కాపర్ వర్క్సు
సి. కె. ఇండస్ట్రియల్ ఎస్టేటు...... విజయవాడ- 7.